సృజన



అడవిలోని వెన్నెల
ట్రిగర్ నొక్కి అడవిలో చంద్రుణ్ణి
వెలిగించిన
అమరుల రక్తానికి తెలుసు



ఆదివాసుల పోరాటాలలో
అమరులైన వీరులకు
ఈ సంచిక అంకితం

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

150 మాసపత్రిక ఏప్రిల్ 1984

ంపాదకీయం		2
విత :	అడవిలోని వెన్నెల — శివసాగర్	5
	ప్రతిబింబం — అన్న	33
	ఎర్రరేకులు — గంగన్న	34
	తుపాకిమోతలమధ్య — గోదావరి	35
	ఆయుధాలన్నీ నగ్నంగానే వుండవు — ఉషాఎస్‌డానీ	36
	సాత్‌నాలా — వి.వి.	37
	నిప్పురవ్వ — వెంకన్న	39
	అడవి మీద సూర్యుడు —	40
ాట :	పరియగోండు పాటలు	57
థనం :	రగల్‌రాజ్యం మైసివాకట్-తొడసం జంగు	8
ేపథ్యం ;	గడ్‌చిరోలీ ఆదివాసి జనజీవితం-సంస్కృతి-సాధన	41
థం ;	కమలాపూర్ బాటలు మూస్ని కాంతినిఅరికట్టగలరా ?- అనూరాధ	60
థ్యం :	'మానవతావాదం మత్తుమందు — ఏకనాథ్‌సాల్వే	73
పోరాట చిత్రం :	ఆదిలాబాద్ అడవికథలు — ప్రాణహిత	75
సమీక్ష వ్యాసం :	కొమురం భీం — సురా	84

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా రు. 20 ఈ సంచిక రు. 4

కదలబారిన అడవి

అధికారానికై తే వస్తావుగానీ అడవి కదలివచ్చి నిన్ను అంతం చేస్తుంది అని మాక్‌బెత్‌కు సోది చెప్తారు సోదెమ్మలు.

ఆంధ్రప్రదేశ్ అధికార పీఠం విధాన పరిషత్, విధానమండలులలో ఈసారి అడవి కదలికగురించి చాలాఆందోళన చెందింది. భద్రాచలం అడవుల్లో అడివన్నల అనుమతిలేకుండా చీమయినా దూరే పరిస్థితి లేదని భారత కమ్యూనిస్టుపార్టీ బావురుమంటే, నిజామాబాదు జిల్లాలో ఫారెస్టర్ కోసం శాసనసభలో పజ్జీస్కన్నీరు బిజెపి మున్నీరయింది. ప్రజాప్రతినిధులు- రహస్య సమావేశాల్లో ప్రాణరక్షణకోసం ఆయుధాల లైసెన్సుల గురించి మాట్లాడుకోవాలని అనుకుంటుండగానే అల్లూరి సీతారామరాజు అలనాడు పోలీసుస్టేషన్‌పై దాడిచేసిన కృష్ణదేవిపేటలో భూస్వామి ఇంట్లోని తుపాకులు వాటి కన్నతల్లి అడవి ఒడిలోకి చేరిపోయినవి. అడవులను బయళ్ళుగా మారుస్తున్న కాగితప్పరిశ్రమల లారీలు తగలబడిపోతున్నాయి. తునికాకు ఏరుతున్న వేళ్ళలో సమ్మె జెకుముకి మండుతున్నది. చెట్లు నడవడంనేర్చుకున్నాయి. నడుస్తున్న పోలీసువ్యానులు అడవిలో చిక్కుబడిపోయాయి. పోలీసు వైర్‌లెస్ సెట్ల కన్న తుడుంమోత అలలు అలలుగా సాత్నాలా అయి కొండగోగుల గుండెల్లో ప్రతిధ్వనిస్తున్నది.

మాక్‌బెత్ అధికారానికి రావడానికి మంచి తోవ ఏదీ లేదు. అధికారంలో వున్నవాళ్ళను, అధికారంలోకి రాగల వాళ్ళను చంపితేతప్ప అయ్యేపనికాదు. అయినా సోదెమ్మలు చెప్పారు కనుక చేసి చూడమన్నది లేడీ మాక్‌బెత్. హత్యలు చేసి చేతులు కడుక్కొని అధికారానికి వచ్చాడు మాక్‌బెత్. అడవి యావ మరచిపోయాడు. కాని అడవి కదలబారింది.

ఇంద్రవెల్లిలో దూరంగా చెరువుకట్ట వెనుకనుంచి సభా స్థలానికి నాలుగు చెరుగులా పరుగుపెట్టి వచ్చిన గోండుల గురించి అప్పటి ఎస్పీ సరిగ్గా మాక్‌బెత్‌లాగానే- అడవి సాయుధంగా కదలివచ్చినట్లు అనిపించింది -అని చక్కటి ఇంగ్లీషులో చెప్పాడు. అందుకే అధికారం నిలుపుకోవాలంటే బుల్లెట్లకు నియమాలుండవన్నాడు. సౌకర్యార్థం పాలకవర్గాలకు తెలివితక్కువవాడిగా కనిపించిన అంజయ్య కూడా చాల తెలివిగా 'వాళ్ళది వార్‌పార్టీ అట. యుద్ధం ఇక ఫల్లలతో చేస్తామా' అన్నాడు-అందుకని అరవై మందిని బులెట్లతోనే కూల్చేసాడు.

ఇంతచేస్తే సమస్యపాలకుల సమస్య ! “చెట్లే అడవికావు”గానీ పౌరకలుపార్టీ కదిలితే అది అడవి ఉద్యమం అవుతుంది. అప్పుడు నక్సలైట్లు ప్రజల్ని, జనపదాల్ని వదలి అడవిలో తలదాచుకుంటారనే కల్పనా సాహిత్యానికీ, “మరీచికా” వాస్తవాలకూ, కమలాపురానికి భారతదేశంలోని ఎన్ని అడవుల నుంచి బాటలు పడ్డాయో ఎన్నటికైనా

తెలుస్తుందేమో కాని ఆ బాటలు ఏ "ప్రజాపంథా"లో విలీనమైనవో కళ్ళు తెరిస్తే తప్ప ఎప్పటికీ తెలియదు.

ఈ ఉపఖండంలో చిన్నవాగు మొదలు జీవనది దాకా పేర్లున్నాయి. గుట్టకు, చెట్టుకు కూడా పేరుంది. దండకారణ్యాలు నల్లమల అడవులవంటి పెద్దపేర్లు తప్ప అడవికి పేరు లేదు. అడవినగాస్తే వెన్నెలే మాసిపోతుందనుకున్న వాళ్ళకు ఆదివాసుల జీవితాల్లో వెలుగూ వెన్నెలలూ ప్రసరించే వర్గపోరాటాలు తలెత్తే వరకు సూర్యచంద్రులు విదేశీయాలైనవి.

అడవి కలిసేవుంది. ఎందాకా? ఎందాక ప్రజాపంథా స్థిరంగా స్థైర్యంగా సర్వే చేయగలిగితే అందాకా. భద్రాచలం నుంచి బస్తర్ దాకా, శ్రీకాకుళం నుంచి సిల్గురి దాకా అడవి కదుల్తూనే వుంది. అడవి కదలికను ఆపడానికి ఒక రోడ్డు, ఒక రైలు మార్గం వుండొచ్చు అనేకరోడ్లు, అనేక రైలుమార్గాలువుండొచ్చు.అడవి కదలికలు కొల్లగొట్టడానికి టాటా బిర్లా దాల్మియాలు వుండవచ్చు. మైదాన ప్రాంతాలనుంచి వచ్చే భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, వారి అంగరక్షకులైన ఫారెస్టు అధికార్లు, పోలీసులు వుండొచ్చు.

చంద్రపూర్ నుంచి రేపనపల్లె దాకా ఖాకీ యూనిఫారాలు కదలబారితే గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగ, ఇంద్రావతుల నీటిలో చేపలై ఈదుతూ కమలాపూర్ చేరుకునే వాళ్ళు చేరుకుంటూనే వుంటారు. శత్రువు కన్నుకప్పి ప్రజలు నడిచినవన్నీ బాటలే అవుతాయి. చెదరగొట్టిన ఒక సభ-సంక్షోభతరంగాల్లో ఒక చంద్రుడు ఎన్నో ప్రతిబింబాలై కనిపించినట్లు-ఎన్నో సభలవుతుంది. రెండురోజుల కార్యక్రమాలు నిర్బంధంవల్ల జైలునిండి, బయలునిండి మైదానాల నిండా, పత్రికల నిండా మాట్లాడుకునే కదలికలవుతాయి.

పోరాటంలో భాగమైతే సభ సంచలనమైనట్లుగానే, పాట బాంబు అయినట్లు గానే, ఆదిలాబాద్, కరీంనగర్ రైతాంగ పోరాటంలో భాగమైతే- అడవి ఉద్యమం అవుతుంది. అడవి అరణ్యవాసం కాదు. అడవి అజ్ఞాతవాసం కాదు. అడవి తల దాచుకునే చోటుకాదు. తప్పుకుని తిరిగే చోటుకాదు. అది పల్లెకు పట్టు. పోరాటానికి గుట్టు. పల్లెనుంచి ఢిల్లీకి దారి అడవి. అది గోదారి పొడుగునా కదలబారింది.

పోతులూరి వీరబ్రహ్మంగారు కూడా 'ఒక పిష్టామయోగ్ని అధికారానికి వచ్చాక గానీ ఈ దేశంలో స్వచ్ఛమైన ప్రభుత్వం ఏర్పడద'ని చెప్పాడు. ఆయన కాషాయాంబరధారియై ఒంటి చెవిపోగు పెట్టుకుంటాడని చెప్పాడు. ఈ దేశంలో

అవినీతి, లంచగొండితనం అక్రమాలు లేని స్వచ్ఛమైన ప్రభుత్వాలు ఏర్పడాలని కలలుగనే రాడికల్ మానవతావాదులు ఈబ్రహ్మంగారి వచనాలు నమ్మడానికి సిద్ధంగా వున్నారు. అందుకే తెలుగు సంస్కృతీ చరిత్ర చెప్పదలుచుకున్న విజ్ఞానపీఠంలో హస్తసాముద్రికం కోర్సు ప్రవేశపెట్టారు. ఆంధ్రదేశాధీశ్వరుణ్ణి కేంద్రప్రధానిని చేసి తీరుతానని ఒక రామజోగి జోస్యం చెప్పాడు. దక్షిణుణ్ని ప్రధానిని చేయడానికి ప్రతిపక్ష దక్ష వాజపేయం ప్రారంభమైంది మరొకవైపు మాక్‌బెత్‌ను రాజును చేసి తీరాలన్న రాజ్యదాహంతో లేడీ మాక్‌బెత్ కుట్రలు చేస్తూనేవుంది. (రాజు కాబోయిన సంజయ్‌గాంధీని అడవి కాదుగాని ఆకాశం బలిగొన్నది) పార్లమెంటు అడవి చట్టాలు చేస్తున్నది. ఆంధ్ర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సాప్రభుత్వాలు అడవిని దిగ్బంధం చేస్తున్నవి.


అడవికి పోడు వ్యవసాయం తెలుసు. అడవికి పోరు వ్యవసాయం కూడ తెలుసు. అడవికి జానపదవాణీలు తెలుసు. ఇపుడవి ప్రజల పాటలవుతున్నవి అడవికెన్నో భాషలున్నవి. ఇపుడన్నీ "దున్నేవానికే భూమి" భాష మాట్లాడుతున్నవి. అడవి విడిగా వుండాలనుకోవడం లేదు. అనాదిగా, అనాగరికంగా వుండాలనుకోవడం లేదు. మేల్కొన్న గ్రామాల నాగేటిచాళ్ళలో అడవి విత్తనం కాదల్చుకున్నది. జనపదాల మౌఖిక సంప్రదాయంలో కదంతొక్కే కదనానికి కవాతు కాదల్చుకున్నది.

ఇంద్రవెల్లిలో చిందిన రక్తం సాత్నాలలో ఏ ప్రతిఘటన చూసిందో, పెద్దిశంకర్ చేసిన త్యాగం గడ్‌చిరోలిలో ఏ కదలిక తెచ్చిందో కోటమీంచి చూస్తున్న మాక్‌బెత్‌కు తెలుస్తూనే వున్నది. ఎర్రకోటవైపు అడవి కదలిపోతున్నది. ఇప్పటికిది ఎర్రకోటమీద మూడురంగుల జెండా కొనసాగిస్తున్న మూడు దోపిడీలను ఎదిరిస్తున్న మూడు రాష్ట్రాల గూడాలపై ఎగురుతున్న జెండాయేకావచ్చు. ఇప్పుడిది నిప్పురవ్వేకావచ్చు. కాని అప్పుడే ప్రజాశత్రువుల గుండెల్లో ఇది కార్చిచ్చువలె మండుతున్నది. అందుకే అడవి కదలడమేకాదు. దావానలమై వ్యాపిస్తున్నది.

కొండసిగన జ్వాలాతోరణమై వెలుగుతున్న ఉద్యమం వెలుగులో ఇపుడింక అడవిని అవగాహన చేసుకుందాం. ఆవాహన చేసుకుందాం. ఆవిష్కరిద్దాం.

11-4-84

పెద్ది శంకర్
నవంబర్ 2, 1980




ఆత్రం అశోక్
మార్చి 23, 1983




పల్లె కనకయ్య
ఆగష్టు 30, 1983

ఆత్రం అశోక్ గుండెల్లో గుండుదూర్చి
అన్నలనుంచి రత్నాపూర్ 'ఆత్మరక్షణకు'
తుపాకీ ఇస్తానన్న అధికార్ల   మానవత్వం సాక్ష్యం
సిరోంచ చెన్నూరు తీరాలను
ఒరసిపారిన
పెద్దిశంకర్ పల్లెకనకయ్యల
జీవధార సాక్ష్యం




గజ్జెల గంగారాం

సెప్టెంబరు 8, 1981



గంగరాజం

జనవరి 12, 1983



భూపతిరావు

డిసెంబర్ 27, 1983

అడవిలోని వెన్నెల

—శివసాగర్

అడవిలోని వెన్నెల
ఆలోచనల పర్వత శిఖరాగ్రం మీద
నిటారుగా నిలబడింది

ఆది అడవిలోని
ఊళ్ళపై, లేళ్ళపై
సెలయేళ్ళపై నేడు ప్రసరిస్తోంది

అది నిర్బంధాల పెనుచలిలో
ఆశయాల ఉక్కు కవచం తొడుక్కొని
ట్రిగర్ మీద వేలితో
ఇప్పుడు నడుస్తోన్న చరిత్రకు
రేయింబవలు సెంట్రీ కాస్తోంది

అది జనశక్తికి
కత్తుల కవాతు నేర్పుతోంది
అది కాలానికి
కాషన్ పలుకుతోంది

అడవిలోని వెన్నెల!
బహుపసందయిన వెన్నెల!
అది త్యాగాల యూనిఫారం ధరించి
మేఘాలను నేలకు దించుతోంది!

○ ○ ○

మైదానం గజ్జెకట్టితే
అడవి తుడుం మోగిస్తుంది
మైదానం పెద్దపల్లి అయితే
అడవి ఇంద్రవెల్లి అవుతుంది
మైదానంలోని ఓరుగల్లు

అడవిలో ఖోరుగల్లుగా మారుతుంది
మైదానం దాటిన గోదారి
అడవిలోని ప్రాణహితను పెనవేసుకొని
జలప్రళయానికి పల్లవి పలుకుతుంది
అడవీ మైదానం కలగలిస్తే
జన చరిత్ర ఒక తరం ముందుకు నడుస్తుంది.

ం ం

అడవిలోని వెన్నెల!
రేలా రేలా వెన్నెల!
రేలాపూల వెన్నెల!
రేచుక్కల వెన్నెల!
రేయింబవలు వెన్నెల!
అడవిలోని అన్నల
కన్నుల్లో వెన్నెల!
అడవిలోని అన్నల
గన్నుల్లో వెన్నెల!
రేలారేలా వెన్నెల!
రేలాపూల వెన్నెల!
రేచుక్కల వెన్నెల!

(నాలోని ఆలోచనలు అడవిలోని వెన్నెల్లా...)

సంపాదకునికి లేఖ

సంపాదకా!

అడవిలోని వెన్నెల
నిరర్థకమన్నాడు
అంతఃపురకవి

అలాగే అంటాడు మరి!
వాడు నూతిలోని కప్పడు!

అడవిలోని వెన్నెల
నిష్ప్రయోజనమన్నాడు
ఆస్థానకవి
అనకేం చేస్తాడు?
వాడు కాసుకు దాసుడు

అడవిలోని వెన్నెల
అంతఃపురానికేమి తెలుసు?
ఆస్థానానికేమి తెలుసు?
అవకాశవాదానికేమి తెలుసు?

అడవిలోని వెన్నెల
అడవికి తెలుసు
అడవిలోని వెన్నెలకు తెలుసు
అడవిగుండెలోని గోండన్నలకు తెలుసు
అడవిలోని వెన్నెల
ట్రిగర్ నొక్కి అడవిలో చంద్రుడ్ని వెలిగించిన
అమరుల రక్తానికి తెలుసు
అది చింకాంగ్ కొండలకు తెలుసు
అది అరణ్యాల ఆలోచనకు తెలుసు

అడవిలోని వెన్నెల
అవకాశవాదానికేమి తెలుసు?

ఉంటాను
భవదీయుడు
శివసాగరుడు

క థ న ం :

రగల్ రాజ్జెం మైసివాకట్

తొడసం జంగు

పశువుల కాపర్లు పశువులను లొద్దులకు తరలిస్తున్నారు.... పశువుల అరుపు లకు లొద్ది ప్రతిధ్వనిస్తోంది.... కోపంగా, అసహనంగా పశువుల కాపర్లు వేసే కేకలు.... ఎక్కడెక్కడ జీవాలు తిరుగుతున్నాయో ఒకరికొకరు చెప్పుకునే హెచ్చ రికలు ఒకపక్క, ఇంకొకపక్క మేకలను అడవికి తోలుకెల్లుతూ పిల్లలు పాడే పాటలు— మేకల తుమ్ములు— మొత్తానికి ఊరి బయట యమసందడిగానే వున్నది.... మామూలుగానైతే ఈపాటికి ఊళ్ళో ముసలివాళ్ళు మంచాలమీద పసి పిల్లలు తప్ప మరోపురుగు వుండేది కాదు. కాని ఈరోజు వూరువూరంతా తుకతుక వుడుకుతంది.... మరాఠా రైతులు పిసపిసలాడుతూ గుడిసెల చూర్లకింద సాగిసాగి ముచ్చెట్లు బెట్టండ్లు- తెలుగువాళ్ళు మరాఠావాళ్ళలాగే ఓరఓర చూస్తూ వాళ్ళ గుజులు కడుతున్నారు. ఇంకోపక్క గోండ్లు అట్లాగే తమ జాతివాళ్ళతో కలిసి ఎడ తెగని ముచ్చెట్లు బెడుతున్నారు.... ఆ ఊరుకు దక్షిణం, తూర్పు దిక్కు పలుచగా విప్పచెట్లమధ్య కనుచూపు మేరదాకా వ్యాపించిన పంటభూములు.

ఉత్తరం, పడమర ఎత్తయిన గుట్టలు. గుట్టలమీద అడవి అప్పుడప్పుడే ఆకులు జాడిస్తూ చెట్ల మొదళ్లు... బండలు కనిపిస్తున్నాయి. ఊరు తూర్పునుంచి పడ మటికంటా వ్యాపించి వున్నది.... పడమటికేసి గుట్ట ఊరి చివరనుండే ప్రారంభ మౌతుంది...

ఊరు ఆఖరైనచోట బొగడమీద ఆ వూరికి వచ్చే అధికార్ల కోసం వేసిన బంగళా (గుడిసెనే బంగళా అంటారు) ఉన్నది. దానికి రెండు పక్కలా రెండువిత్తైన విప్పచెట్లున్నాయి.... ఆ బొగడకు దిగువన వందగజాల దూరంలో ఆపక్క ఈపక్క అశ్రద్ధగా వేసుకున్న గోండుల గుడిసెలు .. గట్టిగా గాలివీస్తే కూలిపోయేటట్టు న్నాయి.... గుడిసెలు పేదపేదగా దరిద్రం వాసనవేస్తున్నాయి. ఆ గుడిసెల్లోని మను షులు ఎండుకుపోయిన డొక్కలతో, ఆకలి ముఖాలతో మాట్లాడటమే పెద్దసాహస కార్యమయినట్లుగా వున్నారు.

గూడెం పటేల్ (పెద్ద) ఎగోదిరావు గుడిసెలోనుంచి బయటకొచ్చాడు. నోట్లో కంటావంగినమీసాలు- వికృతంగా పొడుచుకొచ్చిన ఎముకల ముఖం, అసలే ముడు

చుకపోయున్నది... కండ్లకు చెయ్యడ్డం పెట్టుకొని పొద్దుకేసి చూశాడు.... ముఖం మరింత ముడుచుకపోయింది... కోపం, అసహ్యం మరింకేమి కలిగాయోగాని కాండ్రకిచ్చి ఉమ్మేద్దామనుకున్నాడు... ఉమ్మిరాలేదు. "పొరకలసార్లచ్చే ఏల్లయ్యింది. ఓరి భూములు, ఓరి (ఎవరి) జాగలు.... కల్లేసర్కారు- ఝూటాకానూన్" గొనుగుతూ.... "ఇస్రూ" అంటూ కీచుగా కేకేశాడు.... రెండు గుడిసెల అవతలి నుంచి నల్లటి యువకుడొకడు పెదవులకంటిన అంబలి నాక్కుంట చేతుల చిప్పతో నేబయట కొచ్చాడు...

"ఇంకా తిండి కాలేదుర- తుడుం గొట్టపో... పంచాది మర్సినవా?". అన్నాడు ..

ఇస్రూ నీళ్లు గటగట తాగి తుడుం తీసుకొని బొగడమీది బంగళా దిక్కు పరుగెత్తాడు.

"టట్టర....టట్టర....టరటర....టరటర...." తుడుం మోగుతోంది గాభరగాభరగాకాకుండా ఉండీ ఉండీ- గుడిసె గుడిసెకు మనిషిబోయి పిలిచినట్లుగా.... తుడుం మోగుతోంది. గోండు గుడిసెల్లో కలకలం.... ఒక్కొక్కరే - ఎముకలు తేలిన వాళ్ళు - చిరిగిన బట్టలవాళ్లు, కంపలోటి నెత్తులున్న స్త్రీలు - పిల్లల నెత్తుకొని ఒక్కొక్కరే బొగడమీద చేరుతండ్లు - తుడుంమోత వినవచ్చినంతమేరకు చుట్టు పక్కల గూడాలవాళ్లు ఆ ఊరికేసి నడువ సాగిండ్లు.

ఇక తూర్పుకు విస్తరించిన ఊళ్ళోని మరాఠా రైతులు, లంబాడీలు- తెలగలు గునుస్తూ, తిడుతూ, వాళ్ళు మందలు మందలుగా బొగడకేసి నడిచారు. ఊరు ప్రారంభమయ్యే దగ్గరి పెద్ద పెంకుటిండ్లలోని మక్తేదారు అహమ్మదాలి "మీరేం గాభరాపడద్దు... డర్ నామత్...గోండువాల్లోంకా బాతోమే..." మాటమధ్యలోనే ఆపి గడ్డం లీడుకున్నాడు... ముఖం మీద అసహ్యంగా పేరిన నూనెకేసి చూస్తూ మరాఠీ రైతు శంభు, తెలుగురైతు నారాయణ తలలూపారు. వాళ్ళు కూడా బొగడకేసి నడిచారు....

"అంతయిపోయినంక క్యాంపు బెడ్తనంటది సర్కారు .ఫిర్ ఫాయిదా క్యాహై- ఉల్టావాళ్ళకి మేపలేక తోబా తోబా అయిపోతది.... తెరిమాకా యే పొర్కల పార్టీ వాలేంకో - కిందబెట్టినా పంచాదే - మీదబెడితే పంచాదే.... కాలం మంచిగరాలే దేఖ్‌నా? తెరిమాకా యే జిరాతిమే బిల్‌కుల్..." ఇంకా ఏమాలోచించాడో...

"రహమతేక మా బులారహీ ... (రహమత్ అమ్మ పిలుస్తోంది. ముస్లిముల స్త్రీల పేరు వాడుక) సన్నని గొంతు. ఆలోచిస్తూ - లుంగీ మోకాళ్ల దాకా ఎత్తి పట్టుకొని, స్లిప్పర్లు టకటకలాడిస్తూ పరదాల్లోపలికి నడిచాడు.

ఇక బొంగడ దగ్గర దాదాపు అయిదువందలమందిదాకా జమయ్యారు. తుడుం ఆగిపోయింది. అక్కడ అంతమంది జమైనా బంగళాకు చెరోపక్క రెండు గ్రూపులుగా విడిపోయి జనం కూర్చున్నారు. ఒక పక్క గోండు వాళ్ళు ఆ వూరివాళ్ళేకాక చుట్టుప్రక్కల గూడాల నుంచి వచ్చినవాళ్ళు కూర్చున్నారు...ఇంకా వచ్చేవాళ్లు వస్తూనే వున్నారు. ఇంకొకపక్క మరాఠా, లంబాడా, తెలుగు గిరిజనేతరులు కూర్చున్నారు. గిరిజనేతరుల్లో కొద్దిగా భూవసతి గలిగినవాళ్లు మరీ దిగాలుపడి కూర్చున్నారు. లంబాడీవాళ్ళ ముఖాల్లో ఏ భావమూ కన్పించడం లేదు.

అక్కడ ఇరుపక్షాలల్లో మోహరించి కూర్చున్నవాళ్లంతా ఎవరేం మాట్లాడుతున్నారో తెలువకుండా గొనుగుతున్నారు. ఊరుపేరులేకుండా తిడుతున్నారు....

"అదికాదయ్యా .... ఒకటా రెండా ఒనరంగమూటా - నా కొంపముంచిండ్లు - నా ఇంటికగ్గి దల్గబెట్టిండ్లు .... ఇగో నా వొంట్లే గోరెడు మాంసం లేకుంట వొలుసుక తినుండ్లు - నా తోరగండ్లు నేను మీ గోంతు గుడిసెలముంగట ఉరిబెట్టుక సత్తం.," అన్నాడో పొట్టి రైతు అడికీడికీ తిరుగుతూ....

"సూడవోతే అంతేమరి, నోట్లే నాలికలేని గోండోళ్ళు తెగిచ్చిండ్లు, చేండ్ల మీనపడి కోసుకచ్చుకుంటే - మనము తా గోదాట్లేబడదాం - గవ్వాడు సర్కారుకు కండ్లునల్ల బడ్డయి, ఓర్నియ్యవ్వ పాపమా! అన్నాయమా? చేండ్లమీనబడి కోసుక పోవుడే?" నారాయణ మందిలో నుంచి ఎగేసిండు.

"మీరు మాత్రమ్ ఊకున్నారా?" ఎగోదిరావు...

ఆ మాట మీద రగడ లేచింది... అటునుండి ఇటు నుండి జనంలేచారు. ఒకరినొకరు తిట్టుకోసాగిండ్లు.. మరికొంతమంది దుబ్బను తన్నుతూ లేచివచ్చారు... ఎవడో మన్నుతీసుకొని" ఇగో మా పంటలు గోసుకొచ్చుకొని మా నోట్లే మట్టిగొట్టిండ్లు... ఆఖరుకు మీకు గీమన్నె మిగులుద్ది" అంటూ మట్టి కిందబడేశాడు...

గొండోల్లు దేషానికొచ్చిండ్లు... స్త్రీలు తిడుతున్నారు- చేతులు తిప్పుతూ అరుస్తున్నారు. అంతా మరికిగుడ్డలవాళ్లే... అంతా ఎముకలుతేలినవాళ్ళే- అంతా నిరు

పేదలే- కాని ఒకరినొకరు చంపుకుందామనుకున్నంత కోపంతో, కసితో ఒకరిమీది మరొకరు కాలు దువ్వుతున్నారు,

అప్పుడే పొరుగూరి నుంచి వచ్చిన భగవతిరావు ముఖంమీది చెమట తుడ్చుకున్నాడు ... ఊబ చెంపలు, చిన్నకండ్లు దొడ్డుపెదవులు.

"పంచాదు బెట్టుకొని కొట్లాడుతెట్ల-" అన్నాడు పెద్దబండమీదికెక్కి కూర్చొంకి అన్నట్లు చేతులూపిండు....

"ఇంకేంది అల్ల గోండునాయకుడచ్చిండు... తుపాకి తెచ్చుకోలేదా?" పందిల నుంచి మరాఠా కంఠం.

భగవతిరావు ఆ మాట పట్టించుకోకుండానే ముందు గిరిజనేతరులను గద్దువలు బట్టుకొని బతిమిలాడి కూర్చుండ బెట్టాడు. ఆ తరువాత గోండువాళ్ళను కూర్చుండ బెట్టాడు. అట్లా గోండులను శాంతపరుస్తూనే - తూర్పు, దక్షిణం వేపు తొవ్వలమీద కావలికోసం ఇద్దరు గోండుయువకులను పంపాడు. మరో ముసలివాన్ని, పిల్లవాన్ని అహమ్మదాలి ఇంటిదగ్గర కావలికి పంపాడు....

అప్పటికి సూర్యుడు నడినెత్తిమీదికి పాకుతున్నాడు. చేడ్లమీద తిరిగి తిరిగొచ్చిన గొర్రెంకలు తమ తావులయిన ఇప్పచెట్లమీద చేరాలనుకొనివచ్చి - అంత మందిని చూసి అల్లరిచేస్తూ పక్కలకు ఎగిరిపోతున్నాయి... ఎవడో బంగళాముందు నెగడిమొద్దులు సరిచేశాడు.. సన్నగా పొగలేచింది.

పొగపలుచబడ్డది... పడమటి గుట్టమీది నుంచి ముగ్గురు రావడం కనిపించింది....

"పొరకల సార్లత్తండ్లు - పొరకలసార్లు." గుసగుసలు... మాట్లాడుతున్న వాళ్ల మాటలాపిండ్లు- కొందరు లేచి లేచి వచ్చేవాళ్ళను చూసిండ్లు... ముగ్గురిలో ఒకతను కొద్దిగా ఎత్తు - ముగ్గురూ ధోవతులే కట్టుకున్నారు. ముతక అంగిలేసుకున్నారు.

బంగళాముందుకొచ్చి ఎత్తుగా ఉన్నతను "రామ్.. రామ్.." చెప్పాడు.. "రామ్.. రామ్" అన్నట్టుగ గోండువాళ్లు గొణిగారు. మిగతావాళ్ళు మూతులు ముడుచుకున్నారు...

ఒక్కసారిగా సీరియస్‌గా మారిన వాతావరణాన్ని ఉల్లాసపరుస్తూ.. ఎత్తుగా ఉన్నతను.. "మృగశిరకార్తె మబ్బుల తీర్గున్నది." అన్నాడు.. అట్లా అంటూనే

అందరికి కనిపించే విధంగా ఉండే జాగాను వెతుక్కొని ఓ బండమీద కూర్చున్నాడు. అతని వెంటవచ్చిన ఇద్దరు కొంచెం దూరం జరిగి చెరోవక్క విప్పచెట్లదగ్గర కూర్చున్నారు. ఊళ్ళెనుంచి వచ్చేదారిమీద చూపులు నిలిపిచూస్తున్నారు.

గోండు వాళ్ల మంచినీళ్ళు తెచ్చియిచ్చారు... కొద్దిగా ముఖంమీద జల్లుకొని - మరికొన్ని తాగి - పక్కవాళ్ళ కిచ్చిండు .. మూతితుడుచుకుంటూ లేచి నిలబడిరెండు పక్కల కూర్చున్న జనాన్ని చూశాడు ...

"ఇలాంటి సమయంలో మీటింగు బెట్టడం కష్టంగానే వున్నది" అని మళ్ళా "పేదలంతా ఒక పక్షంచేరి తాము ఇన్నేండ్లు పడ్డ బాధలకు కారణాలు తెలుసుకొని లడాయి చెయ్యాల్సిన సమయంలో - పేదలల్ల పేదలకే జగడం బుట్టింది... అగో అసొంటియాల్లల గీ పంచాతు. . నారాయణ పెద్దయ్య కాదంటవా?" అన్నాడు గిరిజనే తరులకేసి నడుస్తూ పొరకలసారు.

మందిలో కూర్చున్న నారాయణ ఔననలేదు కాదనలేదు. మళ్లీ పొరకలసారే కలగజేసుకొని

"సరే- ఎవరు ఏ వుద్దేశ్యంతోటి- పేదలకు పేదలకు, ఇక్కడంతా రైతులు కూకున్నరు గనక రైతులకు రైతులకు తాకులాట దెచ్చిండ్లో ఆ యింకమాట్లాడు కుంటాం. తగువైతే వచ్చింది... ఇది ఇప్పటి తగువుకాదని మీకెరికే... తగువెట్లా వొచ్చిందో మీరంతా ఎట్లాగు చెప్పాలటం- న్యాయమైన పద్ధతిలో.... మీకందరికీ అను కూలమయిన పద్ధతిలో తగువు తీర్చుకుందామంటే.... తగువు తీర్చద్ది లేపోతే పెంచు కుంటే పెద్దగయితది. నష్టపోయేది మాత్రం ఇద్దరు. అ సంగతట్లా ఉంచుండ్లి..." తనొక్కడు మాత్రమే మాట్లాడుతున్నట్లు గమనించి- "మరింక చెప్పండి..." అంటూ బండమీద కూర్చున్నాడు...

"ముడ్డికింద మంటబెట్టి సుతిపట్టుమన్నటున్నది..."అన్నాడొక మరాఠీరైతు...

"ఔ... ఔ అట్లనే ఉన్నది..." అన్నాడింకొకడు...

"ఆళ్ళయితే పంటలు దెచ్చుకున్నరు..." మరొకడు..

"ఇందట్ల ఓరు మాత్రమ్ తక్కువ తిన్నరు." అన్నాడింకో గోండువాడు...

"అదికాదయ్యా..." భగవతిరావు పొరకల సారుకేసి చూసి-

"ఇగో- సార్‌వార్‌మాంతా (సమక్షంలో) నేను మాంతా.. నేను కొంత సంగతి చెప్పుదామని..."

"నువ్వేం జెప్పుతవో? మాకెర్కలేదా?" తెలుగురైతు అడ్డొచ్చాడు.

"ఔనయ్యా: ఏడినుంచో మా గూడాలల్లకు వత్తిరి... ఏదో మా సొమ్మేం గౌంటబోతరు. మాతో బాటు బతుకుండ్లంటే, ఉన్న భూమంతా కబ్జా చేసుకుంటిరి... మమ్ముల దిక్కులేనోల్ల జేత్తిరి. ఆఖరుకత్తె" అంబతిరావనే గోండువాడు కోపంగా.

"అగో మీ వచ్చాన పొరకల సార్లచ్చిండ్లుగదా? ఇంకేంది?" ఒక లంబాడా రైతు...

అప్పుడు పొరకల సారు కల్పుగజేసుకొని "పంచాదుకన్న ముందు నేనోమాట జెప్పాలె.... పొరకల పార్టీ ఏ వొక్కలదికాదు. మేం కేవలం గొండ్లోల్లకోసమే పని చేస్తున్నట్లు మరాఠా-తెలుగు, లంబాడా రైతులకు అన్పించవచ్చు. కాని మీరు కూసంత విచారం జేస్తే అది నిజం కాదని తెల్వుతది. కరీంనగరంల-మీ పక్కపైదాన ప్రాంతాలల్లో రైతుకూలి సంగాలు బెత్తన్నం. దున్నేవానికి భూమి, నడిపేవానికి మిల్లు కావాలంటున్నం ఎవడైతే కష్టం చేత్తడో వాదే తనకష్ట ఫలితం అనుభవించాలంటున్నం..." ఇట్లా తమ పార్టీ ఎవరికోసం పనిచేస్తున్నదో ఈ దేశంలోని రైతాంగము,కార్మికవర్గం కలిసి కల్లే సర్కారును పడగొట్టి రాజ్యం గెలుచుకోవాలని,దున్నే వానికి భూమి చెందాలని పొరకలసారు చాలాసేపు చెప్పుకొచ్చిండు.

పొరకలసారు మాటలు ఎవరిమీద ఎట్లా ప్రభావం చూపాయో స్పష్టంగా తెలియలేదు... కాని కాసేపు ఎప్పటిలాగే ఇరుపక్షాలు మెల్లెగా మొదలుపెట్టి ఉద్రేకంగా ఒకరినొకరు తిట్టుకున్నారు. మీది తప్పంటే మీది తప్పనుకున్నారు... 'పేదలమైన మమ్ముల ఇప్పుడు భూముల్లనుంచి వెల్లగొడితే ఎట్లాబతికేది?' అని గిరిజనేతరులన్నారు. "అసలుభూమి లేకుండా మా దగ్గరికి బతుకొచ్చి భూమంతా కబ్జా చేస్తిరి. మేమెట్లాబతుకాలే"నని గోండ్లన్నారు... "ఇప్పుడెట్లా బతుకుతున్నారో అటాగే" అన్నారు తెలుగలు. "మేం అట్లా బతుకదలుచుకోలే"దన్నారు గోండ్లు.

పొద్దు నెత్తిమీది కొచ్చింది, అమీతుమీ తేలలేదు. అసలు సమస్య తేలలేదు. ఒక్కొక్కరే మాట్లాడటంపోయి, ఎవరికి వారే బిగ్గరగా మాట్లాడుతున్నారు

పొరకలసారు కల్పించుకొని "రెండు పక్షాలనుంచి ఎవరన్నా బాగాతెలిసినవారు చెప్పండి" అన్నాడు.

మాటలు బందయినయ్-ముచ్చటాగినయ్. నువ్వు చెప్పమంటె నువ్వు చెప్ప మన్నారు.

గోండులనుంచి ఎగోదిరావు వంగిపోయిన తనువును నిటారుగా ఎత్తిండు ఏదో మాటలాడాలనుకున్నాడు. అతని కంఠం రుద్ధమైపోయింది. కండ్లపొంట నీల్లు కారినయ్. ఈ గడబిడలో అతనిచేను కోసుకపోయిండ్లు గిరిజనేతరులు. ఆ దుఃఖం అందుకుకాదు—అతనికి తన జీవితకాలంలో భూమికోసం పడ్డ తిప్పలన్ని ఏక కాలంలో పోటెత్తాయి....

“సార్‌వార్ మాంతా.. భగవతిరావు మాంతా, ఇక్కడకూకున్న చిన్నలు పెద్దలు మాంతా... ఈ వూల్లె నా ఈడువాల్లు సాలె లచ్చుమయ్య, మరాఠీ బాబన్న తప్ప మరింకెవ్వలు లేరు. కాదు బాబన్న” అన్నాడు.

అప్పటిదాకా ఒక్కమాటన్నా మాటలాడకుండా కూర్చున్న మరాఠీ బాబన్న నెత్తిమీద గుడ్డటోపీ తీసి ఔనన్నటు తలూపిండు ...

“నాకేడ మతికీగని—ఇప్పటికి నలభయే అయ్యిందో? ఇంకా ఎక్కువే అయ్యిందో గని-మేం- మా గూడెంల గత్తరత్తె గూడెమిడిసి గీడికచ్చినం. గప్పుడు-గీడ నాలుగే గుడిసెలుంటె - మేం అడివి నరుక్కున్నం. మూడేండ్లో, నాలుగేండ్లో నాకు గిప్పుడు మతికి లేదు మన హైదరాలీ పటేల్ తండ్రి లడ్డుపటేల్ గిదంత నా మక్త అంట అచ్చిండు. ఆడు తూడ త్తని బెదిరిచ్చి మేం కొట్టిన భూములు కబ్జ చేసుకున్నాడు. అగో గయినె మా గూడానికొచ్చిన మొదటి బయటిమనిషి. ఇగ ఆయినెకు పాలేర్లంట, పనిపాటలోల్లంట సానామంది వచ్చిండ్లు. మేం జంగల్ నరుకుడు, గిది నా మక్తాలడనుడు. ఇగోగి బొగడమీన్నుంచి సూత్తే కనిపిచ్చే నూర్ల ఎకరాలన్నీ మా నెత్తురు కలికలిజేసి భూముల జేసినయే.

“అయింక నాలుగైదేండ్లకేమొ? మరాఠోల్లచ్చిండ్లు. మాసిన బట్టలతోని, అవ్వ అప్పం ఆయీ ఖాయి అనుకుంటచ్చిండ్లు తురక మత్తెదారు సందుజెట్టలే- మా భూములు బోయినయన్నరు. జాగలు బోయినయన్నరు. దేశంగాని దేశం పచ్చుల తీర్గచ్చిన మన్నరు. మాదేం కొంటబోతండ్లు. రెక్కలున్నయి-మీరున్నరు అడివి- నరుకోండ్లి బతుకుండ్లి, అన్నం మాగోండ్లం.

ఆళ్ళు - ఆడేడనో బట్టలు తయారై తయన్నరు. పత్తిపంట ఏసుడుబెట్టిండ్లు మమ్ముల జూత్తెనే అగ్గిలబడే మత్తెదారుకు మరాటోల్లకు మంచి దోస్తానయ్యింది. యాడినుంచో ఇగో లంబడోల్లచ్చిండ్లు ఊరు పెరిగిపోయింది. భూములు నాపయినయి. వచ్చేటోల్లు ఇంకా వత్తనేఉన్నరు. గొండోని బతుకు ఎటుగాకుంట తెర్లయిపోయింది. మరింక కొత్తగ బూములు నరుకుదామంటే జంగలాతోల్లచ్చి మా బూములన్ని రిజర్వుల కచ్చినయన్నరు. అప్పుడు షురవయింది గొండోనికి...." ముసలి ఎగోదరావు కంఠం ఎండుకపోయింది. మరింక మాట్లాడలేకపోయాడు.

"ముసలోడెప్పుడు చెప్పేదే?" అన్నాడో గోండువాడు.

అప్పుడు పొరుగుగూడెం భగవతిరావు కలుగజేసుకొని "ఇప్పటికి పదేండ్ల కింద [1] లగంధారీ పట్టాలంట గోండోల కచ్చినయ్....ఇరువై ఏండ్ల కింద ఎవడు యేయే నంబరు దున్నిండో లెక్కలు దీసిండ్లు. తలాకొంత రాసిండ్లు. అగో గప్పుడే గొండోల్లకు ఆశ బుట్టింది. గిర్దవార్ల సుట్టు, పట్వార్లసుట్టు సద్దులు గట్టుకొని తిరిగితిరిగి సచ్చిండ్లు—"

"దాన్నే పెనస్సీ అంటారు" పొరకలసారు.

"గదేందో మా కేమెరుకగని-గప్పుడు మల్ల భూమిమీద ఆశలు బుట్టినయ్. మత్తేదార్లు తమకింద ఉంచుకునేకాడికి ఉంచుకొని మా పేరుమీద పట్టాలిచ్చిన బూమి మాత్రం లంబడోల్లకు, మరాఠోల్లకు అమ్ముకున్నరు...."

మరాఠీ ముసలి బాబన్న కలుగచేసుకొని "ఇదిగో మా దగ్గెరి నుంచి మత్తెదారు డబ్బు గుంజిండు. ఎకరాకు నూరే అన్నడు. కొన్నంక అధికార్లు గివి మీయి కావన్నరు. ఆళ్ళకు తడిపితిం. జంగలాతోల్లు గిది రిజర్వు అనిరి. ఆళ్ళకు తడిపితిమి. అఖర్కు ఇబ్బడి ముబ్బడయ్యె. సిక్కులట్లనే ఉండె - సొల్ల తవుడుబోసి కుక్కలకు తాకులాట బెట్టినట్టయ్యె" అన్నాడు.

"మనమర్జీల మనం యిచ్చినం, గిందట్ల మత్తేదార్ల తప్పేమున్నది" నారాయణ వెనకేసుకొచ్చాడు.

1. లగంధారీ పట్టాలంటే పెనస్సీయాక్టు దీనిప్రకారంగా 1953, 1954 లో యేయే భూమి రైతులు కాస్తు చేసిండ్లో ఆయా భూములు ఆ రైతులకే చెందాలని, ఇది 1874లో వచ్చినట్లు చెప్తారు.

చాలామంది నారాయణమీదికి గయ్యిమని లేచిండ్లు.

"ఏమయితేంది గోండోల్లు పరెషాన్ల బడ్డరు. పట్టాలచ్చినయని దున్నబోతే. తన్నులు గుద్దులు - జేల్లు - నామట్టుకు నేను నెలరోజుల నిజమాబాదుల జేల్లుంటే ఇంటి కచ్చెటాల్లకు పంచి నాగలిమీది కంకను (ఎద్దును) పులి గొట్టింది"—కుర్దు.

"మల్ల మొదటికచ్చింది కొట్లాట ... రామనేళుని కాడయ్యింది" ఒక తెలుగు రైతు.

"భూములమీద ఆశ లొదులుకొని జంగలాతోల్లతోనీ తన్నులు గుద్దులు తిను కుంటుండగనే మా లొద్దుల్లకు పౌరకలసార్లచ్చిండ్లు, భగవతిరావు ఆగి"వ.శ్యా ఆశ, మేమెక్కడ పౌరకలసార్ల మాట వింటమోనని - [2] గిరిజనుల భూములు గిరిజనులకే అంట చట్టాలు తెచ్చిండ్లు" భగవతిరావు.

పౌరకలసారు లేచి నిలబడి "మల్ల గిరిజనేతరులు హైకోర్టుకు పోయి స్టే తెచ్చుకున్నారు. మొదటినుంచి కల్లేసర్కారు.ఇదే ఆట. ఒకనిదగ్గరనుంచి తినేకంచం గుంజి ఇంకోని దగ్గర బెట్టుడు. ఆడు మొత్తుకుంటే మళ్ళీటుబెట్టుడు.అసలే ఆ కంచంల పిరికెడు బువ్వ....కుప్పలు కుప్పలు. నూర్ల ఎకరాలు కబ్జాచేసుకున్న మక్తేదార్ల నేమనడు. ఆ పేదవానిది ఈ పేదవానికి, ఈ పేదవానిది ఆ పేదవానికి మార్చి-ఇద్దరికీ లడాయిబెట్టుడు.మక్తాదార్ల పక్కలచేరి కొట్లాడంచే చూసుడు.1979వరకు మళ్లా గిరిజన గిరిజనేతర కొట్లాట ముదిరింది. అప్పుడు రైతుకూలి సంఘాలు కల్పించుకొని నిరుడు ఇదేబొగడమీద ఏం మాటాడుకున్నం? పేదవాళ్ళు పేదవాళ్ళు కొటాడుకోవద్దని-ఒకే భూమి గిరిజనునికి, పేద గిరిజనేతరునికి ఉంటే చెరిసగం పంచుకోవాలని చెప్పింది. మడావిబంగు, శంభు లాంటోల్లు అట్లా తప్పా చేసుకున్నరుకూడా." పౌరకలసారు కొద్దిగా కంఠంపెంచి "ఓ రైతులారా! మనంమనం ఎప్పుడు కొట్టుకసావటమే మక్తేదార్లకు, వాళ్ళ సర్కారుకు గావాలె-ఇగో ఈ బొగడమీంచి సూత్తే అట్లా ఆకాశపు అంచుదాకా ఉన్న భూములన్నీ చూడుండ్లి. ఆ భూములన్నీ ఎవరిచేతుల్ల ఉన్నయి.... మీ వూర్లో లెక్కలు దీత్తే అంతా కలిపితే గోండ్లకు, మరాఠా, తెలుగు, లంబాడా రైతులంతా కలిపితే 150 ఎకరాల భూమిలేదు. మొత్తం ఊరిఆయకట్టు భూమంత దాదాపు 500 ఎకరాలు మీవూరు షివారు కిందున్నది. 150 ఎకరాలు అహమ్మదాలీ

---

[2] (గిరిజనుల భూములు గిరిజనులకే ననే చట్టం 1979లో చేశారు.)

కిందనే ఉన్నది. మిగతాది రిజర్వుఫారెస్టు కింద ఉన్నది. ఆ భూమంతా పేదగిరిజన గిరిజనేతరుల్లు తీసుకోవాలి. కాని ఆ భూమంతా మక్తేదార్లు, సర్కారు ఉక్కు పిడికిలి కింద ఉన్నది. దాన్ని మీరంతా కలిస్తేతప్ప బద్దలు కొట్టలేరు. దాన్ని పోరాడి గెలుచుకుంటేతప్ప ఈఊళ్లోని దున్నేరైతుకు భూమి దక్కదు. అహమ్మదాలిభూమిని బేషరతుగా ఆక్రమించుకుందాం. కావాలిస్తే తను మనలాగా దున్నదలిస్తే అతన్ని దున్నుకోని బతుకుమందాం, సర్కారు పెంచిన పిచ్చితుమ్మలు నరికి పంటలు పెడుదాం. పోరకలపార్టీ మీవెంట ఉంటుంది. ఇగో ఇదేమాట. నిరుడు ఇక్కడే చెప్పాను. అందరూ తలలూపిండ్లు. మక్తెదారు భూమి 10 ఎకరాలు దున్నిండ్లు. మీరు ఏకమైనందుకే వాడు గగ్గోలయిండు-పెద్దల గల్పిండు."

"లోటీసులు పంపలేదా?" లంబాడా రైతు.

"కలెక్టరు నోటీసులు గిరిజనుల తరపున గిరిజనులభూమి గిరిజనేతరులు ఖాళీచెయ్యాలని పంపాడు"

ఈ మాటమీద మళ్ళీ రగడ లేచింది. "మాతో కల్సి ఉండుకుంటనే మా ముడ్డికిందికి నీళ్లు దెచ్చిండ్లు" గిరిజనేతరులు.

"మల్ల మక్తెదారు దగ్గరికే మీరురుకలేదా?" గోండ్లు.

"గిరిజనులమీద గిరిజనేతరులకు అనుమానం పుట్టింది. మళ్లా మక్తెదార్ల దగ్గరికే వాళ్ళు పోయారు. అడుగు బెట్టాల్నంటే భయపడేటోల్లు మనదాంట్ల రెండు కాంగనే పోలీసుక్యాంపచ్చింది. గిరిజనులకు పోలీసుల దెచ్చిండ్లని కోపం - అది ముదిరింది, పెరిగింది. వారంరోజులకింద ఎటుపోతున్నామో తెలియకుండ ఒకరిపంట మరొకరు కోసుకొచ్చుకున్నారు. వాడు వల విసిరిండు. మనం ఒకరిమీద కోపంతో ఇంకోరం వానివలలో పడ్డాం. ఇకనైనా మించిపోయింది లేదు. కామ్రేడ్స్! భగవతి రావు మీతోపాటు ఉంటాడు. న్యాయంగా పేదలభూములు తిరిగి పంచుకోండి. కోసుకొచ్చిన పంట పంచుకోండ్లి. మనమంతా కలిసి అడివి నరుకుదాం-తుడుం గొడుదాం-కల్లె రాజ్యం అంతమయ్యేదాకా, దున్నేవానికి భూమి వచ్చేదాకా—" పోరకలసారు సాయంత్రమయ్యేదాకా అందరితో మాట్లాడాడు.

o o o

వారంరోజుల తరువాత అహమ్మదాలి 'తన మొక్కజొన్నపంట కోసుకు పోయారని' ఆదిలాబాదుకు యస్. పి. దగ్గరికి పరిగెత్తాడు. "రిజర్వు ఫారెస్టు పిచ్చెత్తినట్లు నరుకుతున్నారని - నివారించడానికి వెళితే గిరిజనులు తపుగుడ్డలు ఊడ దీసి, ముక్కులు భూమికి రాకిస్తున్నారని, తమకు తగినరక్షణ కల్పించకపోతే గూడాలల్లోకీ వెళ్ళబోమని" ఫారెస్టు ఉద్యోగులు యస్. పి. దగ్గర చెప్తుకున్నారు.

2

తొవ్వ దారి లేని ఆ మారుమూల గ్రామానికి కచ్చారోడ్డుదిగి దానివెనుక గొలుసులు కొట్టుకుంటుండగా లారీ సాగిపోతోంది. రోడ్డు కిరువక్కల చుక్కలకంటా పెరిగిన చెట్లకొమ్మలు లారీని గీరుతున్నాయి. క్యాబిన్‌లో ఎదురుచూపులు చూస్తూ దారి చూయిస్తున్న కంట్రాక్టరు మార్వాడీ చున్నిలాల్‌కు కుదుపునికో మరెందుకోగాని దిగచెమటలు కారుతున్నాయి. నుదురుకు బెట్టుకున్న కుంకుంబొట్టు ఎర్రగా ముక్కుమీదికంటా కారింది.

"హజారో రూపియా జంగల్లో ఫోస్తి. ఎకరాకు ఆరునూర్లిచ్చి భూమికొంటే' లారీ కిరాయిలాయె జెర అయిస్తా అయిస్తా, బాయే" గొనుగుతూ చెమట తుడుచు కుంటూ, దారి చూయిస్తున్నాడు చున్నీలాల్.

"మల్ల కిరాయికొస్తె వొట్టు సార్... టైర్లు రాళ్ళల్ల సత్తెనాశనం అయిపో తన్నయి సార్. ఇంతకన్న బొంగు కొట్టుకుంటె ఫాయిదా।" డ్రైవరు.

క్లీనరు కునికిపాట్లు పడుతున్నాడు. అట్లా లారీ డొంకలుతిరుగుతూ, ఎత్తు పంపు లెక్కుతూ మేడిగూడెం ఊళ్ళో సొచ్చింది.

"జల్దీ పోనియ్. తెరిమాకా గోండువాలే ఆయేతో కిరికిరి" చున్నిలాల్ గాభరాగా అని అద్దం గుండా లారీలోపలికి చూశాడు. లోడింగుకోసం ఆదిలాబాదునుండి పట్టుకొచ్చిన లేబరు బాడీలో నిలబడీ ఊరును చూస్తున్నారు.

"బైటో....బైట్‌రే"....చున్నిలాల్ కసురుకున్నాడు లేబరు ఆ మాట కాతరు చేయనేలేదు.

లారీ చుట్టు బిలబిల గోండోల్లు మూగనేమూగారు. డ్రైవరు హారను మోగిస్తూ ఊరు దాటించి బీడుభూముల్లోకి తోలాడు.

గుట్టదాకా విస్తరించిన బీడుభూముల్లో మాంగనీసు పర్మాలు (తనుసులు) కుప్పలు కుప్పలుగా-పర్మా కొలతకోసం ఉపయోగించే చెక్క పెట్టెలు - ఆ కుప్పల మధ్య అల్లిబిల్లిగా తవ్విన గుంటలు....

చున్నీలాల్ లారీదిగి "దిగండిరా? దిగండి....లారీ లోడు క్షేమంగా ఆదిలా బాదుకు చేరిస్తే మనిషికో రూపాయి ఎక్కువిస్త" అన్నాడు.

"అబ్బో మీరిచ్చే రూపాయిబెడ్తె లారెడు సామానత్తది బాంచెన్" అన్నా డొకడు కిసకిస నవ్వుతూ.

"ఎంత పరాష్కమాడితె మాత్రం మార్వాడిసేట్ పైసలసంగతి మర్సి పోతడా?" అన్నా డింకొకడు.

ఆ మాటలేవి పట్టించుకోకుండా చున్నీలాల్ ఊరుకేసి పైజమా సదురు కుంటూ బెదురుబెదురుగా చూస్తూనే ఉన్నాడు.

లేబర్ తట్టలు, పారలు తీసుకొని ఒక మాంగనీసు కుప్పదగ్గరికి కదిలారు. చున్నీలాల్ భయపడ్డట్టే అయ్యింది. ఊళ్ళెనుంచి కర్రలు, గుతుపలు పట్టుకొని జనం లారీదగ్గరికి పరుగెత్తుకొచ్చారు.

"అచ్చాభై....మై మామూలి అసామి నహీ. మీరు పర్మా ఒక్కటికి 27 రూపాయలు పడదన్నరు. అంతకన్నా ఎక్కువిచ్చే స్తోమత నాకులేదు. ఇదేంది మట్టి? మీరు సమ్మె జేసుండ్రు. చేసుకోండ్లి - నాకీ పరిగి బాటులేదు. మరింక మీ మాంగ నీసొద్దు, మన్నొద్దు. నా జాగల నేనుపోత. ఏదో ఎకరాన అరునూర్లు బోసి - మీకు పర్మాకు 27 రూపాయలిచ్చి నాడబ్బంత మన్నుల బోషిన. మరింక తవ్వంది తీసుక పోసియ్యండ్లి" అన్నాడు.

"మేం ఎన్నేండ్లనుంచి తవ్వతున్నం. భార్యాభర్తలు కలిసి ఈ మన్నుల మన్నయితే దినానికి నాలుగురూపాయలు కులి గిత్తలేదు. కూలి పెంచమన్నం" ఒక ముసలి గోండువాడు

"నాకు పత్తల్ లేదు భై."

"ఆదిలబాదుల బిల్డింగు కట్టలేదా? పత్త లెట్లలేదు" ఒక మరాఠీ యువకుడు మీదిమీది కొచ్చాడు.

గలాట ముదిరిపోయింది. "మాకింకా 30 పర్మాలకు పైకం రావాలె. అది కక్కు - మా భూములన్నీ పొక్కలు గొట్టిచ్చి చెడగొట్టావు. మరింక ఇక్కడినుంచి ఒక్క పెళ్ళ కదలటానికి వీల్లేదు" అరుపులు.

చున్నీలాల్ రెచ్చిపోయాడు. చిరుబొజ్జ కిందికి మీదికి కదులుతుండగా ఎగిరెగిరి తిట్టసాగిండు. చెమటలు కారి ఒళ్ళంతా తడిసిపోయింది.

"ఎత్తండిరా" చున్నీలాల్ కేకపెట్టాడు.

గోండులు, మరాఠీలు ఎగబడి తట్టలు, పారలు గుంజుకున్నరు.

"వీడో దొంగ - మా రక్తం ఎత్తుకపోయి బాగా సంపాయించిండు. మమ్ముల ముంచిపోయిండు. ఈడిమాల్ (సరుకు) ఎత్తుకపోదామని వచ్చిండు. రామ్‌రామ్ డ్రైవర్‌సాబ్ - మీరెల్లుండ్లి - లేదంటిరా మీ లారీ మీరుండదు" అన్నారు.

మరికొంతసేపు ఘర్షణ జరిగింది. చున్నీలాల్‌కు పిచ్చెత్తింది. కోపంగా చేతులు విసురుతూ మందిమీది కురికాడు. ఎవరో చేతులు నెట్టేశారు. ఇంకెవరో అంగి చింపారు. డ్రైవరు జనాన్ని ఆపి చున్నీలాల్‌ను లారీలో కుదేసుకుని వచ్చిన దారి పట్టాడు.

లారీ డిబడిబ లాడటంకన్నా మిన్నగా చున్నీలాల్ తిడుతూనే ఉన్నాడు. ఎన్ని వేల రూపాయలు లాసో లెక్కలు కడుతున్నాడు. అతనికి లారీ కిరాయికూడా యివ్వాలని తోచింది. ఎంతమంది వచ్చిండ్లు - ఇన్నూరో, మున్నూరో? ఇంకా తుడుం కొడితే ఎంతమందైనా రావచ్చు. పొరకలసాబ్లు నా కొంప ముంచిండ్లు.... పొరకలసాబ్లు రాకముందు ఎంత తనిచ్చిండో లెక్కలు తెలువని గోండ్లు - ఇప్పుడు అన్నీ అన్నీ లెక్కలు కడుతున్నారు.

ఆదిలాబాదు వచ్చేసరికి కరంటుబుగ్గ లెలిగినయ్. అదే లారీని సీదా యస్. పి. ఇంటిముందుకు తీసుకెళ్ళాడు. చిరిగిన బట్టలతో అలాంటిస్థితిలో చున్నీలాల్‌నుచూసి, అతని బిజినెస్ తెలిసిన యస్. పి. కి అంతా అర్థమయ్యింది.

"మీరు మత్తెదార్లస్తే మదత్ (సహాయం) చేస్తరు. హైకోర్టులనుంచి స్టేలు తెప్పిస్తరు. ఆప్కారోల్లొస్తే మదత్ చేస్తరు. పోలీసుల పంపుతరు. మా వ్యాపారస్తుల అన్నీ వ్యాపారాలకు దెబ్బొచ్చింది. పత్తి గిట్టుబాటు ధరంటరు." చున్నీలాల్ చాలా సేపు చెప్పి చెప్పి హఠాత్తుగా లేచి కాళ్ళీడిస్తూ వెళ్ళిపోయాడు.

3

రెండు కొండలమధ్య సాత్నాల ప్రాజెక్టు-దాదాపు పూర్తి కావొస్తోంది. ఇంకా ప్రాజెక్టు ధారకు అడ్డకట్ట కట్టడం మాత్రమే మిగిలిపోయింది. అదికూడా పూర్తి చేసేటందుకు మేస్త్రీలు వచ్చారు. తోయగూడెం, సాత్నాల మాంగూరు జనం తుడుం గొట్టారు. వేల సంఖ్యలో జనం పోగయ్యారు. సాత్నాల ప్రాజెక్టు కింద మునిగిపోతున్న తమ భూములకు నష్టపరిహారం చెల్లించేదాకా అడ్డకట్ట కట్టడానికి వీల్లేదన్నారు. మేస్త్రీలు తెల్లమొఖాలు వేసుకొని చెట్లకింద గుడ్డలు పరుచుకొని కూర్చున్నారు. జనం అక్కడే చెట్ల నీడలకింద అరుస్తూ కేకలుపెడుతూ తిరుగుతున్నారు.

కంట్రాక్టర్లు చేసేదేమిలేక కలెక్టరు దగ్గరికి పరుగెత్తారు. కలెక్టరుకు గోండు ప్రాంతాలల్లోకి పోవాలంటేనే భయం....తనను ఇదివరకు నిలదీశారు. ప్రశ్నల వర్షం కురిపించారు. తను మాత్రం ఏం చేయగలడు? ఆ ప్రాంతాలల్లో భూములు కోల్పోయిన రైతులకు ఏమని జవాబు చెప్పగలడు? కనిపించే భయంకర దరిద్రాన్ని కాదని-తను తీర్చగలనని హామీ యివ్వగలడా? తను పోవాలి. ప్రభుత్వం తరపున అబద్ధాలాడాలి....వెళ్ళినంత కాలం వెల్లదీయాలి....ఏది ఏమైన నక్సలైట్ల నుంచి జనాన్ని ప్రభుత్వంకేసి తిప్పాలి....జీబులో కూసున్నాడు.

కలెక్టరు ఒక సర్కిల్‌ను, ఏడుగురు పోలీసులను వెంటబెట్టుకొని మిట్ట మధ్యాహ్నానికల్లా సాత్నాల చేరుకున్నాడు.

అతని జీబు చుట్టూ ఇసుకవేస్తే రాలకుండా జనం మూగిపోయారు....కలెక్టరు జీబులో నుంచి దిగాలా వద్దా అని విచారం చేస్తుండగానే సర్కిల్ దిగి పిస్తోలుమీద చేయుంచి ఆ చిరిగిన గుడ్డల జనంలో వెతుకుతున్నాడు.... తనకు కావాల్సిన ముఖాల కోసం. కాని అందరి ముఖాలు క్రోధంతో మండుతున్నాయి.

"ప్రజలారా! మన ప్రభుత్వం మీకోసం కోట్లరూపాయలు ఖర్చుబెట్టి ప్రాజెక్టులు కట్టిస్తోంది...." కలెక్టరు దిగి భుజాలు ఎగరేసి అన్నాడు....

"బా సారు....మేం వరదలొచ్చి కొంపగోడు కొట్టుకపోయి తిండిలేక మల మల మాడుతంటే ఏ కల్లే సర్కారు మా గూడేల దిక్కు తొంగి చూడలేదు...."

ఓ గోండువాడు మందిలోనుంచి "మీ ప్రాజెక్టు మీరే తీసుకోండ్లి- మా భూముల మునిగిపోతయి-జైన ఊల్లోని తురక,రెడ్డి, వెలుమ మత్తేదార్లకు కాలువలుదీసి నీళ్ళు కొంటబోతరు...." ఒక స్త్రీ....

సర్కిల్ ఆ స్త్రీని ఎగాదిగా చూసిండు. ఆదిలాబాదు గిరిజన సభలో ఆ స్త్రీ గొంతెత్తి పాటలు పాడడం తనకు గుర్తున్నది ...

"పౌరకలసార్లు మీకు మాయమాటలు చెప్పుతున్నారు. మీరు వినవద్దు. సర్కారు మీకు అన్నీ యిస్తది." కలెక్టరు ఇంకా చాలా చెప్పాలనుకున్నాడు....

కాని ఆ మాటమీద వెనుక ఎక్కడో ఉన్న అంబతిరావు ముందుకు వచ్చి "సర్కారా? అన్ని యిస్తదా? గుడిసెలే సక్కగలేవు. అడివిల వాసం పెందెముడితె గుడిసెపట్టి (పన్ను) లావ్‌లావ్ మంటడు మీ సర్కారు సైకిదారు. మీరు పెంకలస్త మంటరు. నెత్తిల కప్పుకోనా? మీరు మేకలిస్తే జంగ్లాతు అమీను కోస్కతినకొంట బోతడు. మీరు పట్టాలిస్తనని మాతోనంటరు. మత్తేదార్లకు అధాలతుల కాయిదా లిస్తరు....మీ సర్కారిచ్చే ఇనాములు ఇందర్‌వెల్లిన చూస్తిమి. కలెక్టర్ సార్ మీకు రామ్‌రామ్. మాకు మీదేదివద్దు. మా భూములకు నట్టం యియ్యండ్లి" అనేసి మళ్ళీ మందిలోకి వెళ్ళిపోయాడు.

"సర్కారు అన్నీ యిచ్చేదైతె సర్కిల్‌సాబ్ నెందుకు తెస్తది....మా కోసం పౌరకలసార్లు సావమన్న సస్తరు—వాళ్ళ మాట వినవద్దా?" మందిలో ఎవడన్నాడో తెలియకుండా ఒక గొంతు—

సర్కిల్ ఉరిమి చూశాడు. పిస్తోలు తీశాడు. అడుగు ముందుకు వేశాడు. అతనికి చిరాకుగా ఉన్నది...కలెక్టరు అంత శాంతంగా మాట్లాడుతున్నందుకు కోపంగా ఉన్నది. తనకు తెలిసిందల్లా తన్నడం—

కలెక్టరు కనుబొమ్మలు ముడుచుకున్నాయి. అందరితో మాట్లాడితె ఎంతకూ ఎడతెగదు—

"మీకు నష్టపరిహారం తప్పకుండా యిస్తాం—మార్చి నెల అఖరులోగా అందరికి చెల్లిస్తాం—ఎవరెవరి భూమి ప్రాజెక్టుకింద పోతున్నదో ఇంకా లెక్కలు పూర్తి కాలేదు—నేను మీకందరికి హామీ యిస్తున్నాను. ఈ ఒక్కమాట వినండి. ప్రాజెక్టు పని నడవనీయండి." కలెక్టరు చెప్పవలసింది చెప్పి జీబు ఎక్కాడు.

జనంలో గుసగుసలు—ఒక ముసలివాడు అందరి తరఫున వచ్చి "సరే—" నన్నాడు.

కలెక్టరు జీబు కదిలింది—మేస్త్రీలు చెట్లకింది నుంచి లేచారు—

○ ○ ○ ○

4

ఒకనాడు యస్.పి. ఆఫీసులోకూర్చున్నాడు.... స్టెనోని పిలిచాడు.

"అదిలాబాద్ అడివి ప్రాంతాలల్లో గోండులు తీవ్రవాదుల మాటలనుపూర్తిగా నమ్ముతున్నట్లు ఇంటెలిజెన్సు శాఖవారు చెప్పుతున్నారు. రెండు సాయుధ దళాలు గోండు గూడాలల్లో తిరుగుతున్నట్లు- ఆ దళాలల్లో ఏడుగురు సభ్యుల చొప్పున ఉన్నట్టు, అందరిదగ్గర తుపాకులున్నట్లు పోలీసుశాఖ అనుమానిస్తోంది. బాది అనే ఊళ్ళో దాదాపు మూడువందల ఎకరాల రిజర్వుఫారెస్టు నరికినట్లు ఫారెస్టు అధికార్లు చెప్పుతున్నారు. అడ్డగించబోయిన సారెదార్లను, చౌకిదార్లను గుడ్డలువిప్పి ముక్కు-భూమికి రాకిస్తున్నారట-మక్తేదార్లు తమ ఊళ్ళల్లో క్యాంపులు పెట్టాలని ఒత్తిడి తెస్తున్నారు....తోయగూడలో భూస్వామి భయపడుతున్నాడు. మాంగనీసు పని నిలిచిపోయింది. ఇంకొకపక్క కరువుపరిస్థితి. భూస్వాముల పంటలుకోసుకపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. పెట్రోలింగు చేయించాలంటే చాలినంత ఫోర్సులేదు. వాహనాలు లేవు....ప్రభుత్వము తీవ్రమైన శాంతి భద్రతల సమస్యగా పరిగణించి అదనపు బలాలు పంపవల్సిందిగా విన్నపము....దాదాపుగా నెలరోజులుగా ఏ అధికారి అడివిలోకి వెళ్ళలేకపోయాడు...." ఇట్లా చెప్పి సిగరెట్టుముట్టించాడు....కాసేపు మౌనంగా గదిలోపచారు చేశాడు.... టక్ టక్ .... తుడుం సంగతి రాయాలి. ఇప్పటికే సి.ఆర్.పి పంపామంటారేమొ?గిరిజనులు కర్రలతో దాడికి సిద్ధపడుతున్నట్లు రాయించాలి.... మళ్ళీ మనసు మార్చుకున్నాడు....కాసేపు మౌనంగా నిలుచుండి బయటకు చూశాడు. బయట ఎండ-తనకు ఉక్కపోస్తున్నట్టనిపించింది. "రాస్కెల్స్" అన్నాడు.... స్టెనోను బెల్ నొక్కుమన్నాడు. బయటినుంచి యస్.ఐ వచ్చి పోలీసు సాల్యూట్ చేశాడు. ఏర్ కూలర్ ఆన్ చేయమన్నాడు. యస్.ఐ ముఖం అటు తిప్పుకుని కూలర్ ఆన్‌చేసి బయటకు పోయాడు.

"చింపేయి"అన్నాడు యస్.పి....

"యూకెన్‌గో....", స్టెనో కాగితం చింపేసి వెళ్ళిపోయాడు.

మళ్ళీ కుర్చీలోవచ్చి కూర్చున్నాడు....గబాగబా ఫైళ్ళు తీసిఏదో వెతికాడు. నాగపూర్‌లో జరిగిన అంతరాష్ట్రి పోలీసు అధికార్ల కాన్ఫెరెన్సుకు సంబంధించిన రిపోర్టుతీసి చదివాడు.... టేబుల్‌మీది మ్యాపు గీతలు చూస్తూ చాలా సేపుకూర్చు

న్నాడు. తరువాత వైర్‌లెస్ అపరేటర్ని పిలిచి—"నా యూకెన్‌గో" అన్నాడు.

ఆ తరువాత ఫోనుచేసి సర్కిల్సును, యస్.ఐ.ని పిలిచాడు.

ఇప్పుడు కొంచెం స్థిమితంగా అన్పించింది....మ్యాప్‌లో ఊళ్ల చూశాడు.... దళాలకు సప్లయిలు ఎక్కడినుంచి వస్తున్నట్లు? అసిఫాబాదు-చెన్నూరు-అదిలాబాదు మూడుచోట్ల పెద్దఎత్తున ఫోర్సు పెట్టాలనుకున్నాడు. తర్వాత వార్తాపత్రికలు తిరగేశాడు....మంత్రిమండలిలో నక్సలైటు....యస్.పి. కనీకనిపించకుండానవ్వాడు పోలీసాఫీసర్ల బదిలీలు....లాంగోవాలా గురించి మరేమిటో?

బూట్లచప్పుడు....పేపరులోనుంచితలెత్తలేదు. పోలీసులు సాల్యూట్లుచేస్తున్నట్లుగా బూట్లచప్పుడు. ఎ.యస్.పి సర్కిల్‌రెడ్డి, అన్నీ తెలుస్తూనేఉన్నాయి. టేబుల్ ముందు వాళ్లుకూర్చున్నట్లుగా కుర్చీలు కిటకిటలాడాయి. అంతా ఎనిమిదిమంది. యస్.ఐలు ఇరుకిరుకుగా కూర్చున్నారు బెంచీమీద.

"సో...." అంటూ పేపరు టేబుల్‌మీద పెట్టాడు.

ఏకధాటిగా తనిందాక స్టెనోకు చెప్పిన విషయాన్నే తన అధికార భాషలో చెప్పాడు.

"సార్ మనం పెట్రోలింగును తీవ్రం చెయ్యాలి."ముద్దగా ఉన్నసర్కిల్.

యస్. పి తలూపాడు.

"అనుమానం ఉన్నవాన్నల్లా అరెస్టు చేయాలి." ఇంకో యస్. ఐ.

"చేస్తం..అరెస్టులు చేస్తం. అవసరమైతే కాల్పులుచేస్తం. కానిఇంద్రవెల్లి ని ఎంత ప్రచారంచేశారు....ప్రభుత్వం ఇప్పుడు ఏం చేయాలనుకుంటోందో తెలుసా?" చెప్పమన్నట్లు ఎ.ఎస్.పికేసి చూశాడు. అతని మనసులో పార్లమెంటు ఎలక్షన్లు మెదిలాయి....

"తీవ్రవాదులనుంచి జనాన్ని తప్పించాలనుకుంటోంది.... గ్రామోదయ కార్యక్రమాలు తీసుకుంటోంది. వరంగల్ ఛట్ పెల్లి,మల్లారెడ్డిపల్లెలో కలెక్టరు యస్.పి. మీటింగు బెట్టారు...."

"అదివాళ్ల నమ్ముతున్నారా?" అని అడుగాలనుకున్న సర్కిల్ అది అంత మంచిదికాదనుకున్నాడు. యస్.పి.ఇదే యస్,పి రాత్రికిఫోనుచేసి పెట్రోలింగుకు పొమ్మనవచ్చు కాని అదే మాటకింది అధికారి అనొద్దు.

ఇంతలోనే వైర్‌లెస్ మెసేజొచ్చింది....భువనేశ్వర్ నుంచి పంపిన అదనపు సిఆర్‌పి బలగాలను అవసరమైతే చెన్నూరు నుంచి రప్పించుకొమ్మని. చెప్పాచెయ్యకుండానే యస్.పి.లేచి బయటకొచ్చి జీబెక్కిండు.... అధికార్లులేచారు....

o o o o

తెల్లారి ఏడుగంటలకే లోకారికేసి పెట్రోలింగుకు పొమ్మని సర్కిల్‌కు యస్.పి ఫోనుచేసిండు....

5

తొమ్మిది గంటలు కావస్తోంది. రెండు పాలపిట్ట రంగు వ్యాన్లు, వాటి వెనుక ఒక జీబు ఆదిలాబాదునుండి బయలుదేరి లొద్దిగుండా - చెట్లకిందిగుండా తంతోలి ఊరు దాటినయ్.

రెండు వ్యాన్లల్లో పోలీసులు తుపాకులకు గద్దువ ఆనించుకొని దిగులు దిగులుగా కూర్చున్నారు. మొదటివ్యాన్లో నడీడు దాటిన బట్టతల పోలీసు సంబంధంలేని విషయాలు మాట్లాడుతున్నాడు. మంత్రాలమీద నమ్మకంగల మరో తురకపోలీసు "గోండు మంత్రం జబర్దస్తీది.. తెరిమాకా ఇక్కడపుట్టి అక్కడ తేల్తదట బయీ. షేర్‌కు మూహ్ బందు కరుకే - కౌన్ పకడ్త కత్తే...." పాములాగా నాలుక తాప తాపకు కొస బయటకుతెస్తూ ఎవరువిన్నా విననున్నా చెప్పుకపోతున్నాడు.

వెనుకవచ్చే జీపులో నలుగురు రిజర్వు యస్. ఐ. లు - ఒక సర్కిల్ కూచున్నారు. నలుగురిల్లో కణతల్లో చిన్నగా బ్రలుగల ఒక యస్సై ఒక నెల సెలవెట్లా సంపాదించాలా అని ఆలోచిస్తున్నాడు. ఈ మోఖలో తాట్ బూట్ అంటే సెలవు దొరకవచ్చని ఆశ. ఇంకొకతనికి ఈ అడివి ప్రాంతంనుండి ఎప్పుడు ట్రాన్స్‌ఫర్ కావాలా? దానికి ఏమేమి చేయాలా? అనే ఆలోచన. ఇంకొకతనికి కనీసం సర్కిల్ ప్రమోషనైనా కావాలనే ఆశ. ఇంకొకతనికి రిజర్వునుంచి సివిల్‌కు ట్రై చేసుకోవాలనే తీరని వాంఛ.

సర్కిల్‌కు మాత్రం తిక్కతిక్కగా ఉన్నది. యస్. పి. కన్నా తనే తెలివి కలవాడినని - హైయ్యర్ ఆఫీసర్లు తనమాట పట్టించుకోవడంలేదని ప్రభుత్వాలు మారకపోతే తనెప్పుడో డి. యస్. పి కావాల్సింది కనీసం తను తీసుకునే రిస్కుకు రాష్ట్రపతి పతకమన్నా — ఎవడినన్నా ఎన్‌కౌంటర్ చేద్దామన్నా కుదరడం లేదు, సర్కిలుద్యోగంలో డి. యస్. పి దగ్గరనుండి అందరూ ఆర్డర్లు యిచ్చేవాళ్ళే- రెడ్డిపటక పుట్టి తను జీ సాబ్ అనాలి. అదే యమరోతగా ఉన్నది. తనకు నాయ

కులమీద మంట-పోలీసు అధికార్లమీద మంట, జనంమీద అంతకన్నా ఎక్కువ మంట. వీటన్నిటికితోడు అందరి మందిలో తను పెట్రోలింగు చేద్దామంటే వద్దంటడు. ఆ తరువాత మళ్ళీ ఆర్డరు. వాని ఆర్డరు పాటించడానికి అల్లాటప్పా కాదనుకున్నాడు. తను ఏదిచేసిన చెప్పి చెయ్యాలిట. ఈ పెట్రోలింగు తనకేమిటి? చేతులు ముంగట బెట్టుకొని కూర్చుంటే పోలీసు ఉద్యోగం నడవదని-యస్. పి. కి. అర్థం గావాలి. అట్లయితే తనను అడిగేవాడుండడు గిరిజనులు రెచ్చిపోతే యస్. పి. కి పిచ్చెక్కుతుంది. పైనుంచి గవర్నమెంటు మొత్తుతుంది ఏం చేస్తాడో? ఎట్లా చేస్తాడో చూడాలి ఇదంతా తనే చేస్తున్నానంటాడు. ఐ జీ పి తో, డి ఐ జీ తో "ఐ టాకిల్డు దిస్.... ఐ ప్రిపేర్డు దిస్" అంట తనే చేసినట్టు చెప్పుకుంటడుకదా? నేనెందుకు రిస్కు తీసుకోవాలి....యస్. పి కాదు ఆ బాస్టర్డ్సును కిందిసర్కిల్సే ఎదుర్కొంటున్నట్లు పోలీసు అథారిటీస్‌కు అర్థం కావాలి.

ఇంతలోనే అంకోలి కూడా దాటిపోయింది జీబు ఆగిపోయింది. డ్రైవరు బిక్కముఖం వేసి కిందికి దిగాడు. "ఇంజన్ ట్రబులిస్తుంది సార్" అన్నాడు.

సర్కిల్ జేబుల్లో చేతులు బెట్టుకొని కిందికి దిగాడు. యస్సైలు దిగారు.

"సార్ కనీసం అర్ధగంటయినా పడ్తది సార్" డ్రైవర్ బానెట్ ఎత్తి

"సరే మీరు వెళ్ళండి జీబు బాగు కాగానే నే నొస్త.... ఉషారుగా గుడిసెలు గాలించండి....జల్దిగా పెయ్యండి" సర్కిల్ సిగరెట్టు ముట్టించి.

అయిష్టంగానే యస్. ఐ. లు నలుగురు వ్యాన్లలోకి మారారు.

ఇద్దరు పోలీసులను వెంట ఉంచుకున్నాడు సర్కిల్.

వ్యాన్లు ముందుకు కదిలాయి.

లోకారి సమీపిస్తున్నదనగా ఒక యువకుడు వ్యాన్లను చూసి ఊళ్ళోకి వేగంగా పరుగెత్తాడు. వ్యాన్లు లోకారి చేరేసరికి "టట్టర....టట్టర" తుడుం యమ భయంకరంగా మోగసాగింది. పోలీసులకు వనుకు జొచ్చింది. యస్. ఐ. లు ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు. రెండే రెండు నిమిషాల్లో - చుట్టుపక్కల గల వాన్‌పట్, పిప్పల్‌ధరి, చీజ్‌ఘాట్, బోర్‌గాం, అంకోలీ....అడవులు దద్దరిల్లేటట్లు - ఎటు చూసినా తుడుంమోతే....బరిసెలు, కర్రలు పట్టుకొని అడివిల్లనుంచి, లొద్దులనుంచి, చేండ్లల్లనుంచి ఎక్కడ మనుషుంటె అక్కడినుంచి లోకారి కేసి పరుగెత్తారు. పోలీ

షులు వ్యాన్లు దిగనేలేదు. పిస్తోళ్లమీద చేతులుంచి నలుగురు యస్సైలు వ్యాన్లు దిగి బిత్తరిచూపులు చూడసాగారు. మరో పావుగంటలో దాదాపు రెండువేలమంది జనం వ్యాన్లచుట్టూ మూగారు.

తొక్కిసలాట – పెడీ పెడీన కేకలు,

“ఊడువానికే” (దున్నేవానికే)

“భూమి ఫాజిలే” (భూమి కావాలి)

“కల్లేసర్కార్ తోడేంగే....”

పోలీసులను వ్యాన్లు దిగమన్నారు. బిక్కుబిక్కు మంటూ దిగారు. ఒక్క మాటన్నా మాట్లాడలేదు. ఏదో పనున్న వాళ్ళలాగా లోకారినుండి మామిడిగూడ కేసి నడవసాగిండ్లు. వాళ్ళముందు తుడుం కొడుతూ యువకుడు నడుస్తున్నాడు. మధ్యలో పోలీసులు వెనుక రెండువేలమంది జనం .... వాళ్ళ కసిని, కోపాన్ని మెడ నరాలుబ్బుతుండగా పెడీపెడీన కేకలు. ఇంకా దూరప్రాంతాలనుండి వచ్చే వాళ్లు వచ్చి చేరుతూనే ఉన్నారు.

వాళ్ళంతా మామిడిగూడ చేరుకునేసరికి పదకొండు గంటలయ్యింది....పోలీసులు వెనుకవచ్చి నిలిచిన వ్యాన్లలోకి ఎక్కి కూర్చున్నారు. వేల తలకాయల్లో నలుగురు యస్సయిలు చిక్కుబడిపోయారు.

ఒకామె గుక్క తిప్పుకోకుండా మక్తేదార్లు, కంట్రాక్టర్లు, అడివి అధికార్లు తమనెన్ని తిప్పలు పెట్టారో గొంతెత్తి అదో పాటలాగా బిగ్గరగా చెప్పింది. ఆఖరున యస్సై ముందుకొచ్చి “ఇన్నేండ్లు మమ్ముల పీక్కతిన్న సర్కారు మనుషులు మా గూడాలల్లోకి ఎందుకొచ్చిండ్లు?” అన్నది.

నలుగురు యస్సైల్లో ప్రమోషన్ కోసం ఆలోచించే అతను కొద్దిగా ఎకసెక్కెంగా “చూసి పోదామని వచ్చినం” అన్నాడు. మాట వ్యంగ్యం కాకుండా బెదురుగా వచ్చింది.

“మా మీదికి ఊ అంటే ఉరికచ్చే సర్కిల్‌గాదేడ బోయిండు” ఇంకొకామె కోపంగా.

ఏమి చేసేటట్టు లేదు. తమదగ్గర తుపాకులున్నాయి నిజమే. అవి కాల్చేకన్నా

ముందే ఈ జనం మీదబడతారు. ఎందుకొచ్చింది తిప్పలు - పోలీసులు చూస్తే వాళ్లు దిగేటట్లు లేరు.

జనం వొత్తుకొత్తుగ మీది కొస్తున్నారు.

"మీరు మంచిగా ఉండాలంటే మరీక గూడాలల్లోకి రామని క్షమాపణ చెప్పి వెళ్ళండి" అరుపులు కేకలు.

చేసేదేమీ లేక నలుగురిలో ఒకరు "మరి క రామ"ని క్షమాపణ చెప్పాడు.

"మీ అధికార్లకు చెప్పండి! గోండ్లకు భూములు గావాలని. రగల్ రాజ్జెం వచ్చేదనుక లడాయి జేస్తమని చెప్పుండ్లి. నైజాం మునిగిండు, కాంగిరేసు మునిగింది - తెలుగుదేశం మమ్ముల ముంచింది...." సోనేరావు అనే యువకుడు బిగ్గరగా మాట్లాడాడు.

"ఆత్రం అశోకును మీరే చంపిండ్లు ఉల్టా మా నాయకుడు అన్మంతరావును జేల్లేసిండ్లు - మా నాయకున్ని విడువకుంటె మేం ఊకోమని మీ సర్కారుకు చెప్పుండ్లి ...." ఇంకొకడు.

పోలీసులు వెనక్కి తిరిగారు....దిగాలుబడ్డ ముఖాలతో.

o o o

అక్కడ అంకోలి కీవల సర్కిల్ సిగరెట్లు తాగుతూ నిల్చున్నాడు. పోలీసులు వెళ్ళిపోయిన తరువాత అరగంటకు జీపు స్టార్టయ్యింది. సర్కిల్ కూసున్నాడు. పోలీసులు కూర్చున్నారు. ఇంతలోనే భయకరంగా తుడుం మోత - అంకోలినుండి జనం అడవిలో నుండి లోకారి దిక్కు జట్లుజట్లుగా పరుగెత్తడం సర్కిల్ చూసిండు. ఆ తరువాత అన్నివేపులనుండి తుడుం మోగడంతో సర్కిల్‌కు మతిపోయింది. జీబు వెనక్కి తిప్పుమన్నాడు. ఆదిలాబాదు చేరుకునేసరికి పన్నెండయ్యింది. ఆదర బాదరాగా జీబును ఒక దినపత్రిక విలేకరింటి ముందు ఆపాడు. తన ఉక్రోషాన్నంతా విలేకరికి చెప్పాడు.

o o o o

తెల్లారింది. యస్. పి. ఇంట్లో ఆ రోజు శుక్రవారం కనుక నౌఖర్లు, పోలీసులు కలిసి ఇల్లంతా కడుగుతున్నారు. వైర్‌లెస్ ఆపరేటర్ పరుగెత్తుకొచ్చాడు. కళ్ళు విప్ప

గానే డి. ఐ. జి. నుంచి వైర్‌లెస్. సైటుగొనుతినే స్లిప్పర్లన్నా వేసుకోకుండా పరుగెత్తాడు.

"మీ సర్కిల్‌గాడేదో పేపర్ల స్టేటిమింటిచ్చినాడు, చూశావా.... బయటినుంచి డి. ఐ. జి. ఇదే విషయంగూర్చి ఐ.జి.పి, డి. ఐ. జి. ఇంటెలిజెన్సు డి.జి.పి. హోం మినిస్ట్రీనుండి ఎంక్వయిరీలు.

యస్. పి. కీ ఎట్టకేలకు తెలుగు దినపత్రికలో ఎవడో కొంప ముంచినట్లుగా అర్థమయ్యింది. తెప్పించాడు. "తీవ్రవాదుల స్వైరవిహారం" హెడ్‌లైన్లు చూసి అదిరి పోయాడు. "జంకుతున్న పోలీసులు.... ఆదిలాబాద్ తాలూకాలో ఉగ్రవాదులకు గోండ్ల తిరుగుబాటుకు భయపడి పోలీసులు గ్రామాల్లో గస్తీ తిరగటం నిన్నటినుంచి నిలిపివేశారు. పోలీసులు గస్తీ తిరగడానికి పోతే గోండ్లు అడ్డగించి తమ ఇష్టంవచ్చి నట్లుగా తిడుతూ అవమానిస్తున్నందున పోలీసులు మొన్న ప్రత్యేక సమావేశం జరిపి ఈ మేరకు నిర్ణయించారు. పోలీసులను గస్తీకి పొమ్మని ఆదేశిస్తే వెళ్ళడానికి ఇష్టపడటం లేదని, మరెక్కడికైన బదిలీ చేయమని కోరుతున్నారని సర్కిల్...." పేపరు గిరవాటేసి గబగబా ఫోనెత్తి ఎవరినో చెడామడా తిట్టి - ఆ దినపత్రికను స్వాధీనం చేసుకొని కాలబెట్టవలసిందిగా ఆదేశమిచ్చాడు.

మళ్ళీ పేపరు తీసుకున్నాడు. ఈ పాటికే అది సర్క్యులేటయ్యి ఉంటుందని తోచింది. యస్. పి. కీ బుర్ర వేడెక్కింది. ఫోన్ చేసి సర్కిల్‌ను పిలిచాడు. సర్కిల్‌ను తిట్టినతిట్టు తిట్టకుండా అర్ధగంట తిట్టాడు.

"పోలీసులు ధైర్యస్థులేనని, ఇంద్రవెల్లిలో పోలీసు చనిపోయినా గోండుల అరాచక చర్యలను, వారిని ప్రేరేపిస్తున్న తీవ్రవాదశక్తులను అరికట్టడానికి, సమూలంగా తుడిచిపెట్టడానికి పోలీసులు ఆత్మవిశ్వాసంతో పని చేస్తున్నారని, కరపత్రం మధ్యాహ్నానికల్లా సిద్ధం చేయించి పంచాలి."

సర్కిల్ ముఖం మాడిపోయింది. జీపెక్కిన తరువాత పట్టరాని కోప మొచ్చింది.

మధ్యాహ్నానికల్లా పంచాలన్న కరపత్రాలు వాడవాడలా సాయంత్రానికల్లా పోలీసులే పంచారు. ఈలోగా యస్. పి. కీ ఒక పదిసార్లన్నా వైర్లెస్‌లో ఎంక్వయి

రీలు, మందలింపు లొచ్చాయి. అసెంబ్లీలో చర్చ జరిగినట్టు - భయపడుతూనే తమ ప్రాణాలకు ముప్పున్నా ప్రజలతరఫున అన్నిటికి సిద్ధపడి ఈ విషయం ప్రస్తావిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు ఎమ్. ఎల్. ఏ., బి. జె పి ఎమ్మెల్లే - కాంగ్రెస్ ఎమ్మెల్లే ఏక కంఠంతో ఉద్ఘాటించినట్లు వార్తలొచ్చాయి.

వాళ్ళందరు పట్టుపడుతున్నారు గనుక ఆదిలాబాదు మ త్తేదారైన విధాన పరిషత్తు చైర్మన్ ప్రత్యేక సమావేశానికి అనుమతించాడు.

ం ం ం

ఆ రోజు మార్చి తొమ్మిదవ తేది. ఆదిలాబాదులోని ఇతర ప్రాంతాలనుండి ఆదిలాబాదుకు అదనపు బలగాలను పిలిపించాడు యస్. పి. మూడు వ్యాన్‌లు, ఆరు జీబులు సిద్ధంగా వున్నాయి, ఆదిలాబాదు పట్టణం పోలీసులతో నిండిపోయింది. ఏదో జరుగబోతున్నట్లుగా - యుద్ధ వాతావరణంతో నిండిపోయింది.

అర్ధరాత్రి దాటిపోయింది. దాదాపు 2 గం॥ రాత్రి యస్. పి. ఆఫీసులో ఎర్రగా ఉబ్బిన కళ్ళతో, ఎడతెరిపి లేకుండా సిగరెట్లు తాగుతున్నాడు. ఆయన ఎడమ పక్క గోడకు ఒక పటం తగిలించి ఉంది.

ఆ పటంమీద కర్ర తిప్పుతూ యస్. పి. చెప్పుతున్నాడు. "ఆ గుట్టల్లో దళాలున్నాయి. జామిని,తోయగూడ, మేడిగూడలో తప్పకుండా వాళ్ళఅగ్గనై జర్గున్నారు. మీరిప్పుడే వెళ్ళాలి. టిఫిన్‌లు, తిండి అన్నీ సిద్ధం చేసుకోండి. జామిని, తోయగూడ, మేడిగూడాలను ఎన్‌సర్కిల్ చేయాలి" సర్కిల్ ముగించాడు.

మరో పది నిమిషాలల్లో మూడు వ్యాన్‌లు, ఆరు జీబులు బయలుదేరాయి. నెల ఎప్పుడో గూకింది. చిక్కగా, చీకటి చీకటిగా పరుచుకొని ఉన్న చెట్ల నీడల ఛేదిస్తూ.... ఆ పటాలం సాత్నాల చేరుకునేసరికి రాత్రి మూడున్నర. అక్కడ మూడు బ్యాచ్‌లుగా విడిపోయారు. సర్కిల్ జామినీకేసి సాగే బ్యాచ్‌కు నాయకత్వం వహించాడు, జామిని ఊరి ముందు జీబులాపిండ్లు. లైట్లు బందు చేసిండ్లు. కుక్కలు జుయ్యి జుయ్యిన మొరగసాగినయ్. పట్లమీది ఎడ్లు బెదిరి తలుగులు తాళ్ళు తెంపుకున్నయ్. ఆ గడబిడలో ఒక గోండురైతు లేచి ఆదరబాదరగా తుడుం గొట్టిండు. సర్కిల్ ఆ రైతుమీద పడ్డాడు. తుడుం పగిలిపోయింది.

ఆ శబ్దానికి ఊరంతా లేచింది. ఏది దొరికితే దానితోని ఆ చీకట్లోనే పోలీసుల

మీద పడ్డారు. ఇస్రూ అనే గోండురైతు బల్లెంతో సర్కిల్‌మీద పడ్డాడు సర్కిల్ టోపీ కిందబడ్డది. లొల్లి - ఏడుపులు, అరుపులు, తిట్లు - పోలీసులు జనం కల బెని గారు పోలీసులకు జనానికి దెబ్బలు తాకినయ్. తెల్లారే చుక్క పొడిచే సమయానికి 9 మందిని తుక్కు తుక్కు గొట్టి జీబులేసిండ్లు. నలుగురు పోలీసులు నడవలేకుండయి పోయారు. వాళ్ళ తోయగూడ వేపు కదిలేసరికే తోయగూడెం పోయిన బ్యాచ్‌లోని పోలీసులు, యస్సయ్‌లు బట్టలు చిరిగి తన్నులుతిని పరుగెత్తుకొచ్చారు. మేడిగూడకు పోయిన వాళ్ళేమయ్యారో తెలియదు. తుడుములు భయంకరంగా మోగుతున్నాయి. పోలీసులు ఒకరిమొకాలు ఒకరు చూసుకున్నారు. సర్కిలు నెత్తంతా దుమ్మే.

సర్కిలుకళ్ళు ఎర్రగా, అతను ఉన్మాదిలా బొబ్బలుపెట్టి అరుస్తున్నాడు. అప్పటికి కరకర పొద్దు పొడిసింది.

ఈసారి రెండుబ్యాచ్‌లు ఒక్కటై తోయగూడకేసి సాగాయి. సాత్నాల ప్రాజెక్టు కాలువల ప్రక్కన జీబులు, వ్యాన్‌లు ఆపారు. పది పన్నెండు సంవత్సరాల పిల్లని ఒక గోండుబాలుడు వీరావేశంతో తుడుము కొడుతున్నాడు. అప్పటికే వాళ్ళ దినుసులు పారబోయబడ్డాయి. గుడిసెలు కూలగొట్టబడ్డాయి. దొమ్మీలు జరిగాయి. స్త్రీల గుడ్డలు చింపారు.

స్త్రీల రొమ్ములమీద పోలీసులు గుద్దారు ... ఎండ ఎక్కిపోతోంది.

పోలీసులు ఊళ్ళెకుబోయి ఇదంతా చేశారు. ఒక్క పురుషుడన్నా కనిపించలేదు. మళ్ళీ వ్యాన్లదగ్గరి కొచ్చారు. వ్యాన్‌ల చాటునుంచి, కాలువల్లోనుండి జనం ఒక్కపెట్టున పోలీసులమీద పడ్డారు.

ముసలి ఎగోదిరావు పండ్లు పటపట కొరుకుతూ ఒక బండి ఎత్తుకొని పోలీసు మీద వేయబోయాడు. పోలీసు పరుగెత్తి ఎగోదిరావును పట్టుకున్నాడు. ముసలి ఎగోదిరావు. బతుకంతా తన్నులు, దెబ్బలు తిన్న ఎగోదిరావు.... నాగరికులు, సర్కారు తరిమి తరిమి కొట్టగా ఊపిరి సలుపక కీకారణ్యాలల్లోకి ముడుచుకపోయిన ముసలి ఎగోదిరావు.... తన తరతరాల గోండు కసితో పండ్లు కొరుకుతూ పోలీసును బాదుతూనే ఉన్నాడు. పోలీసు స్పృహతప్పి పడిపోయాడు. ముసలి ఎగోదిరావు స్పృహతప్పి పడిపోయాడు.

సర్కిలు టియర్ గ్యాసుకోసం ఆర్డరిచ్చాడు. పోలీసులు టియర్ గ్యాసు గోళాలు విసిరారు జనం టియర్ షెల్సు తీసి దూరం విసిరి పారేశారు. కొందరు బుసబుస పొంగే వాటిమీద మట్టి చల్లారు. ఉల్లిగెడ్డలు వెంట తెచ్చుకున్నవాళ్ళు వాసన చూశారు. తమకున్న కర్రలలో, బండలతో ఆదివాసులు పోలీసులమీద మరొకమారు పడబోయారు. తుపాకులు మొరిగినయ్. గాలిలోనికి కాల్పులు సాగినయ్. గిరిజనుల్లు తగ్గారు.

అట్లా పోలీసులకు, ఆదివాసులకు తెల్లవారు ఝామున 4 గంటలకు మొదలయిన సంకుల సమరం ఉదయం పదిగంటలవరకు ముగిసింది.

పోలీసులు దాదాపు 150 మందిని అరెస్టు చేశారు. అందులో వాళ్ళ నాయకుడు భగవతిరావు కూడా ఉన్నాడు.

మూడు గ్రామాలను ధ్వంసంచేసి ఆదిలాబాదుకేసి పటాలం కదిలింది, పోలీసులంతా దెబ్బలు తిన్నారు. ఈ గండం గడిచినందుకు ఎవరికి వారికి చిత్రంగానే ఉన్నది. దాదాపు 20 మంది పోలీసులు వ్యాన్లల్లో దెబ్బలతో మూలుగుతున్నారు

వ్యాన్లు చెట్ల నీడల కిందినుంచి కదిలాయి... పోలీసుల ముఖాలల్లో విజయగర్వం లేదు. నెత్తురుచుక్క లేదు కాని ఆ నెత్తురు ముద్దలైన ఆదివాసుల్లు - పిడికిళ్లెత్తి అడివి అడివంతా ప్రతిధ్వనించే విధంగా - పిట్టలు, జంతువులు అలకల్లోలమయ్యే విధంగా, గూడాలన్నీ ఆ గొంతులు వినిపించే విధంగా నినదిస్తూనే ఉన్నారు.

"కల్లేసర్కార్ తోడేంగే" (ఝూటా సర్కారును దించుతాం)
"రగల్ రాజ్జెం పైసివాకట్" (రగల్ రాజ్జెం గెల్చివస్తాం)
"ఊడువానికే భూమి పాజిలే"
"రైతు - బూతి సంగెం జిందాబాద్" (రైతుకూలి సంఘం జిందాబాద్)

మార్చి సంచికలో అసంపూర్తిగా ప్రచురింపబడిన 'జానకి విముక్తి' సమీక్ష మళ్ళీ మే సంచికలో కొనసాగుతుంది.

—సంపాదకుడు

ప్రతిబింబం
— అన్న.

తల పైకెత్తి
ఆకాశం వైపు చూసి
గతాన్ని నెమరేస్తూ
ఎర్రటి ముడుతలు పడ్డ ఆ ముఖం
అనంతకోటి ఆదివాసుల
ఆరాట పోరాటాల ప్రతిబింబం
తలలోని కదలికలు
ఆ కదలికల అవ్యక్త ఆవేదన
ఆ ఆవేదనలో పోరాట పటిమ
ఆ పటిమలో అన్నల ఎడల విశ్వాసం
ఆ విశ్వాసంలో కాచి వడబోసిన జీవితానుభవం—
ప్రేవు తెంచుకొని బయటపడ్డ
కడుపున పండిన పంటను
కన్న కొడుకును
అన్నలతో పంపాడని విన్నప్పటికంటే
నెరసి ముడుతలు పడ్డ ఆ ముఖంలో
పోరాట బావుటా ఎత్తి పట్టాలనే పట్టుదల
గోగుపూల ఎర్రదనం కూడ గగుర్పాటు చెందే
అరుణారుణ దృశ్యం
ఓ అయ్యా !
గోండు ప్రజల వారసుడా
మా ఆశల ప్రతిరూపమా
నీ కిదే లాల్ సలాం.

(ఎదిగి చేతికందిన ఇరవై సంవత్సరాల కొడుకును రైతాంగ దళంలోకి పంపిన ఓ ఆదివాసి తండ్రిని, ఒక సమావేశంలో ప్రసంగిస్తున్నప్పుడు చూసిన ప్రేరణతో-)

ఎర్రరేకులు

— గంగన్న

ఆ కారడవిలో
ఆ కొండకోనల్లో
అడివిలో ఆకులై
కోనలో కోనలై
వెన్నెల్లో వెన్నెలై
చీకట్లో వెన్నెలై
నిలిచి పోరినవేళ

○ ○ ○

నిలిచి పోరి
పోరి నిలిచిన
ఎర్ర సైనికుడు
ఎర్ర సైనికురాలు
అయ్యకు, అవ్వకు దూరంగా....
గులాబీల సోయగాల
రంగరంగ వైభోగాలకు దూరంగా....
ప్రకృతి సాక్షిగా
సహచరుల సాక్షిగా
తోడునిలిచిన ప్రజలముందు
ప్రజలకోసం చివరివరకు

చివరివరకు ప్రజలకోసం
ప్రాణమి స్తమని ప్రతినబూని
నదీనదాల్
బాటలు - పేటలు
కొండలు - కోనలు
కలసే తిరుగుదమని
దండలు మార్చుకున్న వేళ

○ ○ ○

ప్రతిన విన్న ప్రకృతి
ప్రకృతి ఒడిలో నిలిచిన బూరుగు
తన రెమ్మల్లో కొమ్మల్లో పూచిన
ఎర్రరేకులను ఆమోదంగా విసిరినవేళ..
అడుగు అడుగు
కదం కదం కలిపి నడుస్తూ
'కదంతాల్' చేసిన కావ్య—
భుజం భుజం కలిపి నడుస్తూ
గూడెం గూడెం కలియతిరుగ
లాంగ్ మార్చ్!
లాంగ్ మార్చ్!!

తుపాకిమోతల మధ్య

— గోదావరి

ఒరుసుకుంటూ, ఒత్తుకుంటూ
పొంగి పొర్లిన గోదారి
అలసి సొలసి సాగన్నుగా
ఇదుగో యిప్పుడే నిదురపోయింది

అడవి ఆకులమీదుగా మాట్లాడి
పాడిపాడి అలసిందేమో
మూగగా కూర్చున్నది

రాత్రి దిగాలుపడ్డ వెన్నెలను
సముదాయిస్తోంది

తరతరాలనుండి యుగయుగాలనుండి
మట్టి పిసికిన మనుషులు
పేగుపొర్లి గుడిసెల చూర్లకింద
ఒకటౌతున్న వేళ
చిమ్మెట్ల గానం
ఆశల నక్షత్రాల తళతళలు....

కుక్క అడవికేసి తిరిగి
అదేపనిగా మొరుగుతోంది
దగ్గరవుతున్న కాంతుల నీడలు
కుక్క మొరగడం హెచ్చింది

ఒకటి.... రెండు.... మూడు
యుద్ధరంగంలో కాలం సెకన్లద్వారానే
లెక్కించబడుతుంది

నాలుగో సెకండులో
'కావలికుక్క'చేతిలోని తుపాకీ మొరిగింది
అటువైపు సరుకునే అడుగుల చప్పుడు
కాల్పులు ... కాల్పులు.... కాల్పులు

o o o

తెలారింది....
ఒకవైపు
సూర్యకిరణాల వెలుగులో
మట్టిని చీలుస్తూ నాగళ్ళు
పొలాలు దున్నుతున్నాయి
గోదావరి తీరంమీది పల్లెలకు
చెట్లు ఆకులద్వారా వార్తల్ని పంపు
తున్నాయి

మరోవైపు
ఇటు గోదావరిమీద
అటు మరాఠా అడవి బందుకు
ఇంకా బస్తర్ చుట్టూ
తుపాకుల చక్రబంధం వేసేందుకు
పోలీసుల బోగీలు భువనేశ్వర్‌లో
బయల్దేరుతాయి

కాని
మచ్చల ముఖపు పోలీసాఫీసర్ మాత్రం
బతుకు జీవుడా అంటూ
ట్రాన్స్‌ఫర్‌కోసం హెడ్‌క్వార్టర్స్‌కు
పోతాడు.

ఆయుధాలన్నీ నగ్నంగానే వుండవు

— ఉషా ఎస్. డానీ

ఏప్రిల్ యిరవై
పందొమ్మిది వందల ఎనభయ్ ఒకటి
ఇందిరమ్మ జలియన్‌వాలాపార్కు
ఇంద్రవెల్లిలో తాగిన రక్తంమార్కు

గతితర్కం తెలీదుగానీ
పండ్లను పొట్ట బెట్టుకున్నా
మొలకెత్తే గింజల భయం

చెరిపేస్తే చెరగని
చిందిన నెత్తుటి డాగులు
పుష్పిస్తాయని భయం

నర్సాపురం హైలో
పెట్రోలు పడ్డా పడకపోయినా
ఇంద్రవెల్లి హైలో
తిరుగుబాటు తప్పదని భయం

కోటి కొక్కడు
కొమురం భీం
కోట్లమందిగా మారుతున్నాడని భయం

తప్పని తిరుగుబాటును
తప్పించాలని తాపత్రయం
పేలే అగ్నిపర్వతంపై
పిడికెడు నీళ్ళు చల్లే ప్రయత్నం
అయినా తప్పదు
ఆ తుడుం మోగకా మానదు
ఆ రక్తం పుష్పించకా మానదు

ఒక ప్రక్క
కూపీలు, కూంబింగులు
స్క్రీనింగులు, చిత్రహింసలు
లారీలు, తూటాలు, తుపాకులు
ఎదురు తిరిగితే
"ఎదురు కాల్పులు"

మరోపక్క
దయ్యాలు వేదాలు వల్లించినట్లు
కాలయమునికి కాషాయాంబరాలు
అణచివేత పనిముట్టు రాజ్యాంగయంత్రం
ఆలపిస్తున్న అహింసా సైరన్

మేకల మందమీదికి
తోడేళ్ళ అతిథులు
గోండుల జాతరలో
గోముఖవ్యాఘ్రాల దర్బార్‌లు
పోలీసుమంత్రి మన గృహమంత్రే!

సంక్షోభ పరిష్కారానికి సంక్షేమ మంత్రి
ఆదివాసుల శ్రమ కొల్లగొట్టడానికి
పారిశ్రామిక శిక్షణాకేంద్రం
గిరిజనుల సంక్షేమానికి
గిరిజన రక్షకభటులు!

పులిని కప్పిన మేకతోలు
ఎరదాపున ఉక్కుగాలం
విసిరిన నూకల అడుగున
నూచేసిన వల
ఆయుధాలన్నీ నగ్నంగా వుండవు నేస్తం
విషం ఒక్కటే
విషయమూ ఒక్కటే.

సాత్‌నాలా

— వి. వి.

యూరపును 'కమ్యూనిస్టు భూతం' భయపెట్టింది
జపాను వ్యతిరేక యుద్ధంలో చాంగ్‌కై షేక్
'ఎర్ర బందిపోట్ల' నాశనాన్ని ఆశించాడు

సుందరయ్య మొదలుకొని 'హిందూ రజాకార్ల' దాకా
రోశయ్య మొదలుకొని మాణిక్‌రావుల దాకా
నక్సలైట్ల బెడద గురించి బెంగపడిపోతున్నారు

భారత ఆకాశంలో నెలవంక వెన్నెలలను కూడ
దోచుకున్న దోపిడీ వర్గాలకు
చంద్రవంక పరాయిదిగా కనిపించింది
సూర్యోదయానికి అరచేతిని అడ్డుపెడితే
సాంప్రదాయజెండా విదేశీ జెండాగా కనిపించింది

పరిషత్ పరీక్షితుకు
క్యాబినెట్‌లో పోలీసుల్లో ఎక్కడబడితే అక్కడ
నక్సలైట్లే కన్పిస్తున్నారు
ప్రజా ప్రతినిధులు
శాసనసభ రహస్య సమావేశాల్లో
ఆయుధాలు పంచుకుంటున్నారు
తుపాకులు పేదపోలీసుల చేతుల్లో పెడితే
ఎటువైపు గురిచూస్తాయో అనుమానంగా వుంది
భూస్వాముల ఇళ్ళల్లో దాచుకుంటే
ఎవరి చేతుల్లోకి పోతాయో గుండెదడగా వుంది
తుపాకి రాజ్యంలో తుపాకులు
చైతన్యవంత మవుతున్న ప్రజలచేతుల్లోకి
పోకుండా పట్టుకోవడం ఎట్లా అని
ప్రాణాలమీద ఆశ వదులుకుని
సాయుధ పహారాల్లో

ప్రజాస్వామ్యం గర్భగుడిలో పరిశోధిస్తున్నారు
గిరిజనులు స్వతంత్రులవుతున్నారని
సామ్రాజ్యవాద, భూస్వామ్య బానిసలు గింజుకుంటున్నారు.

మార్క్స్,
నువ్వు వందఏళ్ళ క్రితం మార్చి 14న మరణించి
సమాధిలో శాశ్వతనిద్రలో కెళ్ళావో
'భూతాని'పై సంచరిస్తున్నావో కానీ
విక్రమార్కుని భుజంమీద
బరువైన భేతాళుని శవంలా
సమాధానం వుండే మౌనంవహించే మేధావుల
తలలు బ్రద్దలు చేసే సవాళ్ళు విసురుతున్నావు
సమాజంలో అనుక్షణం సంచలనం సృష్టించే
'సాత్‌నాలా'పై ప్రవహిస్తున్నావు.

విజ్ఞప్తి

పోరాటం డైరెక్షన్‌గా, పాట ఆక్సిజన్‌గా తుదిక్షణంపరకూ జీవించి తన నెత్తురును ఈ నేలతల్లి విముక్తి కోసం విత్తనంగా నాటిన చెరబండరాజు నేడు భౌతికంగా మనమధ్య లేడు. కాని ఆయన రాజకీయ నిబద్ధత, విప్లవదీక్ష నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతమయేదాకా, ఆపైనాకూడా చెరిగని స్మృతిగా నిలిచిపోతాయి. ఆ అమరుని స్మారకార్థం మేము తలపెట్టిన గ్రంథాలయ నిర్మాణానికి దాదాపు 10 వేల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా. ఈ కృషిలో మాకు విరాళాలు యిచ్చి సహకరించవలసినదిగా ప్రజాస్వామ్యవాదులందరినీ కోరుతున్నాం.

విరాళాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :-
పి. రామకృష్ణారెడ్డి, జర్నలిస్టు,
31-3-16, మారుతినగర్,
విజయవాడ-4.

చెరబండరాజు స్మారక గ్రంథాలయ నిర్మాణ కమిటీ
విజయవాడ.

కళాలకు సంకెళ్ళు లేవు :

'నిప్పురవ్వ'

— వెంకన్న

[వరంగల్ జైల్లో నవంబరు 2, 83న విప్లవఖైదీలు జరుపుకున్న కామ్రేడ్ పెద్దిశంకర్ సంస్మరణ సభలో చదివిన కవిత]

కామ్రేడ్ !
నిన్ను చంపారు, భుజాలెగరేశారు
నిన్ను చంపినవారు దోపిడీ సజావుగా సాగించగలమనుకున్నారు
అవన్నీ అడియాసలైనయి.

నిజం కామ్రేడ్ !
నిన్ను చంపారు, కాని
న్యాయాన్ని చంపలేరు,
నీ ఆశయాన్ని చంపలేరు,
అది ఎల్లవేళలా సూర్యకాంతియే,
అది ఎల్లప్పుడూ చిరంజీవియే,
అది అజేయమైనది.
నీ ఆశయాన్ని చంపాలనుకుంటే
చరిత్రలో ప్రజాశత్రువుల లాగ
వీళ్ళు కూడ నాశనమవుతారు, తథ్యం !
ఇది చరిత్ర సత్యం.

కామ్రేడ్ !
ఇప్పపూలలో నిప్పు రగిల్చిన నువ్వు,
అడవిలో తుడుం మోగించిన నువ్వు
గోండన్నలకే రణం నేర్పిన నువ్వు
అమరుడవయ్యావు.

కానీ
నీ ఆశయం మాత్రం,
అంటుకున్న అడవిలాగా రగుల్కొంటున్నది
నీ ఆశయసాధనకు ఆదివాసులు
నువు మోగించిన తుడుం ధ్వనిలో
ముసుముందుకే వస్తున్నారు
మేమూ తోడవస్తున్నాం.

అడవి మీద సూర్యుడు

అడవిమీద సూర్యుడు
అలలమీద సూర్యుడు
అలల కలల పడవ వడక
కలలబాట సూర్యుడు

తెడ్డేసిన జాలరన్న
తెరచాపగ సూర్యుడు
ఎదురీదే అడివన్నల
చూపుల్లో సూర్యుడు

కొండమీద గోగుపూల
కొరక్కల్లో సూర్యుడు
గోండన్నలు మోగించిన
తుడుం పిలుపు సూర్యుడు

అదివాసి పోడుచేస్తే
ఉదయించిన సూర్యుడు
అదివాసి పోరుచేస్తే
అడుకున్న సూర్యుడు

మనిషినీడ సూర్యుడు
వెలుగుజాడ సూర్యుడు
ఆకాశం అలలమధ్య
కొండసిగలా సూర్యుడు

అటువైపున సూర్యుడు
ఇటువైపున సూర్యుడు

చెట్లగుబులు చీకట్లను
చీలుస్తూ సూర్యుడు

అదివాసి కొలుస్తున్న
నీటిలోతు సూర్యుడు
గోదావరి ఎగుస్తున్న
గుండెపొంగు సూర్యుడు

ప్రజలగొంతు పాటలోన
పరుగునేర్చె సూర్యుడు
పోరాటం గొంతులోన
వెలుగనేర్చె సూర్యుడు

ప్రతిక్షణం సూర్యుడు
నిరీక్షణం సూర్యుడు
శ్వాసల్లో సూర్యుడు
చెమట చుక్క సూర్యుడు

ప్రతిస్పందన సూర్యుడు
ప్రతిఫలనం సూర్యుడు
ప్రతిధ్వని సూర్యుడు
భవిష్యత్తు సూర్యుడు

వర్గయుద్ధ వ్యూహంలో
దూసిన ఖడ్గం సూర్యుడు
మృతవీరులు రక్తాంకిత
పతాకమే సూర్యుడు

గడ్చిరోలీ ఆదివాసీ జనజీవితం - సంస్కృతి

—సాధన

ఏ ప్రాంతంలోనైనా ఉద్యమ నిర్మాణానికి పూనుకున్నపుడు ఆ ప్రాంతానికి సంబంధించిన సాంఘిక, ఆర్థిక కట్టుబాట్లను, ఆ ప్రాంత ప్రజల రాజకీయ చైతన్య స్థాయిని తప్పనిసరిగా ఉద్యమకారులు అధ్యయనం చేయాల్సి ఉంటుంది. అందుకే కా|| మేడ్ మావో ఏ ప్రాంతంలోనైతే పని చేస్తుంటామో ఆ ప్రాంతానికి సంబంధించిన కనీసం 100 సంవత్సరాల చరిత్రనైనా తప్పనిసరిగా అధ్యయనం చేయడం అవసరం అంటారు. ఆయా దేశాల్లో జరిగిన ప్రజాస్వామిక పోరాటాలను, తిరుగుబాట్లను, ఓటములను గెలుపులను మదింపు వేసుకుంటూ, గత అనుభవాలను ముందు సాధించబోయే విజయాలకు సోపానాలుగా మలచుకోవడంతోనే, ఆ పోరాటంలో జరిగిన దుష్ఫలితాలను గుణపాఠాలుగా తీసుకుంటూ పోవడంతోనే విజయాలు ముడిపడి ఉంటాయి. ఈ రోజు అడవి ప్రాంతంలోని గిరిజనుల్లో పనిచేస్తున్న వారు ప్రతి విషయాన్ని కూలంకషంగా అధ్యయనం చేయాలి. ఈ దేశ చరిత్రలో గిరిజనులు చాలా తిరుగుబాట్లు చేసినట్లు మనకు తెలుస్తుంది. కాని వాళ్ళ తిరుగుబాట్లు (దాదాపుగా 99 జరిగినట్లు చరిత్ర తెలుపుతుంది) విఫలం కావడానికి ప్రధానకారణం ఒక లక్ష్యం లేకపోవడమేనేమో అనిపిస్తుంది. కాకపోతే ఓ మేరకు వాళ్ళ సమస్యల్లో కొన్నింటిని తీర్చుకోగలిగారు.

ఈనాటి ఉద్యమ నిర్మాణకర్తలందరూ కూడా ఆదివాసి రైతాంగంలో ఉన్నటువంటి చైతన్య లక్షణాలను పరిశీలించడంపై కేంద్రీకరించాలి. ఆయా ప్రాంతాలకు సంబంధించి కొన్ని ప్రత్యేకమైనటువంటి లక్షణాలున్నప్పటికీ సర్వసాధారణ లక్షణాలు కూడా లేకపోలేదు.

అనేక దశాబ్దాలుగా జరిగిన గిరిజన తిరుగుబాట్లన్నీ కూడా ప్రధానంగా సామ్రాజ్యవాద వ్యతిరేక తిరుగుబాట్లుగానే జరిగినవి. మైదాన ప్రాంతంనుండి అనేక రకాలుగా వచ్చి స్థిరపడిన వారిని కూడ తమకు వ్యతిరేకులుగా భావించడం కూడ ఉంది. కాలక్రమంలో గిరిజనుల సహజ ఆర్థిక విధానం దెబ్బతిని పోయింది. దాని స్థానంలో స్పష్టంగా ఉన్నతమైన మరో ఆర్థిక విధానం అమలులోకి రాలేదు. గిరిజన రైతాంగం కూడ కూలి పద్ధతులకు అలవాటుపడిఉంది. తమ నిత్యావసరాలైన కుండలు,

బట్టలు మొదలైన వాటి కొరకు మార్కెట్టుపై ఆధారపడే పద్ధతిఉంది. కొన్ని ప్రాంతాలు మినహాయించి చూస్తే వర్గ విభజన ప్రాథమిక స్థాయిలో ఉంది. వారి సామాజిక నిర్మాణ స్వరూపం తెగ కట్టుబాట్లకు అనుకూలంగానేఉంది.కాలక్రమంలో జరిగిన ఈ పరిణామ ఫలితంగా గిరిజనులు తమ ఉనికి సమస్యను ఎదుర్కొంటున్నారు. తమకంటూ ఒక ప్రత్యేక భాషా,సాంప్రదాయాలు, జీవన విధానాలు వేరుగా ఉన్నాయనే అభిప్రాయాలు కూడ బలంగా వున్నాయి. అందువల్ల దేశంలో జరిగే గిరిజన రైతాంగ తిరుగుబాట్లన్నీ కూడ తమ ఉనికిని కాపాడుకోవడం కొరకు జరుగుతున్నవిగా కార్మికవర్గం ప్రప్రథమంగా గుర్తించాలి. తర్వాత దేశంలో జరుగుతున్న సామాజిక విప్లవంలో అంతర్భాగంగానే అని ప్రధాన శతృవులకు వ్యతిరేకంగా గురిపెట్టబడినవి అని అర్థం చేసుకోవాలి. నూతన ప్రజాస్వామ్య విప్లవ విజయానికి భౌగోళికంగా అడవి ప్రాంతం ప్రాముఖ్యాన్ని అర్థంచేసుకుంటే గిరిజనరైతాంగాన్ని కార్మికవర్గ నాయకత్వం కింద సంఘటితం చేసుకోవలసిన అవసరాన్ని లోతుగా గ్రహించగలుగుతాం.

నేడు మహారాష్ట్రలోని అహిరి, సిరొంచ, ఏటపల్లి తాలూకాల్లోని ఆదివాసులను పోరాటానికి సమీకృతం చేస్తుండడంలో భాగంగా వారి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విషయాల అధ్యయనానికి కృషి జరుగడంలో భాగంగా ఈ వ్యాసం ఉద్దేశింపబడింది.

19వ శతాబ్దం అర్థభాగంలో ఈ అహిరి, సిరొంచ, ఏటపల్లిలతో పాటుగా మధ్యప్రదేశ్‌లోని పట్నం మొదలైన ప్రాంతాలు కలసే ఉండేవి. ఇపుడు అహిరి మహారాజుగా పిలవబడుతున్న ఆత్రం విశ్వేశ్వర్రావుకు ముందు తరాలకు సంబంధించిన ఆత్రం ధర్మారావు అప్పటిరాజు.ఇతనికి వీర బాబూరావు సడిమెక్ రాజ్యాధికారం విషయంలో సహజ వైరుధ్యాలు తీవ్రంగానే ఉండేవి. బ్రిటిషర్స్‌కు కప్పం చెల్లించేవిషయంలో వీరబాబూరావు సడిమెక్ వ్యతిరేకించడం,దానికి,ఆత్రం ధర్మారావు 70 వేలు చెల్లించడానికి అంగీకరించడంతో బ్రిటిష్‌వారి అండ ధర్మారావుకే ఉండింది. చుంచుగోండి వద్ద వీరబాబూరావు ఇద్దరు బ్రిటిష్ అధికారులను చంపినట్లు తర్వాత ఏటపల్లికి 15 కి.మీ. దూరంలో ఉన్న సూర్జాగఢ్ పర్వతాలను ఆధారంచేసుకొని గెరిల్లా పోరాటంచేసినట్లు తెలుస్తున్నది.ఇతనికి వదిన అయినటువంటి'లక్ష్మీబాయి' కుట్రల ఫలితంగా బాబూరావు బ్రిటిషర్స్‌కు పట్టుబడ్డాడు. 1858లో అక్టోబర్ 21 న, వీర బాబూరావును చంద్రపూర్‌లో ఉరితీశారు. స్వాతంత్ర్యానంతరం వీరి సంస్థానం

లోని సైన్యం రద్దుగాబడింది. నాగ్‌పూర్‌కు చెందిన కమాండర్ రోషన్‌వాల దగ్గర తర్వాత ఇక్కడి అంగెపల్లి రేపు దగ్గర శిక్షణ పొందిన 60 మంది సైన్యం ఉన్నట్లు తెలుస్తున్నది. వీరిని తెలంగాణాలోని రజాకార్లు గోదావరి-ప్రాణహితలు దాటిరాకుండా నిరోధించడానికి వినియోగించినట్లు అందులో పనిచేసిన వారివల్ల తెలుస్తున్నది.

ఇపుడు ఇక్కడ రాజకీయంగా ప్రాముఖ్యత కలిగిన వ్యక్తిగా ఆత్రం విశ్వేశ్వర్రావును పేర్కొనవచ్చు. గోండులు ఇతన్ని 'అహెరి మహరాజు'గా వ్యవహరిస్తారు. ఇతడు కొన్ని వందల ఎకరాల భూస్వామి. తాలూకాలోని చుట్టుప్రక్కల గ్రామాల నుండి రైతాంగం బత్తేలతో తరలివచ్చి ఇతని భూమిని వెట్టికి సాగుచేయాలి. ఈ మాడియా గోండులలోనే 'మహరాజు'కు అధిక ప్రాబల్యం ఉంది. ఇతడు ఇంతకు క్రితం లోక్‌సభకు, అసెంబ్లీకి ఈ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహించాడు. ప్రస్తుతం జనతా పార్టీతో సంబంధాలు ఉన్నట్టు విశ్వసనీయవర్గాల ద్వారా ద్యోతకమవుతుంది. సోషలిస్టు ముసుగులో కొనసాగుతూ ప్రత్యేక విదర్భ ఉద్యమంలో ఒక భాగస్తుడుగా పేర్కొనబడుతున్నాడు. ఇతడు అహెరిలో ఒక పెద్ద బంగళాలో నివసిస్తాడు. గోండ్ల సమస్యల గురించి ఎప్పుడూ మాట్లాడడు. ఇతనికోపమంతా ఫారెస్ట్ డిపార్టుమెంట్ మీదే. ఎందుకంటే తాను అహెరి రాజుగా బ్రిటిష్ సామంతుడిగా ఉన్నరోజులలో అడవిలోని టేకులంతా తన స్వంతం. ఇప్పుడు అవి ఫారెస్టుడిపార్టుమెంటుకు చెందుతుంది. ఇప్పటికీ ఇతని పేరుతో గోండువాణి పత్రిక చంద్రపూర్ నుండి వెలువడుతున్నది. స్థానికంగా ఇక్కడ ఇతనికి రాజకీయ ప్రత్యర్థి ఇతని అన్న కొడుకు ధర్మారావు మాత్రమేనని రాజకీయ పరిశీలకులు చెప్పుకుంటారు. ఇతడు ఇందిరా కాంగ్రెస్‌కు ఇక్కడ నాయకత్వం వహిస్తూ ప్రస్తుతం అహెరి బ్లాక్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నాడు. అధికార వర్గాల్లోని కుమ్ములాటలు, కుటుంబంలోని సహజ వైరుధ్యాలు వీరిరువురి మధ్య తీవ్రంగానే ప్రతిబింబిస్తున్నవి. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన చేతుల్లో ప్రజలను ఉంచుకోవడానికి ఆత్రం విశ్వేశ్వర్రావు ప్రతి దసరాకు అహెరిలో పెద్ద ఉత్సవం ఏర్పాటుచేస్తూ జంగ్లాత అధికార్ల దోపిడీ, పోడు గొట్టుకొని వ్యవసాయం చేసుకోనడం లాంటి ఆకర్షణీయమైన ఉపన్యాసాలతో గోండులను ప్రేరేపించడం ఇతని అలవాటు. ఇంతక్రితం 'గూడాలలోని' పటేళ్ళందరూ ఇతని రాజకీయ పలుకుబడి కిందివారే. క్రమంగా ఈ సంఖ్య చాలా క్షీణించిపోతున్నది. ఇపుడు ఇతని గోసాయి చిట్కాలకు ప్రజల్లో విశ్వాసం లేకపోవడంతో నలుగురయిదుగురు పెద్ద మనుషులను మాత్రం వెంటతిప్పుకో

గలుగుతున్నాడు. గూడాల్లో తెగని పంచాయితీలు ఏవైనా ఉంటే అతడు వచ్చి పెద్దమొత్తాల్లో దండుగలు వేసి పరిష్కారం అంటాడు. ఆకుల సీజన్‌లో కంట్రాక్టర్ల నుండి డబ్బు గుంజటానికి తన పలుకుబడిని ప్రయోగిస్తూ రేటు పెంచుకోవాలంటూ ప్రజలకు సమ్మెపిలుపు ఇచ్చి ఠేకేదారులు కలువడంతో వారితో మిలాఖత్ అయిపోయి డబ్బు తీసికొని నమ్మిన అమాయకపు గోండులను నట్టేట్లోకి ముంచడం ఇతని వర్గ లక్షణం. పైగా 'నేను నాగపూర్, బొంబాయిలలో సర్కార్‌తో కొట్లాడి వచ్చే యేడు రేటు పెంచిస్తాన'ని ప్రతి సంవత్సరం ప్రజలకు నిస్సిగ్గుగా బుకాయించడం ఇతని వర్గ సాంప్రదాయం. ఇప్పుడిప్పుడే ఈ ప్రాంతవాసులు ఇతని 'అప్ప పన్ను వులి' నిజరూపాన్ని తెల్సుకుంటూ పోరాటపథంలో పురోగమించడానికి సాహసిస్తున్నారు.

మాడియా గోండులు ప్రధానంగా వరి పంటపైనే ఆధారపడుతారు. పప్పు దినుసులకు ముఖ్యంగా చిక్కుళ్ళు, అనుములు, ఉల్వలు వాడుతారు. చేపల వాడకం అధికంగానే ఉంటుంది. ఎంత చిన్న మొత్తం చేపల కొరకైనా మైళ్ళ కొలది దూరం నడచివెళ్ళడానికైనా సాహసిస్తారు. మహా మాంసప్రియులు. కాయగూరల వాడకం చాలా తక్కువ అనే చెప్పుకోవచ్చు. ఏటపల్లి తాలూకాలోని బామ్రాగఢ్ పైకి పోతే కొరివి చీమలు ఎండబెట్టుకొని తర్వాత చారు కాచుకోవడం కూడ గమనిస్తాం. అదివాసులు అడవిలో దొరికే చాలా రకాల గడ్డలతో వారి ఆకలి తీర్చుకోవడం కద్దు. వేట వీరి నిత్యజీవితంలో భాగం. ఇక్కడ పెద్ద మొత్తంలో దొరికే పండ్లు తునికి పళ్ళేనని చెప్పుకోవచ్చు. ఇకపోతే సిరొంచ, అహిరి తాలూకాల్లో చాలా భాగంలో జొన్న పంటే సాపేక్షికంగా అధికంగా ఉంటుంది. అహిరి తాలూకాపైకి పోయిన కొలది, ఏటపల్లి తాలూకాలో ప్రధానంగా మనకు ఎదురయ్యేగొట్టి వారికి సాధారణంగా భూమి ఎక్కువ మొత్తంలోనే ఉంటుంది. దాదాపుగా 5 నుండి 25 ఎకరాల లోపు ఉంటుంది. సిరొంచ అహిరి మిగిలిన ప్రాంతంలో సాధారణంగా భూమి ఎంతో కొంత ఉంటుంది. కాకపోతే ఆ ఉన్న భూమి పోడు వ్యవసాయం; వానలపైనే ఆధారపడడం, నీటి సౌకర్యాలు లేకపోవడం మూలంగా ఆ ఉన్న భూమిలో పండిన పంట ఎటూ సరిపడక గత్యంతరం లేక ఉపవాసపు బతుకులు వెళ్ళబోయక తప్పదు. ఎక్కువ మొత్తములో ఇంకా భూమి ఉంటే ఇంకో నాలుగు విత్తులు వస్తే బాగుంటుంది అనే ఆలోచన సర్వవ్యాపితం. దానికి జంగ్లాత్ వారిలో పెద్ద తిప్పలు. అడవి నరకాలంటే చాలా భయం. పి. ఓ. ఆర్ చేసి ఎక్కడ దండుగ చేస్తారో-కట్ట

ఉంటే కటకటాల పాలు కావల్సివస్తుందనేది వీరి బాధ. అడవిలో ఏ చిన్న పుల్ల విరిచినా జంగ్లాత్ గార్డ్ తో కష్టమే. ఎంతో కొంత కల్లు, సారా, కోడి, నగదు విత్తులు ఏదో రూపంలో ముట్టచెప్పు కోక తప్పదు. మేక పిల్లర, గొడ్లపుల్లర ఇచ్చు కోనిదే వీరి జీవితం గడువదు. ప్రభుత్వం వారి లెక్కల ప్రకారం అధికారికంగా మేకకైనా, గొడ్డుకైనా 25 పైసలు; గడ్డి బండికి రు. 2.50; బండిపొయిల కట్టెలకు రు. 2.00; ఇళ్ళు కట్టుకోవడానికి, ఇల్లును బట్ట చేకును విడిచి మిగతా కట్టెకొట్టు కోవడానికి పద్దులన్నీ ఉండగా ఈ అధికార్లు వీరి ఇష్టం వచ్చినంత వసూలు చేసు కుంటారు. ఒకవేళ ఇవ్వకుంటే వందలాది రూపాయలు దండగల రూపంలో బల వంతంగా వసూలు చేసుకుంటారు. అప్పుడప్పుడు సంచార కోర్టు (Mobile Court) వారికి వందలాది రూపాయిల ముడుపులు అందచేయడం కూడ తప్పదు. ఈ గూడా లకు పోలీసుల బాధ గూడ భరింపరానిదిగానే ఉంటుంది. ఓ వైపు తిండి దొరకక మరోవైపు ఆకలి బాధలకు తాళలేక సాంప్రదాయకంగా వస్తున్న "ఇప్పసారా" పెట్టుకొని పొట్టగడుపుకుందామంటే పోలీసుల పీడ-జైలు పాలు కావడం మామూలు. మద్యపాన నిషేధం అమలు జరుపుతున్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర ఒకటి. ఇక్కడి సర్కార్ వారి లైసెన్సు ద్వారానే త్రాగడం జరగాలి. ఈ బూచి చూపుతూ కూడ రైతాంగాన్ని పోలీసులు మహా పీడిస్తుంటారు. ఊళ్ళలోనికి బీటు పోలీసులు వచ్చి నపుడు రైతుల నుండి కోళ్ళు, మేకలు పట్టుకెళ్ళడము పరిపాటే.

సిరొంచ, అహెరి, ఏటపల్లి తాలూకాల్లోని దట్టమైన అడవి ప్రాంతంలో పులులు విస్తారంగా తిరుగుతవి. రైతాంగం పశు సంపదకు ఎలాంటి భద్రత లేకుండా పోయింది. దొడ్లపై దాడి చేసి కట్టేసి ఉన్న ఆవులను కూడ పులులు తిన్న సంఘట నలు అనేకం. ప్రభుత్వం వారి కానూన్ ప్రకారం "పులి చంపిన పశువు నెత్తురు తడి అరక ముందే" 24 గంటల లోపు ఈ విషయం జంగ్లాత్ వారి దృష్టికి తెస్తూ ఫిర్యాదు చేయాలి. ఐతే ఎక్కడో, ఏమూలకో అడవిలో చచ్చిన గొడ్డు ఈ రైతుకు దొరికే సరికే ఆ "పుణ్యకాలం" కాస్తా గడచిపోతుంది. ఇక దొరకని వాటి విష యంలో వాదు లేదు ఫిర్యాదు ఉండదు. తీరా ఏదో ఒకటి ప్రభుత్వం వారి దృష్టికి వచ్చినా మార్కెట్టులో దాని కీమత్ కు తగ్గ ప్రతిఫలం ఏ కోశానా రైతుకు ముట్టదు. ఇది సర్కార్ వారి సహజ నీతి. దోపిడీ వర్గాల రాజ్యాంగం ప్రకారం అడవిలోని ఏ జంతువు కూడా ప్రాణ రక్షణార్థం సైతం మానవుడు ముట్టుకున్నా సరే! శిక్షార్హుడే! మామూలు విషసర్పాలను సైతం చంపినా నేరస్తుడే అంటూ రాజ్యాంగం ఘోషిస్తుంది.

ఓ పైనున రైతాంగానికీ ప్రాణంలాంటి మేకలను, గొడ్లను సాదుకొనడానికి అనేక చట్టాలు చేస్తూ ప్రభుత్వం అవరోధాలు కల్పిస్తూ మరోవైపున వన్యప్రాణుల పట్ల కరుణాకటాక్ష వీక్షణాల ఫోజు పెడుతూ "వన్యమృగసంరక్షణా" కేంద్రాలు అంటూ తెగ గగ్గోలు పెడుతుంది. ప్రత్యేకించి ప్రతివారు నెమలి విషయం వచ్చేవరకు దాన్ని ముట్టుకోవాలంటే చాలా భయపడతారు. ఎందుకంటే అది జాతీయ పక్షి! దాన్ని ముట్టుకుంటే రాజ్యాంగ పరంగా శిక్షాకాలం ఎక్కువ. అడవిలో అడవి జంతువులా కాలాన్ని ఈడుస్తూ, అప్పడప్పుడు వాటికి బలి అవుతూ, నిత్యమూ మానవ రాక్షసుల దోపిడీ విషకౌగిలిలో నలిగి నశించిపోతూ బ్రతుకే ఒక భారంగా మోస్తున్న పీడిత రైతాంగానికి దిక్కులేదు. ఇంతవరకు వీరి బాగోగులు చూసే నాథుడే లేడు.

భారతదేశంలో ప్రసిద్ధిపొందిన "టేకు" మనకు ఈ దక్షిణ చాందా డివిజన్‌లో లభ్యమవుతుంది. దీని ద్వారా ప్రభుత్వానికి చాలా పెద్ద మొత్తంలో కోట్లాది రూపాయిల ఆదాయం లభిస్తుంది. బల్‌హార్‌పూర్ (బల్‌హార్‌షా) లోని కాగితపు మిల్లుకు అవసరమయిన వెదురుబొంగు కూడ విస్తారంగా పెంచబడుతున్నది. రోజూ అడవిలోంచి కొన్ని వందల లారీల బొంగు బల్‌హార్‌పూర్ చేరుకుంటుంది. ఈ టేకు కర్ర రవాణా చేసుకునేందుకు తర్వాత బొంగుజార గొట్టుకునే నిమిత్తం మారుమూల కొండ ప్రాంతాల్లోకి కూడ రోడ్లు చాలా అభివృద్ధి అయినాయి. ఈ రోడ్ల నిర్మాణం, మరమ్మతు విషయాల్లో అతి చౌకగా కూలీల శ్రమను దోపిడి చేసి కంట్రాక్టర్లు లక్షలాది రూపాయిలు గుంజుతారు. వీరి శ్రమకు తగిన ప్రతిఫలం కొరకు ఈ కంట్రాక్టర్లతో బేరమాడే కనీస చైతన్యం కూడ ఈ ఆదివాసి అమాయక గోండులకు కొరవడడం బాధాకరమైంది. జంగ్లాతు వారి దోపిడి కూడా ఇందుకు తోడై వారిని ఇంకా కృంగదీస్తుంది. మొక్కలను నాటి పెంచే కార్యక్రమం, కోపు కొట్టించే పనులు "కార్పొరేషన్" వారు ముమ్మరంగా చేయిస్తున్నారు. ఈ పనులల్లో పురుషులకు రోజుకూలి రూ 4.50 ఇస్తూ స్త్రీలకు రూ 3.00 ఇస్తూ అతి దారుణంగా దోచుకోవడం ఉంటుంది. నగదు రూపంలో వీరికి ముట్టేది తక్కువే. కూలి కిందికి అమెరికా నుండి దిగుమతి అయ్యే ముక్కిపోయిన గోధుమలు, అతి చౌకగా లభించే నూనె ఎక్కువ ధరలకు జమ గట్టి ఇస్తారు.

ముఖ్యంగా రైతాంగం చేతిలో నాలుగు రోజులు మాత్రమే నగదు డబ్బులు కనబడుతవి. అదే ఆకుల సీజన్. ఈ రోజుల్లో స్త్రీలు - పురుషులు - పిల్లలు

ముసలివారు అనే తేడా లేకుండా అందరూ ఉదయాన్నే అంబలి బుర్రలు పట్టుకొని అడవికి పోతే తిరిగి పగలు 2 గంటల ప్రాంతంలో అడవి నుండి బరువైన మూట లతో ఇళ్ళకు వచ్చి అందరూ అదే పనిపై కేంద్రీకరించి ఆకులు కట్టలు కడుతారు. సాయంత్రం పొద్దుపోయాక కళ్ళానికి తీసుకెళ్ళి 100 కట్టలకు అతి తక్కువ ధర రూ 3/- నుండి రూ 5/- వరకు వేసివస్తారు. కళ్ళేదార్ల అదిరింపులు బెది రింపులు సాధారణమే. ఇందులో బెట్టి కట్టలు - వారాంతంలో డబ్బులు ఇచ్చేపుడు చిల్లర దిగమింగడం - చివరన ఒక రోజు డబ్బులు ఆపుకోవడం లాంటివి కళ్ళే దార్లు గిర్ధావర్లు కలిసి చేసే దోపిడి. సర్వ సాధారణంగా పూసవేర్ల వాళ్ళను మొదలుకుంటే ప్రతిది తిరిగి బుట్టల్లో అమ్ముకునే వారు ఈ రోజుల్లోనే శిఖరై తాంగం నుండి, నగదు రాబట్టు కోవడానికి ఊరూరు తిరుగుతుంటారు. కుంటు "ఉద్దర" రూపంలో అంటగట్టబడినవి కూడ ఈ అమ్మకందార్లు "చక్రవడ్డీ" తో సహా ఇపుడే రాబట్టుకుంటారు. ఇకపోతే ప్రత్యేకించి ఎండకాలం కొందరు బంక తీయడంతోనే జీవిస్తారు. ఎంతైనా గోదావరి అవతలి కరీంనగర్ - వరంగల్ జిల్లాల్లోకన్నా మహారాష్ట్రలో ఈ వృత్తి చాలా తక్కువేనని చెప్పవచ్చు. ఇక్కడ ప్రభుత్వం వారు అతి తక్కువ రేటు కిలో 1కి రూ 5/- మాత్రమే ఇస్తుండేది. ప్రభుత్వం కన్నా పై వేటు వ్యక్తులు ఒక రూపాయి ఎక్కువ ఇచ్చి కొనుక్కునే మాట యదార్థమే. కానీ ఒకవేళ జంగ్లాత్ లేదా సొసైటీ వారి దృష్టిలో పడితే ఇక వీరికి మళ్ళీ దుండుగలే.

వీరు నిత్యావసర వస్తువులు కొనుక్కోవడానికి దగ్గర దగ్గర్లో దుకాణాలు బయటి నుండి వచ్చిన వారిచే నడుపబడుచున్నవి. వీరికి కావలసిన వస్తువులన్నీ ప్రధానంగా ధాన్యంతోనే మార్చుకుంటారు. ఒక ఆకుల సీజన్‌లో మాత్రం సంపాదించిన నాలుగు రాళ్ళు ఇచ్చి నగదుకు సరకులు తీసుకుంటారు. వీరి అవ సరాన్ని గుర్తెరిగిన షావుకార్లు కిలో ఎనిమిది రూపాయిలకు ఉన్న మిరపకాయలు 20 తవ్వలకు (రూ 30/-)అమ్మి డబ్బు చేసుకుంటారు. ఇలా ప్రతీదానికి విపరీతమైన ధాన్యాన్ని గుంజుతారు. ఆ రకంగా బయటినుండి వచ్చిన వారు లక్షలాది రూపాయలు ప్రోగు చేసుకుంటారు. సాధారణంగా ఉప్పులాంటి సరుకులు ధాన్యంతో ఎత్తుకు ఎత్తు మార్చుకుంటారు. నూనె కూడా చాలా వరకు ఇప్పుడే ఉపయోగించుకుంటారు.

ఇకపోతే నిత్యజీవితంలో వీరు ఆసుపత్రి లాంటి వైద్య సదుపాయాలకు నోచుకోలేదనే చెప్పవచ్చు. పూజార్ల కళ్ళ ముందు ఎన్నో పోడి పోడి ప్రాణాలు పోయిన ఘటనలు కోకొల్లలు. ప్రధానంగా ఈ అడవి ప్రాంతంలో మలేరియా వ్యాధి తీవ్రంగా ప్రబలి ఉంది. ఇంకా పైకి పోయినచో "సెరబ్రల్ మలేరియా" అనే భయంకర వ్యాధి మూలంగా లక్షలాది ఆదివాసుల గుండెలు భయంతో వణకుతుంటాయి. ఈ అడవి ప్రాంతంలో ఇంకో వ్యాధికి కూడ ప్రజలు గురవుతుంటారు. అదేంటంటే మోకాలు కిందికి పిక్కబొక్క పై ముందు చిన్న గడ్డ లాగ తయారై క్రమంగా పెద్ద గాయంగా మారుతుంది. తోచిన ఆకో, అలమో కట్టుతారు. దీర్ఘకాలం దానితో సతమతమవుతునే ఉంటారు. యమ్ఎల్‌కసాలోని, నాగిపెల్లిలోని ప్రైవేటు ఆసుపత్రులు రెండు చేతులా డబ్బు సంపాదించుకుంటవి. కమలాపూర్‌లోని వైద్యశాలలో ఎప్పుడూ అన్నింటికీ కొరతే. విద్యారంగం కూడా దీనికి ఏమాత్రం తీసిపోలేదు. ఐతే నామమాత్రానికి గ్రామాల్లో అక్కడక్కడ పాఠశాలలు లేవు అనకుండా ఉన్నవి. కానీ అందులో పనిచేస్తున్న వారికి చదువు నేర్చుకునే విద్యార్థులకు సమన్వయం లేదు. విద్యార్థులకు కోయం-తెలుగు తప్ప మరాఠీరాదు. గురూజీలకు మరాఠీ తప్ప ఏదీ రాదు. ఇదే సదరు విషయాన్ని ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటే "రాజీనామా" చేయండని సులభమార్గాన్ని చూపెడుతుంది ప్రభుత్వం.

అమాయక ఆదివాసీ రైతు - కూలీలను అడుగడుగునా అందరూ దోపిడీ చేసేవారే. అందుకే ఆదివాసులు ప్రతిఘటనకు పూనుకోవడంలో ఆశ్చర్యం ఏముంది! దండుగుల బతుకులు - వెట్టి బతుకులు- మట్టి బతుకుల్లో నిప్పు రగుల్కొంటుంది. ఆ దావానలంలో దోపిడీ బూడిదై తీరుతుంది.

మైదాన ప్రాంతాల్లో నివసించే వారికి - ఆదివాసులకు ఆచార వ్యవహారాలలో చాలా తేడా ఉంటుంది. అందులో కూడా అందరివీ ఒకే రకంగా ఉండవు. ప్రధానంగా మనకు ఈ మూడు తహశీలులో కనిపించేవారు (1)రాజ్‌గోండు (2)నాయక్ గోండు (3) మాడియగోండు (4) డోలి - పర్ధన్ (5) అల్మ (6) గోవార్ (7)బిరుదు మొదలైన వారే మనకు అగుపడుతారు. అందులో ప్రధానంగా మాడియా గోండులే అధికం అని చెప్పుకోవచ్చు. ఇందులో కొద్దిపాటి తేడాలలో ఎవరి భాష వారికే ఉంటుంది. వ్యవసాయమే వీరి ప్రధాన వృత్తి. మాడియా వారి గూడాలలో

ఒకటి నుండి మొదలుకుంటే 25లేక 30ఇండ్లకన్నా ఎక్కువ ఎక్కడా సాధారణంగా కనబడవు. సిరోంచ తాలూకా, అహిరిలో చాలా వరకు రాజ్‌గోండులున్న ప్రాంతాల లోని గ్రామాలలో సాపేక్షికంగా అక్కడి కన్నా ఎక్కువే ఇళ్ళు ఉంటాయి. ఇక పోతే మాడియా గోండులకు రాజ్‌గోండులకు జీవన సరళిలో తేడా ఉంటుంది. వీరి కన్నా రాజ్‌గోండులు ఆర్థికంగా పెద్దగా అభివృద్ధి చెందిన వారు ఏమీ కాకపోయినప్ప టికీ, రాజకీయంగా కొంత ఆలోచిస్తారు. సాంస్కృతిక పరమైన విషయాలలో కొంత కొంత ఈ బూర్జువా నాగరికత కూడ రాజగోండులలో చోటు చేసుకున్నది. మత పరమైన విషయాలలో ఆచార వ్యవహారాలలో కట్టుబాట్లు మాడియా గోండులలో అధి కంగా అగుపడుతవి.

సాధారణంగా ఈ మాడియాగోండులు ఒక్క ఎండకాలం నాలుగు మాసాల లోనే ఊర్లల్లో (గూడాల్లోని)ఇళ్ళల్లో అగుపడుతారు. మిగతా సమయాలలో వారి వారి ఖేత్ (పొలాల) దగ్గరనే "పాక"ల్లో గడుపుతారు. విత్తనాలు చల్లింది మొదలు వరి కోసి, జొన్న పంట చేతికి వచ్చినాక, చిక్కుళ్ళు ఏరినాక గాని వీరు ఇళ్ళల్లో అడుగుపెట్టరు. వీరి పాకలు ఇళ్ళకన్నా చాలా శుభ్రంగా వున్నది ఎంత చిన్న దైనా అందంగా వుంటాయి. ప్రకృతి సిద్ధంగా మనకు అక్కడ అదో అహ్లాద కరమైన అనుభూతి కలుగుతుంది. చలికాలం వచ్చిందంటే పాకలో 24 గంటలు నెగడు ఉంటూనే ఉంటుంది. ఇంకా వీరి నిత్య జీవితంలో మట్టినూనె (కిరసనాయిల్) చోటు చేసుకోనే లేదని చెప్పవచ్చు. నెగడు వెలుతురులోనే అన్ని పనులు చేసు కుంటారు. అవసరపు వెలుతురు కావాలనుకున్నపుడు ఆనుప పుల్లలు దీపం బదులుగా వాడుతారు. దీపమే కావాలనుకున్నపుడు "ఇప్పనూనె"తో వెలిగించుకుంటారు. దుస్తుల విషయం వచ్చేవరకు కూడ రాజగోండులు సాధారణంగానే ఉంటారు. మళ్ళీ ఈ మాడియాగోండుల విషయానికి వచ్చేసరికి భిన్నమైన సాంప్రదాయం ఉంటుంది. పురుషులందరూ కూడ అంగీలు వేసుకొని కిందికి మాత్రం బుడ్డగోచి లాంటిదే పెట్టుకుంటారు. పూర్తి ధోవతి లేదా లుంగీ అయినా సరే ఆ పద్ధతిలోనే ఉపయో గించుకుంటారు. కారణాలు అడిగితే ఉడకపోస్తుదని సరిపెడుతారు. తర్వాత అహిరిలో విశ్వేశ్వర్రావు, ధర్మారావుల రాజకీయాలకు ప్రతిబింబంగా నల్ల - తెల్ల టోపీలు ధరిస్తారు. విశ్వేశ్వర్రావు మీది నమ్మకంతో వారు నల్ల బనియన్‌లతో పాటు

నల్ల టోపీలు ధరిస్తారు. ఇది ప్రభుత్వానికి నిరసన అనే భావాన్ని అతడు ఈ అమాయకుల్లో కలిగించాడు. స్త్రీలు మాత్రం చలికాలం వచ్చేసరికి వారి బట్టలు శరీర్నాన్ని పూర్తిగా కప్పుకోక పోవడం మూలాన ఒళ్ళు పగిలి చాలా బాధపడుతుంటారు. పెళ్ళికాని స్త్రీలు "జాకెట్" వాడుతారు. కానీ పెళ్ళి అయిందంటేనే "జాకెట్" తొలగించుకోవడం వారి సాంప్రదాయం. ఎవరైనా మొరాయిస్తే బలవంతంగా తొలగిస్తారు. చీరలను వాడడం ఇక్కడ లేదు. తెల్ల వస్త్రాలను మోకాళ్ళ పై నుండి చుట్టుకొని నడుం చుట్టుతిప్పి పాలిండ్లకు కప్పుతూ ఎడమవైపు కొంగులా ఆ వస్త్రాన్ని వదలుతారు. వయసొచ్చిన ప్రతి స్త్రీ కూడ ముఖం నిండా వివిధ పద్ధతులలో "పచ్చబొట్లు" వేసుకుంటారు. ఇవి లేకుంటే ఎవరు పెళ్ళి చేసుకుంటారు ఈ ఆడ వాళ్ళను అని బదులు చెప్పుతారు. వీటితో ముఖం అంతా ఎబ్బెట్టుగా ఉంటుంది. ముందునుండి ఎలా కొనసాగుతున్నా ఇవ్వాళ మాత్రం ఇది అయిష్టంగానే కొనసాగుతున్నది. పురుషులు వీరిని బహిష్టు సమయాలలో ప్రత్యేక గుడిసెలో ఉంచుతారు. వీరు ఆ మూడు రోజులు ఏకాంతవాసం ఆ ప్రత్యేక ఇంటిలోనే గడుపుకోవాలి. దీనితో బాటు ఊరి బయట ఈ బహిష్టు స్త్రీలందరూ పగటిపూట కాలం గడుపడానికి ప్రత్యేకించిన ఇంటిలో ఉంటారు. రాత్రులందు తిరిగి వీరి ఏకాంతవాసానికి చేరుకుంటారు.

వీరిలో పెళ్ళిళ్ళు కూడా వివిధ పద్ధతులలో జరుగుతుంటాయి. శాస్త్రోక్తంగా కన్యాశుల్కం ఇచ్చుకొని,పెళ్ళిఖర్చులు మగవారే భరించుకొని తల్వాల కిందికి 40 కుంచాలు(2 కండెలు) ఇచ్చుకొని చేసుకోవడం ఒక పద్ధతి అయితే ఇళ్ళు చొచ్చుడు మరో పద్ధతి. ఒక రకంగా దీన్ని తాపీ ధర్మారావు గారి భాషలో రాక్షస వివాహం అనుకోవచ్చు. కొంత ఆధునీకరించి ప్రేమవివాహం అని కూడ సరిపెట్టుకోవచ్చు. ఇందులో స్త్రీ-పురుషులు ఇరువురు ముందు మాట్లాడు కుంటారు. పిల్ల ఈ విషయాన్ని ఎవరికీ బయటపెట్టదు. అనుకున్న నాడు ఇష్టమైన వానితో వాని ఇల్లు చేరుకుంటుంది. ఈ విషయంలో పిల్లవాడు తన స్నేహితుల సహాయాన్ని కోరి ఇంటివరకు ఆమెను దింపుకుంటాడు. తర్వాత పిల్ల తల్లిదండ్రులు జాడ తెలుసుకొని వీరిపై 'మా పిల్ల మాకు కావాలి-ఎక్కడ దాచారో చెప్పండి' అంటూ దాడికి సిద్ధపడతారు. పుర్రెలు పుర్రెలు పగిలిన ఘటనలు కూడ ఉన్నవి. చివరకు ఏదో ఓ అంగీకారం కుదుర్చుకొని సాంప్రదాయకమైన విందులు చేసుకొని సంతోషంగా తిరిగిపోతారు. ఇల్లిటం

తీసుకోవడం కూడ మనకు ఇక్కడ కనబడుతుంది. ఇది మనకు తెలిసిన పద్ధతే. మామూలు పద్ధతే. ఇంకో పద్ధతి ఏంటంటే లామ్‌ఆడే పద్ధతి. ఇందులో పురుషుడు వచ్చి ఆడపిల్ల వారి ఇంట్లో మఖాం పెడతాడు. ఆ పిల్ల తల్లిదండ్రులు చెప్పే ప్రతి పని-ఇంటిపనులు, పొలం పనులు అన్నీ తప్పనిసరిగా చేయాలి. పెళ్ళి ఖర్చులకు సరిపోను పని చేశాడనుకొని నిర్ధారించిన తర్వాతనే పెళ్ళి చేస్తారు. అప్పటికే పిల్ల అంగీకరిస్తేనే ఇతని ఇంటికి తోలుకొని రావలసి ఉంటుంది. అనుక్షణం ఆమె ఆమోదముద్ర కొరకు ఇతడు నిరీక్షిస్తూనే ఉంటాడు. ఇంట్లో ఉన్న ఇతనినే వీరి భాషలో లామ్‌అడె అంటారు. చాలాతక్కువ సందర్భాలలో పెళ్ళి కాకుండానే పిల్ల ఆమోదం పొంది వెళ్ళిపోయిన ఘటనలు కూడ లేకపోలేదు. పోతే ఇల్లు చొచ్చుడు పద్ధతిలోనైనా ఈ పద్ధతిలోనైనా 'పెళ్ళి' తప్పనిసరిగా కావాలంటూ ఏమీలేదు. ఎప్పుడైనా పెళ్ళి చేసుకోవచ్చు. వెసులుబాటును బట్టి పెళ్ళి చేసుకుంటారు. ఐతే ఒక షరతు ఏంటంటే వాళ్ళకు పుట్టిన సంతానానికి పెళ్ళి కాకముందు తల్లిదండ్రులు తప్పనిసరిగా పెళ్ళి చేసుకోవాలి. తండ్రికి పెళ్ళికానిదే కొడుక్కు పిల్లనివ్వరు. కానీ, ఈ కొడుకు కూడ ఎవరినైనా ఇల్లు చొచ్చేపద్ధతిలో తీసుకవచ్చుకుంటే వెసులుబాటును బట్టి అతడు పెళ్ళి చేసుకోవచ్చు. ఈ గూడాలల్లో పెళ్ళిళ్ళు అవుతుంటే గూడాలకు గూడాలే కదులుతవి. అయితే పెళ్ళిళ్ళకు పోయేవారు వెంట సరిపోయేంత సారా తీసుకెళ్ళతారు. స్థానికంగా ఉన్నవారికి ఇళ్ళల్లోనే అన్నం పంచడం జరుగుతుంది. ఏ పేనుక (గోత్రం) వారు ఆ పేనుక వారిని పిల్లను ఇచ్చుకోవడం నిషేధం. 1 నుండి మొదలుకొని 7 వరకు ఈ దేవర్లు ఉంటాయి. 1, 2 దేవర్లు ఉన్నవారు చాలా అరుదు. కానీ 3 నుండి మొదలుకొని 4, 5, 6, 7 ఉన్నవారే అందరూ. ఉదా॥ 3 దేవర్ల వారు తలాండి. వీరు ఉడుము తినకూడదు. 4 దేవర్లవారు సిడం సడిమెక్ నిత్తం వీరు తాబేలు తినకూడదు. 5 దేవర్లవారు వేలాది వీరు పెగ్గెరపిట్ట తిన కూడదు. 6 దేవర్లవారు ఆత్రం వారు. వీరు పెద్దపులిని తినరు. ఇకపోతే 7 దేవర్ల వారు మడె. వీరు ఏదుపంది ముట్టరు. ఇక్కడ పేర్కొన్నవే కాకుండా ఇంకా అనేకం ఈ దేవర్లకు సంబంధించిన వారే ఉంటారు. ఈ జంతువులను వారి మొక్కుబడి దేవుళ్ళగా పూజిస్తారు. ఇక్కడి స్త్రీ-పురుషులు చాలా హుందాగా పూసలు ధరిస్తారు. స్త్రీలు తలలో దువ్వెనలు పెట్టుకోవడం ఒక ఫ్యాషన్‌గా ఇప్పుడు అను కొంటున్నారు. పెళ్ళిళ్ళ విషయాలలో కాకుండా వీరిమరణ కర్మకాండకూడ పరిశీలిస్తే

హిందూసాంప్రదాయ ప్రకారం పాటించాల్సిన కర్మకాండ వీరిలో లేదు. వెసులుబాటును బట్టి జరుగుతుంది. తర్వాత ఆ మరణించిన వ్యక్తుల గోరీలపై ఆ వ్యక్తి తాలూకు గుర్తులు పెట్టడం సహజంగా చేస్తారు. ఉదా వేటగాడైతే తుపాకి కట్టె, లేదా 'గొడ్డలి, కొడవలి, మొ॥నవి, మరో పెద్ద మూఢనమ్మకం ఏంటంటే పండుగలు చేయనిదే ఏ పంటను కూడ ముట్టరు. చివరకు కాయగూరలు కూడ పండుగ పాటించనిదే కోయరు. పండుగనాడు గ్రామ (చావడి) దగ్గర అందరూ జమ అయి ముందు దేవరకు మొక్కి పిదప తాగి స్త్రీ-పురుషులు ముఖ్యంగా యువకులు దోళ్ళతో పాటలు పాడుతూ ఎగురుతుంటారు. ఇలాంటి విషయాల్లో గ్రామ దగ్గర లైంగిక విషయాలలో కొంత ఉదారంగానే ఉంటాడనడం అతిశయోక్తి ఏమీకాదు. వాళ్ళు శుభకార్యాలుగా భావించే ఇలాంటి పండుగలలో పూజారి పాత్ర కీలకమైనది. అతను లేనిదే ఏదీ జరుగదు. అతనికి ఏవో దివ్యశక్తులు తెలుసునంటూ, మంత్ర తంత్రాలు వస్తాయంటూ జనం గుడ్డిగా భావిస్తారు. ఈ మధ్యనే ఏటపల్లికి దాదాపు 30 కి.మీ. దూరాన ఉన్న 'కుడికల్లి' గ్రామ నేతకాని యువకుణ్ని భామ్రాగాడ్‌లో చంపి 3 సీసాల రక్తం తీసుకొని 'పరాల్‌కోట' గోదావరిలో పడవేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. మనుషుల రక్తం భూమిపై చల్లితే పంటలు బాగా పండుతాయనే మూఢాచారం ఈ ప్రజల్లో ఉండడమే. అయితే దీనికి కారణం స్వకులస్థుణ్ని చంపడం అనేక పేచీలమూలాన నిషేధించుకోవడం జరిగింది.

వ్యవసాయానికి దున్నపోతులనే వాడుతారు. ఇది గ్రహించిన మొగిలాయ్ (ఆంధ్రా) వారు పోతులను ఇచ్చి ఎడ్లు తీసుకెళ్ళి లాభాలు గడిస్తున్నారు. మాడియా గోండులు రాజగోండుల మాదిరిగా, మిగతావారి మాదిరిగా వరిని బంతి లేదా పంజ గొట్టడం కాకుండా మనుషులే కాళ్ళతో నూర్పిడి చేస్తారు. వీరికి కోడిపుంజుల ఆటనే ప్రధానపు ఆట ప్రతి ఆదివారం ఎక్కడో అడవిలో పోలీసుల బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పందేలు కట్టుకుంటారు. మాడియా గోండుల స్వభావం ఏమిటోగానీ మల విసర్జన పిదప వీరు నీరు అందుబాటులో ఉన్నా కూడా ఉపయోగించుకోరు. ఆకులనే ఉపయోగిస్తారు.

మాడియాగోండులు చాలా వరకు ప్రతి దసరాకు అహిరి మహారాజు కొలువు కెలుతుండేవారు. అతని దర్శన నిమిత్తం పోయేవారు అందరూ అక్కడ ఉండే

రెండు రోజులు సొంత బత్తెం తీసుకెళ్ళతారు. పైనుండి మేకలు, కోళ్ళు, సూనె అక్కడ సమర్పించుకుంటారు. ఆ సందర్భంగా అతని కాళ్ళు మొక్క పోయిన జనం రూపాయి మొదలుకొని శక్తి మేరకు సమర్పించుకోవడం రివాజు. గూడాలలోని అందమైన స్త్రీలు పోయి అక్కడ డాన్సులు చేయనిచో గూడెంలో ఎందరు స్త్రీలు ఉంటే వారందరి తరపున తలా రూ. 10/– దండగ సమర్పించుకోవాలి. వీటన్నిటికి గాయితర్ (పటేల్) ప్రతినిధి. లేదా పెద్దమనుషులు బాధ్యత తీసుకుంటారు.

ఇలాంటి వారి జీవితాలలో మార్పు తీసుకురావాలంటూ సంస్కరణల కొరకు పూనుకున్న వారిలో గత దశాబ్దాలలో మధ్యప్రదేశ్ నుండి వచ్చిన "కంటిబాబిల్" మనకు కన్పిస్తాడు. తర్వాత ప్రభుత్వం వారు కూడా ఓట్ల బ్యాంకులుదివాలాతీయకుండా ఉండడం కొరకు ఎన్నికల జాతరల ముందు గుడ్డలు పంచడం లాంటి నామమాత్రపు సంస్కరణలకు పూనుకోవడం చోద్యమేమీకాదు.

ఈలాంటి బతుకులలో కొత్త ఆశలు చిగురింపచేస్తున్నవి తొలకరి వాన జల్లుల్లా వారి జీవితాలలో ఆత్మ విశ్వాసం తొంగిచూస్తున్నది. గలగలా పారేటి ప్రాణహిత పెద్దిశంకర్ రక్తంతో ఎరుపెక్కి విప్లవ సందేశాలను– విప్లవకారులను రాష్ట్రాల సరిహద్దులను చెరుపుతూ సిరొంచ తాలూకా నుండి ఏటపల్లి వరకు అందిస్తుంది. ఆదిలాబాద్ దేవలాడ మహారాష్ట్ర నగరం– కరీంనగర్ కాళేశ్వరాల వద్ద ప్రాణహిత గోదావరిలో కలిసి తన వేర్పాటు కోల్పోతుంది. తల్లి గోదావరి గోండుల పోరాట సాంప్రదాయాన్ని పుణికి పుచ్చుకొని మరచిపోకుండా మననం చేసు కుంటుంది. తమకంటూ, తమకోసమంటూ, తమ మోడుబారిన బతుకులలోని కరకు దనాన్ని దోపిడిదార్లకు రుచి చూపాలంటూ ఈరోజు అన్నలు చెప్పే ప్రతి మాట వారి మనసుకు స్థయిర్యాన్ని, ధైర్యాన్నిస్తుంది. "గోదోంకా ధమాక్ గాండ్ మే రహతా హై" అని అంటూ దోపిడీ చేసే ప్రతి వానికి ఆ "ధమాక్" కు (మెదడు) విప్లవాలను సృష్టించే,దోపిడీ చేసే,పద్ధతిఅంతానికై లఢాయి(పోరాటం)చేసే స్వభావమూ ఉందని ప్రపంచానికి చాటడానికై గోండులు గోచి బిగిస్తున్నారు. గోండు గుండెలో స్తంభించి పోయిన పోరాట చైతన్యాన్ని తిరిగి రగుల్కొనేట్లు చేస్తున్న 'అన్న'లంటే గోండోనికి గుండె. కానీ, మరోవైపున మన కొరకే వచ్చారు, మన వాళ్ళేనంటూ కపట ప్రచారం చేసిన ఈ అహిరి మహారాజు గుండెలలో ఈనాడు గుబులు పుట్టింది; వణుకు మొదలైంది; తన నిజ స్వరూపం బయటపటి బండారం బద్దలు చేస్తూ అన్న

గాండ్లు చెప్తున్న నిజం మూలంగా తన పలుకుబడికి గండిపడుతూ, తన ఓట్ల బాంకులు దివాలా తీయడం సహించలేని 'మహరాజ్' విశ్వేశ్వర్రావు అన్నలను పోలీసులకు పట్టివ్వాలని, వీరు పొట్టకూటికై మా వెంట తిరుగుతున్న అమాయకులు సరకు అని, వీరికి అన్నం పెట్టద్దంటూ తనూ, తన అనుంగుసన్నిహిత పెద్దమను షుల ద్వారా ప్రచారం చేయడానికై పూనుకోవడంతో గోండు గుండెలను ఇన్నాళ్ళు నిర్దాక్షిణ్యంగా దోచుకున్న "మహరాజ్‌మంచి మనసు" ఏందో ఇప్పుడు బయటపడు తుంది. ఇ కోవైపున గోండు గూడాల్లో ఓట్లకు ఆశపడడం తప్ప ఇంకోటి ఎరుగని సర్కార్, వారి గూడాల్లో వెలుగు వెలగడం సహించని సర్కార్, దాని అమానుష దోపిడి ;పీడితగోండులకు అర్థం చేయించడాన్ని సహించని బద్మాష్ సర్కార్, ఆంధ్రలో ఉవ్వెత్తున్న లేస్తున్న పోరాటాలను మహరాష్ట్రకు వ్యాపించనీయకుండా, పారుతున్న ప్రాణహితను దాటి పోరాట కెరటాలను విప్లవ ప్రభంజనాన్ని తన రాష్ట్రంలోనికి రానియ్యకుండా బంధించాలనీ, ఉద్యమాన్నే తమ సర్వస్వంగా యెంచి పోరాడుతున్న విప్లవకారులకు తన రాష్ట్రంలో చోటు ఇవ్వద్దనీ 'నక్సల్‌వాది' అంటేనే గుండె దప్పులు కొట్టుకునే బడా బూర్జువా భూస్వామ్య వర్గాల ప్రతినిధి 'అబ్దుల్ రహమన్ అంతులే' సర్కార్ కామ్రేడ్ పెద్ది శంకర్‌ను 2 నవంబర్, 1980 నాడు పొట్టన బెట్టుకుంది. శంకరన్న రక్తం మహరాష్ట్ర అంతటా చిమ్మింది. ఆ చిందిన రక్తంలోనుండి అతని ఆశయాలు మొలకెత్తుతున్నవి. అవి ఏపుగా పెరుగుతున్నవి.

మొట్టమొదటిసారిగాఆకులరేటు పెరగాలని డిమాండ్‌చేసి పోరాడిన ఆదివాసీలు దోపిడి గాండ్లను సవాలుచేస్తూ విజయం సాధించారు. 3 పైసలుగా'మహరాజ్‌హయాం' రేటును నేడు 13 పైసలకు పెంచుకున్నారు. కార్పొరేషన్ కూలీరేట్లలో అడ మగ కూలీలు రూ4-25;6-25 పైసలకు హెచ్చింపు సాధించారు. తమ ఇష్టమున్న రేటుకు నిత్యావసర వస్తువులు అమ్ముకుంటూ అధిక లాభాలు గడించే షాహుకార్ల మోసాన్ని పసిగడుతూ ధరలపై అదుపును పెడుతున్నారు. సారా (నారంగి) రేట్లు చాలా వరకు రూ2/-నుండి 1-30 వరకు దించుకోగలిగారు. బంకరేటు రూ 5/-నుండి కిలో ఒక్కంటికి రూ 10/- పెంచుకోగలిగారు. దుప్పికొమ్ములు, పంది వెంట్రుకలు ఇన్నాళ్ళ మాదిరిగా జంగ్లాత్ అధికారుల అదిరింపులకు బెదిరింపులకు జడిసి ఇవ్వడం గాకుండా కిలోలచొప్పున అమ్ముకుంటున్నారు. ఇన్నాళ్ళు మా ఆస్తులను కొల్ల

గొడుతూ పీడించిన జంగ్లాత్ వాళ్ళకు ఇక మేకపుల్లర అరకపట్టి కట్టేదిలేదు, పో, పొమ్మంటున్నారు గోండులు; కట్టింది చాలంటున్నారు. ప్రభుత్వం వారు అమ్మకునే టేకు కర్ర ధర విపరీతంగా పెంచేస్తుంది. సహజంగా పెరిగిన టేకుకు-ప్లాంటేషన్‌ల ద్వారా పెంచిన టేకుకు నీలం (వేలం) సమయాలల్లో రేటులో తేడా ఉంటుంది. ఈ కర్ర కోయడానికి ప్రభుత్వం (మోయడానికి మీటరుకు రూ 13/-ఇస్తూ పడేయడానికి రూ 7-ఇస్తూ) చాలా తక్కువఖర్చుచేస్తూ అదే మీటర్ $\frac{(\text{పొడవు} \times \text{చుట్టుకొలత})^2}{16}$ కర్రకు నీలంలో రూ 2400/- ప్రకటించి ఆంధ్రనుండి టేకేదార్లు రావడం; వారిలో వారి పోటీ మూలంగా రూ 4000/- వరకు పొడిగించబడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటుంది. ఇందులో పనిచేసే కూలీలు కూడ "సంఘం"ద్వారా అధిక కూలీరేట్ల సాధనకై నడుం బిగిస్తున్నారు. వందలాది ఎకరాల అడవి నరికి సేద్యం చేసుకుంటూ, వేలాది రూపాయిల దండుగల జీవితాల బంధనాలనుండి విముక్తి కాబడుతూ అరెస్టులకు, జైళ్ళకు కేసులకు వెరవకుండా పెట్టబతుకులకు ఎదురు తిరుగుతూ పురోగమిస్తున్నారు. ప్రజలపట్ల కఠినంగా నీచాతినీచంగా వ్యవహరించే ప్రభుత్వ అధికార్ల చెపులు మెలి త్రిప్పి రోగం కుదురుస్తున్నారు. సాధించిన విజయాలను గుండెల్లో పదిలపరచుకుంటూ మరిన్ని విజయాలు పోరాడి సాధించుకునే మార్గంలో అప్రతిహతంగా "ఆదివాసి రైతు-కూలీ సంఘాలు" ఏర్పరచుకుంటూ పురోగమిస్తున్నారు. అన్నగాండ్ల ప్రతిమాట-పాట-బాట తరచితరచి చూస్తూ నేర్చుకుంటూ గోండుల తెల్లకాగితం లాంటి వారి గుండెల్లో చెరిగిపోకుండా వాళ్ళు రాసుకుంటున్నారు.

వీటన్నిటని చూస్తూ ప్రభుత్వం ఖంగు తింటున్నది. ఇపుడు గోండుల గూడాల పైకి ప్రభుత్వం ద్విముఖదాడిని ప్రయోగిస్తున్నది. ఓ వైపున వందలాది అదనపు పోలీసు బలగాలను దింపుతున్నది. గ్రామాల్లో క్యాంపులు పెట్టిస్తున్నది. తమ హక్కుల సాధనకై ఉద్యమిస్తున్న ఆదివాసి రైతాంగాన్ని మూకుమ్మడిగా అరెస్టులు చేస్తూ, కోర్టుల చుట్టు త్రిప్పుతూ జైళ్ళపాలు చేస్తున్నది. పోలీసులు స్త్రీల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తూ వారి పట్ల అత్యాచారాలుచేస్తున్న సంఘటనలు కూడా అక్కడక్కడ గోచరిస్తున్నవి. అన్నగాండ్లకు అన్నం పెడుతున్నారంటూ, ఆశ్రయం ఇస్తున్నారంటూ రైతాంగాన్ని తీవ్రంగా వేధించుకుతింటూ అన్నగాండ్ల కొరకు తొవ్వల్లో గస్తీ తిరుగుతూ నీటి వసరుల దగ్గర కాపలా కాస్తున్నారు.

మరోవైపున సంస్కరణల తతంగానికి ఈ ప్రభుత్వం పూనుకుంటున్నది. కామ్రేడ్ లెనిన్ చెప్పినట్లుగా సంస్కరణల తతంగం పాలకవర్గాల బలహీనతను విప్లవ పురోగమన గ్యారంటీని తెలియపరుస్తుంది అనే యదార్థము ఇవ్వాళ ఇక్కడ మనకు కనబడుతుంది. అదే సందర్భములో "పరిస్థితులు విషమించినపుడు ప్రజలు పోరాటానికి పెద్ద ఎత్తున పూనుకున్నపుడు-సంక్షోభం అనాటికానాడు తీవ్రతరం అయినప్పుడు పోరాటంలో గాయాలుతిని వందల సంఖ్యలో ప్రజలు రంగం మీద కూలిపోతున్న ప్రతి పోరాటం నుండి మరింత క్రోధావేశంతోనూ సాహసోపేతంగానూ ఉన్నతమైన శిక్షణతోనూ వేలాది విప్లవయోధులు ఉద్భవిస్తునపుడు తప్పనిసరియై వచ్చే సంస్కరణలే ఇవి" అని కూడ లెనిన్ మహాశయుడు చెప్పాడు.

ఇవ్వాళ ఇక్కడి గిరిజన రైతాంగం నుండి పోలీసుల్లోకి రిక్రూట్ చేసుకోవడం; భూములకు పట్టాలు ఇస్తామని సంగనాచి కబుర్లు చెప్పుతూ బూచి చూపడం; ఇచ్చిన అప్పుల కిందికి బలవంతంగా గంజులు, ముంతలు జప్తులు చేస్తూ, మరో దిక్కు క్రొత్తగా అప్పులు ఇస్తామని ఆశ చూపుతూ ఉండడం ; మీ పిల్లలకు విద్యా సౌకర్యాలు కల్పిస్తామంటూ అంగన్‌వాడి బాల్‌వాడి పాఠశాలలు నిర్వహించడం ఇవన్నీ సర్కార్ మాయా చిట్కాలైతే ఇక మతం మహానుభావుల గోసాయి చిట్కాలు కూడ బహుళంగానే ప్రారంభమైనవి. క్రొత్తగా చర్చీలు కట్టడం, వేతన మత ప్రచారకులను నియమించడం, బావులు తవ్వించడం; వ్యవసాయ పనులు చేయించుకోండంటూ గోధుమలు. నూనె సప్లయి చేయడం మొదలైనవి జరుగుతున్నవి.

సంస్కరణ తతంగమంతా ఎప్పటికప్పుడు ప్రజల్లో ఎండగట్టబడుతున్నది. వీరి తీవ్ర నిర్బంధాలకు, కుహనా కుతంత్రాలకు జంకేది, లొంగేది లేదంటూ దున్నేవానికే భూమి: అడవి నరికి భూమి సాగుచేసుకుందాం ; ఆదివాసి రైతు-కూలి సంఘటన్ చిరకాలం వర్ధిల్లాలంటూ ప్రజాయుద్ధపంథాలో నూతన ప్రజాస్వామ్య విప్లవ మార్గంలో ప్రజలు పురోగమిస్తున్నారు.

మరియు గోండుపాటలు

రిరిలోయ రిలా మొరా మో

" "

మనవ దాదల్ వాత్తోరె
బాదా సాటింగ్ వాత్తోరె
లడాయి సాటి వాత్తోరె
బాతా లడాయి వెహాట్
రైతు బూతి లడాయి
భూమి, హుకుమత్ లడాయి ॥౩౧॥

మీటింగు వాటిం తోరలె
పాటల్ పారాం తోరలె
పొల్లు వెళహాం తోరలె
పిసువల్ హర్రి హుపిస్తోరలె
ఒక్క సంగతి మన్నగాం ఇంటి
సంఘం తాసింతోరలె ॥౧౧॥

గరీబోరల్ సంఘం దోస్చి
దాదల్, బాయిల్ సంఘం లోప
హటవె హటవె కలిపి మన్నగాం
వరోరుకు తిప్తల వాత్తేకి
అంతలోరం విల్లగాం
కష్టం వాయెని సుఖం వాయెని
కలిసి మనల్ మన్నగాం
సర్కారోంకు నాశనం గీసి
రైతురాజ్యం తారాగాం ॥౧౧॥

మనవ కమ్యూనిస్టు దాదాలె
జీవహీసి లడాయి కీంతోరె

మిరియామొ రామో
మిరియామొ రామో
" "

మన అన్నలు వచ్చింద్రు
ఎందుకోసం వచ్చింద్రు
పోరాటం కోసం వచ్చింద్రు
ఏమి పోరాటమొ చెప్పు
రైతు కూలి పోరాటం
భూమి హక్కు పోరాటం ॥౩౩॥

మీటింగు పెట్టుతారట
పాటలు పాడుతారట
మాటలు చెప్పుతారట
బతుకుదారి చూపిస్తరట
ఒక్క మాటమీద వుండాలని
సంఘం పెట్టుతారట ॥౩౧॥

గరీబోల్లు సంఘం కట్టి
అన్నలు, అక్కలు సంఘం లోపల
బుజం, బుజం కలిపి వుండాలె
ఒక్కనికి కష్టం వస్తే
అందరం నిలబడాలె
కష్టం రాని సుఖం రాని
కలిసి మనం వుండాలె
సర్కారోల్లను నాశనం చేసి
రైతు రాజ్యం తేవాలె ॥౧౧॥

మన కమ్యూనిస్టు అన్నలు
ప్రాణమిచ్చి పోరాటం చేస్తరు.

దాదా, బాయి, పిల్ల, పేకుర్‌కు	అన్న, అక్క, బిడ్డ, కొడుకులను
బొత్తిగ విడ్సి వాత్తోరె	మొత్తం ఇడిసిపెట్టి వచ్చింద్రు
మనవ కోసం వాత్తోరె	మన కోసం వచ్చింద్రు
వోరతోని మనల్ కలిసి	వాళ్ళతోని మనం కలిసి
తుపాయిని కైదెపోసి	తుపాకిని చేత బట్టి
కైదె కైదె కలిపి దాకలె	చేతులు చేతులు కలిపిపోవాలె
రైతు-బూతి రాజ్యం వాత్తెనె	రైతు కూలి రాజ్యం వస్తెనె
భూమి గటో దొరుకాంత	భూమి, అన్నం దొరుకుతది
సదువు పత్తు దొరుకాంత	చదువు, మందు దొరుకుతది
లోను, సీలె దొరుకాంత	ఇల్లు, బట్ట దొరుకుతది
నాంగన్ కాత్తెనె సుఖం వాయింతె	అప్పుడికైతెనె సుఖం వస్తది
లడాయి సాటి దాదల తోవి	పోరాటం కోసం అన్నలతోని
మనలే గూడ కలిసి దాకలె	మనం గూడ కలిసి నడువాలె
లడాయి కీసి రాజ్యం గెల్వాలె ॥౩౪॥	పోరాటం చేసి రాజ్యం గెల్వాలె ॥౩౪॥

(ప్రతిలైనును మొదట పాడేవాళ్ళు పూర్తిగా పాడాలి. కోరస్ సగం అనాలి తిరిగి మొదట వాళ్ళు పూర్తిగా, కోరస్ పూర్తిగా అనాలి. మళ్ళీ మొదటాయన సగం అనాలి. వెనుకవాళ్ళు పూర్తిగా అనాలి ఆ తరువాతనే ఇంకో లైను తీసుకోవాలి.)

లడాయిత పాట	పోరాట పాట
దాకాటేబాటో లాడాయి తుంగులేనూ	పోదాము బావో పోరాటం చేయడానికి
లడాయి తుంగావ రాజ్యమునే గెల్సానా	పోతాటం చేయాలి రాజ్యమే తేవాలి.
॥దాకా॥	దొంగ సర్కారు కాసూను తీసి
కల్లెసర్కారు కాయిదతెండ్సి	అడివి నరకద్దని అంటున్నాది
గెసా సర్కుమడ్ హిల్లే హింతోర్	గడ్డి కొయ్యద్దంటున్నాది
జాడి కొయుమడ్ హిల్లే ఇంతోర్	తాడిచెట్టెక్కద్దనంటున్నాది
తాడి తగ్మడ్ హిల్లే ఇంతోర్	ఆకులు కొయ్యద్దంటున్నాది

అకీం ీ ర్యమ్డ్ హిల్లే ఇంతోర్
వెహాకిన్ నర్క్మడ్ హిల్లే ఇంతోర్
గెడెత వాంజీ బద్తవ్వేకి బద్రం
పిసుముడ్ బాటో ॥దా॥
మ్రమావై మెట్ట మావై
గుత్తిమావై పుత్తిమావై
గెడెమావై కుడేరు మావై
కుడేరు మావై లడాయిమావై
బగటోరు వోరుబాటో కాంగ్రేసు
సర్కారు బోరు బాటో॥దా॥
బండ పియ్యా బాటో
నిమ్మె జండా పియ్యా బాటో
తుపాయి పియ్యా బాటో
నిమ్మె కిసీరు పియ్యాబాటో
తుపాయిపీసి కసీర్తా హచ్చి డువ్వర్
లెక్క లేదర బాటో ॥దా॥
మర్సుక పీసి బాటో
నిమ్మె మున్నే తాకా బాటో
తుపాయి పీసి బాటో
నిమ్మె మున్నే తాక బాటో
హెట్టెడ్ పోసి బాటో
నీ సంఘా వాంతం బాటో
ఎర్రజండా పీసి తాచ్చి గరీబ్ రాజ్యం
తారో బాటో ॥దా॥

కష్టాలు నరకద్దంటున్నాది
అడివికిపోయి ఏం దేంకుంటె ఎట్లా
బతుకుడు బావో ॥పోదా॥
చెట్టు మనదే గుట్ట మనదే
పుట్ట మనదే పండ్ల గుత్తులు మనయే
అడివి మనదే వాగులు మనయే
వాగులు మనయే పోరాటం మనదే.
ఎక్కడోళ్ళు బావో ఈ కాంగ్రేసు
సర్కా రెవరు బావో ॥పోదా॥
బండా పట్టుకో బావో
నీవు జండా పట్టుకో బావో
తుపాకి పట్టుకో బావో
నీవు కత్తులు పట్టుకో బావో
తుపాకి పట్టుకొని కత్తి తీసుకుని పెద్దపులి
లెక్కలేదరా బావో ॥పోదా॥
గొడ్డలి పట్టుకొని బావో
నీవు ముందట నడువు బావో
తుపాకి పట్టుకొని బావో
నీవు ముందట నడువు బావో
కొడవలి పట్టుకొని బావో
నీతోనే వస్తా బావో
ఎర్రజండా పట్టుకొని పేదల రాజ్యం
సాగిద్దాం బావో ॥పోదా॥

Note : ఇది మాడియ భాషలో వ్రాసిన పాట. మహారాష్ట్ర కొండకోనల్లో ఆదివాసుల్లో విస్తృతమైన ప్రచారం పొందిన పాట. తెలుగు అనువాదం పాడుకోవడం కొద్దికష్టం. కొన్ని పదాలు మార్చుకుంటె తెలుగులో కూడ బాగా పాడుకో వచ్చు.

కమలాపూర్ బాటలువూసి క్రాంతిని అరికట్టగలరా ?

— అనూరాధ

గడ్చిరోలి అడవుల్లో 1500 జనాభాగల చిన్న గ్రామం కమలాపూర్ ఇప్పుడు మహారాష్ట్ర అంతటానేగాక భారతదేశం మొత్తంగా అందరికీ తెలిసింది. మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ నాయకత్వంలో సంఘటితమవుతున్న ఈ ప్రాంతంలోని అడవివాసుల ఉద్యమానికి ఈ గ్రామం చిహ్నం అయ్యింది. ఆదివాసి రైతుకూలి సంఘాల ప్రథమ మహాసభ కమలాపూర్‌లో జరపాలనుకోవడంతో అడవి ప్రాంతాల్లోని ఉద్యమం బహిరంగమై రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని ఆదివాసులు చైతన్యవంతులై ఉద్యమిస్తున్నారన్న విషయం గ్రహించి మహారాష్ట్ర ప్రభుత్వం ఆశ్చర్యపడింది.

మహాసభ విషయం అహిరి, ఏటపల్లి, సిరొంచ తాలూకాల్లోనేగాక చుట్టుపక్కల తాలూకాల్లో, జిల్లాల్లో ప్రచారం అయ్యింది. రాజురా తాలూకాలోని ఆదివాసి రైతులు సభకు రావాలనుకున్నారు. దాదాపు 1600 మంది ఆదివాసులు బస్తర్‌నుంచి మహారాష్ట్రకు సభలో పాల్గొనడానికి వచ్చారు.


విదర్భ జిల్లాలోని వివిధ పట్టణాల విద్యార్థులు, మేధావులు ఫిబ్రవరి 25, 26 తేదీల్లో కమలాపూర్‌లో ఉండడానికి నిశ్చయించుకున్నారు. మూడు తాలూకాల్లోని ప్రజలు చాలా రోజులముందే తమ పనులు మానేసి సభను నిర్వహించడానికి ఏర్పాట్లు చేయసాగారు. క్వింటాళ్ళ కొద్ది బియ్యం, కూరగాయలు, వందలాది రూపాయలు సేకరించారు. వేలాది ప్రజల రెండు రోజుల వసతి కొరకు మండప నిర్మాణానికి బండ్లకొద్ది కట్టెలు కమలాపూర్‌కు తరలించారు. ఆదివాసులు తామే స్వయంగా ఏర్పాట్లు చూస్తున్నారు. గ్రామాల్లోని పోరాటాలద్వారా అందరూ ఏకమవుతున్నారు. ఈ అడవి ప్రాంతంలో ఇటువంటి సభ ఎన్నడూ జరగలేదు.

చంద్రపూర్‌లో కూడా సభకు అమితమైన ప్రోత్సాహం లభించింది. చంద్రపూర్, ఆళ్ళపల్లి ప్రాంతాల కాంగ్రెస్(ఐ) యేతర ప్రతిపక్షసభ్యులు సంఘసేవకులు, న్యాయవాదులు, పత్రికా రచయితలు మొదలైన మేధావులతో 45, 50 మంది సభ్యులతో ఫిబ్రవరి 2న ఆహ్వానసంఘం ఏర్పడింది. అందులో కొంతమంది వాళ్ళ వాహ

నాలను, ఇళ్ళను సమావేశాన్ని సభను నిర్వహించడానికి ఉపయోగించారు. దాదాపు పది మంది ఆహ్వాన సంఘ సభ్యులు సభను విజయవంతం చేయడానికి రాత్రింబగళ్లు శ్రమ పడ్డారు

తానే జిల్లాలో పశ్చిమ తీరాన 1940లో జరిగిన వర్లీ తిరుగుబాటు తర్వాత మహారాష్ట్రకు ఇది మొదటి పెద్ద ఉద్యమం.

నేపథ్యం:- తూర్పుసరిహద్దున మధ్యప్రదేశ్‌లోని బస్తర్, పడమర, దక్షిణ సరిహద్దులుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్, కరీంనగర్‌లు ఉన్న మహారాష్ట్రకు



బస్తరు పటం

తూర్పువైపు చివరగా గడ్‌చిరోలిజిల్లాలో మధ్యనవున్న గ్రామం కమలాపూర్. జిల్లాలో ముప్పావు వంతు (73%) దట్టమైన అడవిఉంది. మధ్య భారతదేశం నుంచి బెంగాలు వరకు వ్యాపించి ఉన్న అడవుల వరసలోని ఈ అడవుల్లో సమృద్ధిగా దొరుకు అటవీ సంపద టేకు, వెదురు, మహువాపూలు, తునికాకు, బంక మొదలైనవి. తక్కువ జనాభా

గల ఈ జిల్లాలో సగం ఆదివాసులు. అందులో రాజగోండులు, పరధాను గోండులు. మరియాగోండులు మొదలైన గోండులుఎక్కువ.1751లో నాగపూర్ భోంస్లేలుగోండు రాజునుఓడించేదాక ఈ ప్రాంతంచాందా గోండ్వానా రాజ్యంలో భాగంగాఉంది బ్రిటిష్ పాలననుంచి ఈ అడవి ప్రాంతం చాలాభాగం జమీందారుల, మాల్ గుజారుల అధీనంలో ఉంది. అడవి సంపన్నమైందే కాని ప్రజలు పేదలు. ఈ ప్రాంతం భూస్వాముల అధీనంలో ఉండి ప్రజలకు ప్రవేశం లేకపోవడంతో వాళ్ళ తమ అడవికి తాము పరాయివాళ్ళయ్యారు.

1951 నుంచి ప్రభుత్వం భూస్వాముల నుండి అడవులను స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టి వాటిని రక్షిత, రిజర్వుడు ఫారెస్టులుగా విభజించి తర్వాత వ్యాపార అవసరాల కోసం భారీఎత్తున అడవులనుంచి క్రమబద్ధమైన దోపిడి మొదలుపెట్టింది. అటవీ సంపదను రక్షించడానికి, విచక్షణారహితంగా చెట్లను నరకడాన్ని ఆపడానికి అడవులను జాతీయం చేయాలనే వినాదం కేవలం వ్యాపార అవసరాలకు వాటిని స్వంతం చేసుకోవడానికి ఉపయోగిస్తున్న ముసుగు మాత్రమే. మహారాష్ట్ర అటవీ శాఖవారి అంచనా ప్రకారం ఒక్క 1981-82 సంవత్సరంలోనే ఈ అడవుల్లోంచి కొల్లగొట్టబడిన సంపద విలువ 18 కోట్లరూపాయలు. 1982లో చాందా సర్కిల్‌లోనే తునికాకులమీద 11 కోట్ల రూపాయలు ఆదాయం. ఈ అంచనాల్లో చట్టబద్ధంగా, చట్ట విరుద్ధంగా అటవీశాఖాధికారుల, కాంట్రాక్టర్ల లాభాలు చేర్చలేదు. ఈ లెక్కలు సిర్పూర్, బల్లార్షాలలో బిర్లాల, థాపర్ల కాగితం పరిశ్రమకు వెదురు బొంగులు సబ్సిడీ రేట్లమీద సరఫరా చేయడం నుంచి లభించినవి మాత్రమే.

ఈ అడవులను స్వాధీనం చేసుకొని చేసిన అడవి చట్టాలు, ప్రభుత్వం రూపొందించిన విధానాలు అడవి వాసులకు ఇబ్బందిగా ఉన్నవి. వాళ్ళ పూర్వీకుల కాలంనుంచి అడవిలో నివసిస్తూ దానితో అనుబంధం కలిగి ఉన్న ఈ అడవి బిడ్డలు ప్రభుత్వం, పాలనా యంత్రాంగం దృష్టిలో ఆక్రమణ దారులయ్యారు. 'అడవిరాజులు' సేవకులు కాగా వర్తకులు, కాంట్రాక్టర్లు, ఫారెస్టుగార్డులు, అడవిని పాలించే వాళ్ళయ్యారు. ఆదివాసులు అతి తక్కువ కూలీకి ఎప్పుడూ పనిచేసే వారనేది పాలకుల దృష్టి. భూమి పరాయీకరణ, అప్పులు ఇంకా ఇట్లాంటి సమస్యలెన్నో ఈప్రాంతాన్ని చుట్టుముట్టాయి. అడవిలో నివసిస్తున్న ప్రజలలో ఎక్కువమంది తమ జీవనానికి

వ్యవసాయంమీద ఆధారపడ్డవాళ్లు పనిచేసే వాళ్ళలో 51% మంది వ్యవసాయదారులుగా 34% మంది వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. ఆదివాసులలో వ్యవసాయంపై ఆధారపడ్డవాళ్లు 91% మారుమూల ఉన్న భద్రాగడ్ ప్రాంతంలోని మారియా గోండ్లలో ఇంకా పోడు వ్యవసాయం అమలులో ఉంది దీన్ని ఇక్కడ 'పెండ' అంటారు చాలామంది అడవి వాసులు సేద్యానికి పనికిరాని భూమి 5 ఎకరాల కంటె తక్కువ కలిగిఉండి ఒకేఒక్క వానాకాలం పంటమీద ఆధారపడి బతుకుతో పోరాటం సాగిస్తున్నారు. చుట్టూ నాలుగు పెద్దనదులు ఉన్న ఈ జిల్లాలో ఒక చిన్న నది ఉండి కూడా సేద్యం చాలా తక్కువ. వానాకాలం పంట తర్వాత చాలామంది ప్రజలు అడవి ఉత్పత్తులను సంపాదించి అమ్ముతూ, అటవీ శాఖాభివృద్ధి సంస్థలో పనులు మొదలైనవి చేస్తుంటారు. వాళ్ళ పరాయీకరణ, అమాయకత్వం వల్ల పలురకాలుగా మోసం చేయబడే పరిస్థితి ఏర్పడింది. వాళ్ళకు ఇళ్ల నిర్మించే పని దొరకడానికి లంచాలు ఇవ్వాలి ఇంటి కొరకు కట్టెలు కొట్టుకోవడం, సారా తయారు చేసుకోవడం, వాళ్ళ సంస్కృతిని నిలబెట్టుకోవడం లాంటి పనుల్లో పోలీసులచేత, ఫారెస్టు గార్డుల చేత వేధింపబడుతుంటారు. మామూళ్లు, లంచాలు వాళ్ళ జీవితాల్లో సాధారణమై పోయినవి. వాళ్ల తరుచుగా ప్రభుత్వ, అటవీశాఖ సీనియర్ అధికారులకు వెట్టిచాకిరీ చేయడానికి పిలువబడుతుంటారు. వ్యాపారులు వాళ్ళను పలురకాలుగా మోసం చేస్తుంటారు. వాళ్ళను నాగరికులుగా, మనుష్యులుగా గుర్తించే స్వభావం 'నాగరికులకు' లేదు.

ఉద్యమం ప్రారంభం:- మూడు సంవత్సరాల క్రితం భూమికోసం, కూలి రేట్ల పెరుగుదలకోసం, ఆత్మగౌరవం కోసం మొదలైన ఉద్యమం అకస్మాత్తుగా ఈ అడవులను ఊపేసింది. ఏ రాజకీయపార్టీ, కార్మికవర్గ సంఘంతో సంబంధం లేని ప్రజలు చైతన్యవంతులయ్యారు. (1857లో స్థానిక జమీందారు బాబూరావు రాజ్ గోండు బ్రిటిష్ వాళ్ళకు వ్యతిరేకంగా గోండులను తిరుగుబాటు చేయించాడు. ఇదే ఈ ప్రాంతంలో చివరి ముఖ్యమైన తిరుగుబాటు). ఒకవైపు స్పెషల్ రిజర్వుపోలీసు క్యాంపులు, పోలీసు దాడులు కొనసాగుతుండగానే ఈ ఉద్యమం చిన్న చిన్న అలలుగా ఆరంభమై ఈ జిల్లా దక్షిణ చివరనవున్న అసరల్లీకి విస్తరించింది.

ఏ సంస్థా రూపం దాల్చకముందే, ఏ డిమాండులూ రూపొందించి ప్రకటించకముందే ఈ ఉద్యమానికి ఒక మృత వీరుడు పెద్దిశంకర్ ఉన్నాడు. ప్రాణహిత నది

ఒడ్డున ఉన్న మోయిన్‌బిన్‌పేట గ్రామంలో నవంబర్ 2, 1980న మహారాష్ట్ర పోలీసుల మొదటి 'ఎన్‌కౌంటర్'లో అతడు హతుడయ్యాడు. ఈ హత్యతో మహారాష్ట్రలో ప్రవేశించడానికి 'నక్సలైట్లు' భయపడ్తారని ప్రజలకు వాళ్ళతో సంబంధాలు ఉండకుండా అడ్డుపడవచ్చుననీ పోలీసులు భావించారు. కాని అణచివేత తిరుగుబాటును ప్రేరేపిస్తుందని చెప్పినట్లుగా పెద్దిశంకర్ మరణం అడవి వాసులు సంఘటిత పడడానికి దోహదం చేసింది.

భూ పోరాటం:- ఈ ఉద్యమం భూమి సమస్యతో మొదలైంది. ఈ ప్రాంతంలోని ఆదివాసులకు ముఖ్యమైన సమస్య భూమి. అడవులను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తర్వాత ప్రజలకు వాళ్ళ భూములు పెంపొందించుకునే అవకాశం లేకుండా పోయింది. అంతేగాక అడవిలోపల ఉన్నాయని కొంతమంది భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇదివరకులా అడవి నరికి సాగుచేసుకోవడం చట్టబద్ధం కాకుండాపోయింది. కాని ఆర్థికంగా వెనుకబడడం, తక్కువ భూములు కలిగి ఉండడం, భూమియే జీవనాధారం కావడం రైతులు భూమికొరకు డిమాండు చేయాల్సివచ్చింది. చట్టవిరుద్ధంగానూ చట్టబద్ధంగానూ కొందరు భూమి సాగుచేసుకోవడం మొదలుపెట్టారు కాని ఏండ్లు గడిచినా వారికి పట్టాహక్కు రాలేదు. వాళ్ళు రెవెన్యూ, ఫారెస్టు అధికారులకు భయపడి పట్టా హక్కును క్రమబద్ధం చేసుకోవడం కోసం వందలాది రూపాయలు లంచంగా చెల్లించేవారు. అక్టోబర్ 1981లో కర్జెల్లి గ్రామ ప్రజలు మొదటి ప్రజా సామూహిక చర్యగా కొన్ని ఎకరాల అడవి భూమిని సాగుచేసుకోవడంతో ప్రజాపోరాటం మొదలయ్యింది మార్చి 1982లో అసరల్లి గ్రామ ప్రజలు 106 మంది భూమిలేని కూలీలు 13, 14 ఎకరాల భూమిని సాగుచేసుకోవడానికి పూనుకొన్నారు. వాళ్ళంతా అరెస్టు చేయబడి మొత్తం భూమి గుంజుకోబడింది. ఆదివాస, ఆదివాసేతర రైతులు. భూమిలేనివాళ్లు, తక్కువ భూమి కలిగి చట్టబద్ధంగా పట్టా లేనివాళ్ళు వేలాదిమంది ఉన్నారు. ప్రజా పోరాటాలవల్ల ప్రజా ఉద్యమాలకి భూమి సమస్య ప్రధానమైందిగా ఎజెండాలోకి వచ్చింది.

తునికాకు పోరాటం:- అసరల్లిలో వెంటనే ఒక పోలీసు క్యాంపు పెట్టారు. కాని ఇది ఆ వేసవికాలంలో తునికాకు ఏరడానికి కూలిరేటు ఎక్కువ కావాలని డిమాండ్ చేయడాన్ని నిరోధించలేక పోయింది. భూమిలేని పేద ప్రజలంతా

వేసవికాలంలో ఒక నెల తునికాకు ఏరి కొంతడబ్బు సంపాదించుకుంటారు. జాతీయం చేసినప్పటినుంచి 75 ఆకులు గల వెయ్యి కట్టలకు చెల్లించే రాయల్టీమీద హక్రాజు ద్వారా అధికారం ఫారెస్టు డిపార్టుమెంటు ఏజంట్లకు ఇస్తుంది. రాష్ట్రప్రభుత్వం తునికాకు ఏరడానికి రేటు నిర్ణయిస్తుంది. కాంట్రాక్టర్లు, ఏజెంట్లు గ్రామాల్లో ఆకుల కట్టలు తీసుకుని డబ్బు చెల్లించడానికి కల్లేదార్లను నియమిస్తారు.

ఈ పనిలోకూడా గ్రామస్తులను మోసం చేయడానికి,దోపిడీ చేయడానికి చాలా పద్ధతులున్నాయి. మొదటగా ఆకు ఏరడానికి ప్రభుత్వం నిర్ణయించిన రేటు చాలా తక్కువ. మూడేళ్ళక్రితం వరకు 100 కట్టలకు 4 రూపాయలుండి గత సంవత్సరం రూ 6.40 అయ్యింది. రెండవది కంట్రాక్టర్లకు పస్తూరి (ఉచితంగా కట్టలు) యివ్వాలి. ప్రతి 100 కట్టలకు గ్రామస్తులు 5 కంటె ఎక్కువ కట్టలు ఉచితంగా ఇవ్వాలి. 1982 వేసవిలో అసరల్లి గ్రామస్తులు కంట్రాక్టర్లను ఎక్కువ రేటు చెల్లించాలని డిమాండు చేసారు. లొంగివచ్చి వాళ్ళు ఒప్పుకున్నారు. వాళ్లకు 8 రూపాయల నుంచి 9 వరకు చెల్లించారు. అది దాదాపు ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు రెట్టింపు. ఈ వార్త దావానలంలా వ్యాపించింది. తర్వాత సీజన్‌లో అహిరి, సిరొంచ తాలూకాల్లో అంతటా 100 కట్టలకు 14 రూ॥లు చెల్లించాలన్న డిమాండును ప్రచారం చేసారు. ఎక్కడైతే కంట్రాక్టర్లు ఎక్కువ రేట్లు ఇవ్వడానికి ఒప్పుకోలేదో అక్కడ వెంటనే గ్రామస్తులు చాలా గ్రామాల్లో పని మానేసారు. కమలాపూర్‌లో ప్రజలు 8 రోజులు పని చేయలేదు. కంట్రాక్టర్లు బెదిరిపోయారు. డిమాండు చేసినట్టు ఇవ్వడానికి నిరాకరించినవారి పని కుప్ప అయ్యింది. ఈ రెండు తాలూకాల్లో అంతటా ప్రజలు గట్టి నిర్ణయంతో ఉన్నారు. అసరల్లి చుట్టుపక్కల గ్రామాల్లో రూ 12-50 చెల్లించారు. ఇంకా ఉత్తరాన రూ 9 నుంచి 10 వరకు చెల్లించారు. పస్తూరిగా ఇవ్వాల్సిన కట్టలు 1 లేక 2 కు తగ్గింది. ఈ విజయం రెండు తాలూకాల్లో తమకు పోరాట బలం లేదనుకునే ప్రజలను ఒక అలలాగా చైతన్యవంతులను చేసింది. 1983 వేసవిలో ఈ తునికాకు పోరాటంతో ఉద్యమం బయటకు వచ్చింది.

మిగతా డిమాండ్లు:- మిగతా సమస్యలు చేపట్టక ముందే ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (అటవీ అభివృద్ధి సంస్థ) కూలిరేట్లు పెరిగాయి.

వ్యవసాయ కూలిరేట్లు పెరిగాయి. బల్లార్‌పూర్ కాగితపు మిల్లులో వెదురు నరక దానికి చెల్లించే రేటు పెరిగింది పోలీసులకు, అధికారులకు ప్రజలు వెట్టి చేయడం తగ్గింది. అన్నిటికంటె ముఖ్యమైనది ప్రజల ఆచారాలను, సంస్కృతిని అవమాన పరచడానికి జంకే విధంగా ప్రజల ఆత్మ విశ్వాసం, స్థైర్యం పెరిగాయి. ఒక నాయబ్ తహశీల్దార్ గిరిజన బాలికను మానభంగం చేసినందుకు ఏటపల్లి బహిరంగమార్కెటు స్థలంలో ప్రజలు అతన్ని చితకబాదారు. అసరల్లి దక్షిణ భాగం నుంచి ఉద్యమం అహిరి. భ్రామగఢ్, ఏటపల్లి అడవులనిండా వ్యాపించింది. ఇన్ని పోలీసు క్యాంపు లున్నప్పటికీ, ఎప్పటికీ పోలీసు దాడులు జరుగుతున్నప్పటికీ. గాలింపు చర్యలు జరుగుతున్నప్పటికీ కార్యకర్తల్లో ఎవ్వరూ అరెస్టు చేయబడలేదన్న వాస్తవం ఉద్యమం విస్తరించిందనడానికి దానికి ఎంతోమద్దతు ఉన్నదనడానికి నిదర్శనం ఒక్క సారి మాత్రం పోలీసులు బెజురాపల్లివద్ద కార్యకర్తల గుంపుపై కాల్పులు జరిపారు. కాని కార్యకర్తలు తమ సాహిత్యాన్ని అక్కడ వదిలి తప్పించుకొనిపోయారు.

ఈ ఉద్యమం భూస్వాముల్లో కంట్రాక్టర్లలో భయం రేకెత్తించింది నక్స లైట్లను అణచవలసిందిగా వాళ్ళు ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తున్నారు. రాష్ట్రమంత్రి వర్గంలోని ఒక ఆదివాసిమంత్రి తాను వాళ్ళను జిల్లాలోకి వచ్చి 15 రోజుల్లో అణచి వేస్తానని బెదిరించాడు అతను జిల్లాలోకి ఇంతవరకు రాలేదన్నది వాస్తవం. ఈ రాజకీయ నాయకులు తమ ఓట్ల స్థావరాలు తమ చేతిలోంచి జారిపోతున్నాయని భయపడుతున్నారు.

చంద్రపూర్ పట్టణంలో 'ఆదివాసియోఁ నాగపూర్‌చలో' అనే నినాదం ఒకటి గోడలమీద కనిపిస్తుంది. అది 15 ఏళ్ళక్రితం రాయబడింది. ఇప్పుడు ఆ నినాదాలను మింగేస్తూ పెద్దగా 'చలో కమలాపూర్' అనే నినాదాలు కనిపిస్తున్నాయి. ఆదివాసులను బూర్జువా రాజకీయాల నుంచి విప్లవ రాజకీయాల్లోకి మళ్ళిస్తున్న చైతాన్యానికి ఇది సంకేతం. 15 సంవత్సరాల క్రితం ఆదివాసులను రాజా విశ్వేశ్వరరావు ప్రత్యేక విదర్భను డిమాండు చేయడానికి నాగపూర్ తీసుకుపోయాడు. మళ్ళీ ఒకసారి షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నిబంధనలను మార్చాలన్న డిమాండుతో వీళ్ళను ఆదివాస కాంగ్రెస్ (ఐ) ఎం. ఎల్. ఏ. బాబూరావ్ కూడది 1981 లో నాగ్‌పూర్‌కు తీసుకు పోయాడు. ఇప్పుడు బూర్జువా రాజకీయ నాయకులు ఆదివాసుల కొరకు తామేమీ చేయలేదన్న వాస్తవాన్ని గుర్తించి వాళ్ళ సంఘటిత పడడంతో భయపడ్తున్నారు.

పోలీసు నిర్బంధం:- ఉద్యమాన్ని అణచడానికి పోలీసులను ఉపయోగించు తున్నారు. మూడు తాలూకాల్లో చాలా గ్రామాల్లో 62 ఎస్.ఆర్ పి పోలీసు క్యాంపులు పెట్టారు. గ్రామ సర్పంచులను పట్టుకొని హింసించి అపాయకరమైన నేరస్తులకు రక్షణ కల్పిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామస్తుల మూక ఉమ్మడి అరెస్టులు సాధారణమైంది. గాలింపు చర్యలు మొదలుపెట్టారు. కమలాపూర్ సభతో పోలీసుల సంచలనం ఎక్కువయింది.

ప్రజా కమిటీలు:- కాని ఇన్ని నిర్బంధాలున్నా ఉద్యమం పురోగమిస్తూనే ఉంది. గత సంవత్సరం గ్రామాల్లో వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజాకమిటీలు ఏర్పడ్డాయి. ఔర్ద్ గ్రామంలో ప్రజాకమిటీ రేషన్ పంచదార దొంగనిల్వలను బయట పెట్టింది. సిరొంచ దగ్గర ఒక గ్రామంలో బడికి పంతులు కావాలని ప్రదర్శనలు జరి పింది. ప్రజల అధికారానికి మొదటి మెట్టు మొదలయ్యింది.

సభమీద నిర్బంధం:- సభను నిర్వహించాలన్న ఆలోచనతో ఉద్యమ పరిస్థితి తారా స్థాయికి చేరుకొంది. స్థానిక పోరాటాలు స్థానిక కమిటీలను ఏర్పాటు చేసాయి. సభ అనుకున్న దానికంటె ఎక్కువగా ప్రజల్లో ఉత్తేజం కలిగించింది. మొదట 8 వేల నుంచి 10 వేల వరకు జనం వస్తారని అంచనా. పోలీసులు కనుక చాలామందిని సభకు రాకుండా ఆపకున్నట్టయితే 20 వేల మందికి తక్కువ కాకుండా కమలాపూర్‌లో సమావేశమయ్యేవారు.

సభ స్థానిక పీడకవర్గాలకు ఒక సవాల్ అయ్యింది. ప్రభుత్వానికి భయం కలి గించింది.

రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల ద్వారా రెండు రకాలుగా చర్య తీసుకుంది. సభ జరుగుతుందని ప్రకటించిన తర్వాత గ్రామస్తులను భయపెట్టడం. సభను నిషేధిస్తా రని ఒకవేళ వాళ్ళు అంతా సభకొరకు గుమిగూడితే మరో ఇంద్రవెల్లి అవుతుందని బెదిరించారు. గ్రామస్తులు అంటించిన పోస్టర్లు చింపివేసారు. భయానక వాతావరణం సృష్టించారు. సభ జరగడానికి ఒక నెలముందు కమలాపూర్ గ్రామంలోని మగ వాళ్ళందరినీ అరెస్టుచేసి చాలా రోజులు చంద్రపూర్ జైలులో పెట్టారు.

లౌడ్ స్పీకరు ఉపయోగించడానికి అవసరమయ్యే అనుమతిని ఇవ్వడం కాని, నిరాకరించడం కాని చేయలేదు. సరిహద్దు ప్రాంతాల్లోంచి 'నక్సలైట్లు' వందల

సంఖ్యలో వస్తున్నారన్న కథను వ్యాపింపచేసారు. కాని చాలా రోజుల వరకు ఏమీ జరిగినట్లు అగుపించలేదు. కమలాపూర్‌లో మండప నిర్మాణం ఖారీఎత్తున జరిగింది. ఎంత భయపెట్టినా ప్రజలు పని చేయడానికి ముందుకొచ్చారు.

అకస్మాత్తుగా ఫిబ్రవరి 21 నుంచి వరుసగా అరెస్టులు మొదలయ్యాయి. మొట్టమొదటి సారిగా అహిరిలో ఆరెస్టు చేయబడ్డవారు గద్దర్, పదిమంది జననాట్య మండలి సభ్యులు. మర్నాడు గంజి రామారావు (ఆంధ్రప్రదేశ్ రైతుకూలి సంఘం అధ్యక్షుడు), రాఘవులు (గిరిజన రైతుకూలి సంఘం కార్యదర్శి) దత్తాపంద్రె (ఆహ్వాన సంఘం కార్యకర్త), శేఖర్ (ఆహ్వాన సంఘం కార్యదర్శి) అరెస్టు చేయబడ్డారు. కమలాపూర్ వస్తూ దారిలో బలార్షా వద్ద ప్రదర్శన ఇచ్చిన అవ్హాన్ నాట్య మంచ్ సభ్యులు నలుగురు అరెస్టు చేయబడ్డారు. 23న ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఏక్‌నాథ్‌సాళ్వే అరెస్టు చేయబడ్డాడు. అతణ్ణి వారం రోజులు ఒక పోలీసు స్టేషన్ నుంచి ఇంకొక పోలీస్ స్టేషన్‌కు వరుసగా తిప్పారు. కమలాపూర్ చుట్టూ నిషేధాజ్ఞలు ప్రకటించారు.

సేకరించిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సగం నిర్మించబడ్డ మండపం నేలమట్టం చేసారు. ఎలక్ట్రిక్ జనరేటర్ ఉన్న ట్రక్కును స్వాధీనం చేసుకున్నారు. పీస్ బుక్ సెంటర్ వాళ్ళు తెస్తున్న చాలా సాహిత్య పుస్తకాలను స్వాధీనం చేసుకుని వాళ్లను అరెస్టు చేసారు. ట్రక్కువెంట ఉన్న ఆహ్వానసంఘం సభ్యుడు కృష్ణారెడ్డి అనే లాయర్‌ను కూడా అరెస్టు చేసారు. 24 సాయంత్రం సిరొంచ బస్ స్టాపులో వరవరరావు ఇంకా కొందరు అరెస్టు చేయబడ్డారు. వాళ్లకు బేడీలు వేసి కోర్టుకు తీసుకుపోయారు. 27న వాళ్లను వదిలివేసిన తరువాత మళ్ళీ అరెస్టు చేయాలని ప్రయత్నం చేసారు కాని మెజిస్ట్రేటు ఒప్పుకోలేదు.

చంద్రపూర్‌నుంచి సిరొంచవరకు మొత్తం ప్రాంతమంతా పోలీసు క్యాంపుగా మారింది. ప్రతి బస్సుస్టాపువద్ద సాయుధ పోలీసుల నుంచారు. ప్రతి బస్సును తనిఖీ చేసి కమలాపూర్ పోయేవాళ్ళను దించి పోలీసు వ్యానుల్లోకి ఎక్కించారు. 25న, 26 సగం రోజువరకు అల్లపల్లి, సిరొంచ మధ్య బస్సులు నడపలేదు. బస్సులు నడిచి ...డు రేపన్‌పల్లి వద్ద ఆపలేదు. సభ జరిగే గ్రామానికి ఉన్న ఒకే ఒక్క బస్సు ...ు సమర్ధవంతంగా అడ్డుకున్నారు. అల్లపల్లి, సిరొంచ చుట్టు పోలీసుల ...కిలు మోటార్లు మాత్రమే కనుపించాయి. రెండు ప్రత్యేక ఎస్. ఆర్. పి.

దళాలను సభను అణచివేయడానికి నియమించారు. చుట్టుపక్కల జిల్లాలనుంచి కూడా పోలీసులు తరలివచ్చారు. సభకు వస్తున్న వాళ్లమీద నిఘాకు, అరెస్టు చేయబడ్డ వాళ్ళను ప్రశ్నించడానికి సరిహద్దు రాష్ట్రాలనుంచి ప్రత్యేక పోలీసులను రప్పించారు.

ఈ అణచివేతను పర్యవేక్షించడానికి డిఐజి స్వయంగా తన సాయుధ దళంతో కమలాపూర్ గ్రామంలో విడిది చేసాడు. సభ తేదీల తర్వాత కూడా పోలీసులు నిర్బంధాన్ని సడలించలేదు. ముందు జాగ్రత్తచర్యగా అరెస్టు చెయ్యబడ్డ వాళ్ళందరినీ మళ్ళీ అరెస్టు చేసారు. ఏకనాథ్ సాల్వే, గంజి రామారావు, గద్దర్, జననాట్య మండలి సభ్యులు, రాఘవులు, దత్తాపాండే, శేఖర్, కృష్ణారెడ్డి మొదలగు వాళ్లు మళ్ళీ అరెస్టు చేయబడ్డారు. వీళ్లు కమలాపూర్‌లో కలప దొంగతనం చేసి అమ్ము కున్నారన్నది ఆరోపణ గజానన్ కళాఖపవార్ అనే అసరల్లీ యువకుణ్ణి మళ్లీ అరెస్టుచేసి పోలీసు కష్టడీలో ఉంచారు. క్రిష్ణారెడ్డి ఒక హత్య కేసులో నిందితుడుగా పరారీలో ఉన్నాడని అతన్ని 'ఎన్‌కౌంటర్'లో కాల్చేస్తామని బెదిరించారు. అతన్ని రాత్రిపూట అడవిలోకి జీపులో తీసుకపోయి బెదిరించి తిరిగి తీసుకవచ్చారు. దాదాపు వందమంది ఆదివాసులను కూడా కమలాపూర్ చేరే ప్రయత్నంలో ఉండగా అరెస్టు చేసారు. ఆ వారం రోజుల్లో దాదాపు 300 మందిని అరెస్టుచేసి వదిలేసిన తర్వాత మళ్లీ అరెస్టు చేసారు.

ప్రజల ప్రతిచర్య:- ఇంతగా పోలీసు నిర్బంధం ఉన్నప్పటికీ వేలాది మంది ప్రజలు, అడవి వాసులు కమలాపూర్ చేరుకునే ప్రయత్నం చేసారు. ఆ ప్రయత్నంలో కొందరు అరెస్టు చేయబడ్డారు. సభాస్థలం చేరుకోవడానికి ప్రజలు పలురకాల ప్రయత్నాలు చేసారు. విద్యార్థులు, యువజన కార్యకర్తలు బొంబాయి, అమరావతి, నాగపూర్ ఆదిలాబాద్ నుంచి కమలాపూర్ రావడానికి ప్రయత్నిస్తు న్నప్పుడు అరెస్టు చేయబడ్డారు. తెలంగాణా ఆర్. ఎస్. యు. విద్యార్థులు చంద్రపూర్ పట్టణంలో పోలీసు చర్యలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిపి అరెస్టయ్యారు. అడవి

వాసులు జిల్లాలోని నలుమూలల నుంచి బస్తర్ నుంచి ఊరేగింపుగా అడవి గుండా వచ్చి సభను నిర్వహించే ప్రయత్నం చేసారు.



విల్లంబులు పట్టుకున్న గిరిజన మహిళలు

దాదాపు 5000 గిరిజనులు మధ్యప్రదేశ్ సరిహద్దు నుంచి నడిచి కమలాపూర్‌కు వస్తూ ముందుకు పోలేమని గ్రహించి అడవిలో దాక్కున్నారు. వాళ్లు అక్కడ చిన్న సభ పెట్టుకున్నారు. మర్నాడు ఉదయం వాళ్లు కమలాపూర్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు, అడవిలోఉన్న సంజయ్ విచార మంచ్ సభ్యుడిని ముందుంచి ఒక మైలు పొడవుగల ఊరేగింపుతో 26 మధ్యాహ్నం కమలాపూర్‌కు నడిచారు. పోలీసులు భయంతో వణికిపోయారు. "మమ్మలను మీరు ఎక్కడికింటె అక్కడికి తీసుకపోండి. ఢిల్లీ పోలీస్ స్టేషన్, నాగపూర్ స్టేషన్, అహిరి స్టేషన్. మేం నడుస్తాం. మేం మూడు రోజులు నడిచాం. ఇంకా వారం రోజులు నడుస్తాం. మేం న్యాయం కోసం, మా హక్కుల కోసం వచ్చాం. భూమి పట్టాలకోసం వచ్చాం. రెండు సంవత్సరాలక్రితం మీ ఆఫీసుకు వచ్చినప్పుడు మాకు రెండు నెలల్లో పట్టాలు ఇస్తామని వాగ్దానం చేసారు. ఇప్పుడు మేం మిమ్మలను నమ్మం. మేం వెళ్ళిపోం" అని వాళ్ళు దిగ్భ్రాంతి చెందిన పోలీసు ఆఫీసర్‌తో చెప్పారు. చాలా సేపు సంప్రతింపుల తర్వాత సగంమంది వెళ్ళిపోయారు. కాని మిగతా సగం కదలడానికి నిరాకరించి గ్రామంలోనే

ఉండిపోయారు. గిరిజనులమీద డాక్యుమెంటరీ సినిమా తీసే బృందం వచ్చింది. పోలీసు నిర్బంధాల మధ్య. డి ఇ.జి, ఎస్.పి క్యాంపుల్లో సభ నిషేధించారని తెలిసినా గిరిజనులు సభకోసం వచ్చారు కనుక హాజరవ్వాలని ఎదురుచూస్తూ కూర్చున్నారు. చివరకు పోలీసులు లాఠీచార్జి చేసిన తరువాత చెల్లాచెదురైపోయారు.


కాని ఇది ఒక ఊరేగింపు మాత్రమే. ఇట్లాంటివి చిన్నవి, పెద్దవి చాలా మూడు తాలూకాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చాయి. ఇంకా వాటి గురించి సమాచారం రావలసి ఉన్నది. అడవిలో చిన్న, పెద్ద మీటింగులు ఎన్నో ప్రజలు పెట్టుకున్నారు. అల్లపల్లిలో అరెస్టు చేయబడ్డ విద్యార్థులు, కార్యకర్తలు పోలీసు వ్యాను నుంచి చుట్టూ గుమికూడిన ప్రజలకు ఉపన్యాసమిచ్చారు. సభ జరుపబడలేదు. కాని సభ ఉత్తేజం నిర్బంధాన్ని ఎదుర్కోవాలన్న ఆలోచనను దృఢపరిచింది.

అరెస్టయిన వాళ్ళలో చాలా మందిని చంద్రపూర్, నాగపూర్ జైళ్ళలో ఉంచారు వందమంది పైన విద్యార్థులు, కార్యకర్తలు ఆదివాసులు జైల్లో నిర్బంధించబడ్డ వాళ్ల జైల్లో రెండు రోజులు సభలు నిర్వహించారు. మొదటిసారిగా నాగపూర్ జైలు విప్లవ నినాదాలతో, పాటలతో ప్రతిధ్వనించింది. ఆదివాసులమీద, రైతులమీద గడ్‌చిరోలి, ఉరాన్‌లలో పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తూ, తెలంగాణాలో గడ్‌చిరోలిలో పోలీసు క్యాంపులు ఎత్తివేయాలని ఇంకా ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సమస్యలమీద తీర్మానాలు చేసారు.

బయటకూడా నిరసనప్రదర్శనలు జరిగాయి. అరెస్టులను ఖండిస్తూ, 25 ఫిబ్రవరిన సభను నిషేధించడాన్ని నిరసిస్తూ 100 మంది ప్రదర్శన జరిపారు. నవజవాన్ భారత్ సభ, బొంబాయి విద్యార్థి ప్రగతి సంఘటన్ నిర్బంధాన్ని నిరసిస్తూ 200 మందితో ప్రదర్శన నిర్వహించింది. సభ జరగకున్నా పోలీసుల చర్యలతో కోపంతో విసిగిపోయిన ప్రజలు సభ జరిగివుంటే వచ్చే ఫలితాలకంటే ఎక్కువ ఉత్తేజాన్ని పొందారు.

సభను అణచివేయాలన్న పోలీసుల కుట్ర విఫలం అయినట్లే వాళ్ళ ఆదివాసులను, కార్యకర్తలను ప్రజలనుంచి వేరు చేయాలని ప్రయత్నించి ఘోరంగా పరాజయం పొందారు. సంఘాన్ని నిర్మించుకోవాలన్న ఆదివాసుల ప్రయత్నానికి సానుభూతి, బలం ఏర్పడింది. వాళ్ళ ప్రజలను భయభ్రాంతులను చేసి సంఘటనను వదిలి వెళ్ళిపోయేట్టు చేయాలనుకున్న ప్రయత్నం సఫలం కాలేదు. 'మేం మా సభ జరుపుకొని తీరుతాం'నే స్థయిర్యంతో వున్నారు ఆదివాసులు. ఈలోగా వచ్చేనెలలో తునికాకు తెంపే సీజన్ ప్రారంభమవుతుంది. గనుక ఆదివాసులు రెండో పర్యాయం పోరాటానికి సిద్ధమవుతున్నారు.

మహారాష్ట్రలో విప్లవ ప్రభాత రేఖలు విరుస్తున్నాయి. సహజంగానే అవి తూర్పునుంచి ప్రసరిస్తున్నాయి.



ఏప్రిల్ 20, 1981 పోలీసు కాల్పుల్లో ఇంద్రవెల్లిలో
అమరులైన రైతుకూలీల స్మారక స్థూపం

ఆదివాసుల పోరాటాలను అణచడానికి 'మానవతావాదం' మత్తుమందు

ఇచ్చంపల్లి, భూపాలపట్నం ప్రాజెక్టుల నిర్మాణంవల్ల వేలకొద్ది చెట్లను నరికివేయాల్సి వస్తుందని, దానివల్ల ఆ ప్రాంతంలో నివసించే ఆదివాసుల సంస్కృతిపై ప్రభావం పడుతుందని-దానికి నిరసనగా ఆ నిర్మాణాలను వ్యతిరేకిస్తూ శ్రీ బాబా ఆమ్టే ఒక పెద్ద ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు తెలుస్తున్నది "చెట్లను రక్షించండి" అనే నినాదంతో పెద్దఉద్యమాన్ని మహారాష్ట్రతోపాటు ఆంధ్ర ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా ఆయన నిర్వహిస్తారని తెలిసింది. బాబాకు "చెట్లను రక్షించండం"పై శ్రద్ధ ఎక్కువ ఉన్నదా లేక "ప్రజలను రక్షించడం"పై ఎక్కువశ్రద్ధ వున్నదా అనే విషయం అర్థం కావడంలేదు. వాస్తవంగా ఆయనకు ప్రజలను రక్షించాలన్న ఆకాంక్ష వుండివుంటే, ఆదివాసులను ఆర్థికంగా సాంఘికంగా దోపిడీ చేస్తున్న అనేకానేక సమస్యల గురించి ఆలోచించాల్సింది.

వీరి యీ వైఖరివల్ల అడవుల్ని నరుకుతున్నది ఆదివాసులేనన్న అభిప్రాయం ధ్వనిస్తున్నది. ఒక పక్క చట్టరహితంగానూ, మరో పక్క చట్టాన్ని అడ్డం పెట్టుకుని అడవుల్ని పెద్ద ఎత్తున నరుకుతున్న కంట్రాక్టర్లు, ప్రభుత్వం మాత్రం అడవులను రక్షిస్తున్నాయన్న దురభిప్రాయం కూడా ధ్వనిస్తున్నది. శతాబ్దాలతరబడి అడవుల్లో నివసిస్తున్న ఆదివాసులకు వాటినెట్లా రక్షించుకోవాలో మనకన్నా బాగా తెలుసు. ప్రభుత్వాధికార్లతోనూ, ప్రభుత్వంతోనూ కుమ్మక్కై లారీలకొద్దీ కలపను రోజూ తరలిస్తున్నది కంట్రాక్టర్లే తప్ప మరెవరూకారు. చివరికి ఆదివాసులు - వారి సమస్యలను ఎలుగెత్తి వినిపించడానికి ఒక్కచోట సంఘటితమై బయటి ప్రపంచానికి తెలియజెప్పాలనుకున్నా యీనాడు ప్రభుత్వం వారిని అనుమతించడంలేదు. దీనికి తాజా ఉదాహరణ కమలాపూర్ ఆదివాసీ మహాసభ.

ఒకరి హృదయ పరివర్తనను సాధించడమే వ్యక్తిగతంగా ఆయన లక్ష్యమైతే ఆయనకుగల ఆ రకమైన మానవతావాదంపట్ల మనకేమీ అభ్యంతరంలేదు. అణచివేతకు, దోపిడీకిగల మూలకారణాలను వెదకి- వాటిపై పోరాటం సలపకుండా మానవతావాదం గురించి మాట్లాడే మాటలన్నీ నిర్వీర్యమైనవి, అతినీచమైన ద్వంద్వ నీతి తప్ప మరొకటికాదు. అడవుల్లో దోపిడీకి ప్రధాన కారణం-ప్రభుత్వం బడా బూర్జువా కంట్రాక్టర్లతో, వారి చట్టవిరుద్ధమైన పనుల్లో లాలూచీపడడమే.

విషసర్పాన్ని ఒక పక్క, అందమైన అమాయక శిశువును మరొకపక్క పోషించాలనుకుంటున్న బాబా ఆలోచన మాకు విచారం కలిగిస్తున్నది.

కాని యివ్వాళ ఆదివాసులు వారంతటవారు తమ సంఘాన్ని ఏర్పరచుకుంటున్న దశలో బాబా ఆప్టే మానవతావాదం అక్కడ అవసరం లేకుండా పోయింది. ఆదివాసీ సంఘం ఆదివాసీ కిసాన్ శ్రామిక్ సంఘటన్ దోపిడీకి వ్యతిరేకంగానూ, న్యాయం కోసమూ పోరాడుతూంది. శతాబ్దాల తరబడి "మానవతావాదం" సాధించిన ప్రగతికన్నా గత మూడేళ్ళగా ఆదివాసులు పోరాడి సాధించుకున్న ఫలితాలు అనేకం.

ఆదివాసులు, దళితులు, రైతాంగం యింకా అణచివేతకు గురవుతున్న ప్రజలందరూ ఏనాడైతే వారి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధమై నిలుస్తారో ఆ క్షణమే బాబా లాంటి "మానవతావాదులు" పొగాడంబరమైన మాటలతోనూ, ఆకర్షణీయమైన నినాదాలతోనూ ఆ పోరాట ప్రజలను, వారిసమస్యలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తారు. మనం తీవ్రంగా వ్యతిరేకించాల్సింది, ఎండకట్టాల్సింది ఈ కుట్రను మాత్రమే. వారి మాటలు, నినాదాలు వారికి స్వలాభాన్ని, ప్రతిష్టను పెంచడానికి పనికొస్తాయేమోకాని అణగారిన జీవితాల్లో మార్పుతేజాలవు. ఇవ్వాళ మనముందున్న సమస్య 'నీతిసూత్రాల'ను వల్లించడం కాదు. ప్రజల నిజసమస్యలను తీసుకుని-వారి హక్కుల గురించి, న్యాయం గురించి వారంతటవారు పోరాటానికి సిద్ధమయ్యేలా వారిని చైతన్యవంతం చేయడమే.

—ఏకనాథ్ సాల్వే

ఊడువానికే భూమి షాజిలే


—ప్రాణహిత

ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరం వైపున ఉన్న ఆదిలాబాద్‌లో మూడు సంవత్సరాల కింద ఒక సంఘటన జరిగింది. అది మామూలు సంఘటన కాదు. సుమారు 100 మంది గిరిజనులను బలితీసుకున్న దారుణమైన సంఘటన అది.

ఇటీవలే ముఖ్యమంత్రి శాసనమండలిలో ఒప్పుకొన్నట్లుగా ,గోండులకు తరతరాలనుండి దొరకని సామాజిక న్యాయం' కొరకు గిరిజనులు సంఘటితపడి, 1981 ఏప్రిల్‌లో ఇంద్రవెల్లిలో ఒకసభ జరుపుకోవాలనుకున్నపుడు, దానిని భగ్నం చేయడంకోసం 'బుల్లెట్లకు నియమాలు' లేకుండ పోలీసులు కాల్పులు జరిపిన సంఘటన అది. అప్పటివరకు 'ఆదివారం అనుబంధాలలో' సచిత్ర వ్యాసాలకు అక్కరకు వచ్చే గిరిజనులు ఆ తరువాత మన బూర్జువా పత్రికలకు వార్తలను అందిస్తూ వచ్చారు.

ఇంద్రవెల్లి సంఘటన జరిగినప్పటినుండి గిరిజనుల జీవితాన్ని, పోరాటాన్ని చిత్రించే సాహిత్యం అనేక ప్రక్రియల రూపంలో వచ్చింది. అందులో కథలు ఆరు మాత్రమే వచ్చాయి. వీటిలో 'సాహూ' రాసిన కథలు మూడు. (రక్తపింజెర్, కిసింగార్ పెంతా. మరట్ తుడుం పాయానా)'గోదావరి'రాసిన'తుడుం' ఇవిముద్రితాలు. ఒకటి అముద్రితం మరొకటి ఈ సంచికలోనే అచ్చయింది. ఈ ఆరుకథలకు, అవి వెలువడినకాలాన్ని బట్టి చూచినపుడు, గిరిజనుల జీవిత పోరాటాలను చిత్రించడంలో ఒక క్రమం కనిపిస్తుంది. అయితే ఈ క్రమం ఎక్కువగా వైవిధ్యం కలది కాదు. గిరిజనులు సంఘటితపడి పోరాటదశకు మళ్ళిన దశను గురించే ఈ కథలు చెపుతాయి. వాళ్ళ పోరాటాన్ని చేపట్టడానికి తప్పనిసరియైన కారణాలను చెప్పడంలోనే వాళ్ల జీవితం చిత్రింపబడింది. ఈ దశలో జీవితాన్ని, పోరాటాన్ని విడదీసి చెప్పడం సాధ్యమూకాదు, కోరదగిందీ కాదు.

ఇంద్రవెల్లి సంఘటనకు వెంటనే కలిగిన ప్రతిస్పందనగా వచ్చిన కథ 'తుడుం.' ఇది చాల చిన్న కథ."తెల్లబట్టలోల్ల"తోపాటు"కాకీబట్టలోల్లు" నక్సలైట్లను గాలించడం కొరకు ఒక గిరిజన గూడెంలోకి వచ్చినపుడు గిరిజనులు సామూహికంగా వాళ్లను పారదోలడమనే అంశం మాత్రమే ఈ కథలో ఉండడం వలన గిరిజనుల జీవిత చిత్రీకరణ జరగలేదు. "తెల్ల బట్టలోల్లు" గిరిజనుల "అభివృద్ధి" కొరకు సర్కారు మంజూరు చేసిన డబ్బుగురించి చెప్పి,




రాడికలోల్లు సర్కారుకు శత్రువులని, వాళ్లను పట్టివ్వాలని అంటారు. గోండులకు న్యాయం చేస్తానని, హింసావాదుల భరతం పడతానని ముఖ్యమంత్రి కూడ అంటున్నాడు. 'గిన్నేండ్లు మేం సచ్చినమో బతికినమో సూడని సర్కారుకు దయెట్ల గలిగిందోంట' అని ఒక గిరిజన స్త్రీ ఈ కపటత్వానికి సరియైన జవాబునే ఇచ్చింది. సంస్కరణల పేరిట సర్కారు మేకలనో, ఎడ్లనో ఇచ్చినప్పటికి భూమి లేనప్పుడు అవి నిష్ప్రయోజనమని భూమి సమస్యను ముందుకు తెచ్చినందుకు ఆ గిరిజనులంతా నక్సలైట్లుగా మారిపోతారు. నక్సలైట్ అనే పదం వింటే పోలీసులలో కలిగే ప్రతిస్పందన తుపాకులు ఎక్కుపెట్టడం. "చిలికి చిలికి గాలివాన"గా మారి కాల్పుల వరకు వెళుతుంది కథ. పేదప్రజలు సామాజిక సమస్యల పరిష్కారానికి సంఘటిత పడిన ప్రతిచోట, సామాజిక న్యాయం గురించి చేసే "గంభీరోపన్యాసాల"తో నిమిత్తం లేకుండ, ప్రభుత్వం అణచివేతకు, కాల్పులకు పూనుకుంటుంది. అయితే ఈ కథలోని గిరిజనులకు ఇంద్రవెల్లి అనుభవం ఉన్నది. వాళ్లు పారిపోలేదు. కాల్పులను కూడ ధిక్కరించి "కాకిబట్టలోల్ల"ను "తెల్లబట్టలోల్ల"ను తరమివేస్తారు. ఇరవై గుడిసెలైనా లేని గూడెంలోకి అయిదారువందలమంది గిరిజనులు పోగయి, సంఘటిత పడడానికి ఇక్కడ వాళ్లకు సాంప్రదాయికంగా పోరాట సంకేతమయిన డుడుం ఉపయోగపడుతుంది.

రక్తపింజెర కథలో గిరిజనులు అనుభవిస్తున్న దారిద్ర్యం, గిరిజనుల శ్రమదోపిడి మనస్సుకు హత్తుకొనేలాగ చక్కగా చిత్రించబడింది. రక్తపింజెర వంటి విషప్రాణులు, క్రూరజంతువులు గిరిజనులను కాటువేసి దెబ్బతీసినట్లుగా కాంట్రాక్టర్ల వంటి నాగరికత నేర్చినవారు గిరిజనుల శ్రమను దోపిడీ చేయడంద్వారా వాళ్ల బతుకులను నాశనం చేస్తున్నారు. తమను కాటువేసే విషప్రాణులను చంపి వేసినట్లుగా, సమ్మె పోరాటంతో గిరిజనులు దోపిడీని ఎదుర్కొంటారు. ఈ కథలో గిరిజనుల జీవితాన్ని, పరిసరాలను, ప్రకృతిని సన్నివేశానికి, పాత్రల మనస్తత్వానికి అనుగుణంగా వర్ణించిన తీరు గమనిస్తే రచయితకు వాళ్ల జీవితంతో, పరిసరాలతో సన్నిహిత పరిచయంతోపాటు, మంచి పరిశీలనాశక్తి ఉన్నట్లు తెలుస్తుంది. సిడాం శిత్రు మల్కుబాయిల కుటుంబం గిరిజన కుటుంబాలకు ప్రతీక. తీవ్రమయిన చలి కాలంలో కూడ కప్పుకోవడానికి బొంతపేలిక ఉండదు. ఎండ, వాన, చలి-ప్రకృతి లోని ఏ తీవ్రతనూ తట్టుకోవడానికి వీలుగా లేని గుడిసె. గుడిసెను బాగు చేసుకోలేక కాదు. బాగుచేసుకుంటే ఫారెస్టు చౌకీదార్ వస్తాడు. కోడి, డబ్బు, దెబ్బలు-మూడూ తప్పవు. సముద్రం తలాపుకు పెట్టుకొని సావ నీళ్ల కేడ్సినట్టే ఉంటుంది గిరిజనుల

బతుకు. నాగరికత నేర్చినవాళ్ల అనేకానేక అవసరాలను తీర్చే వస్తువుల్లో గిరిజనుల శ్రమ ఉంటుంది. ఆ శ్రమ తప్పకుండా దోపిడీ చేయబడిన శ్రమ. శ్రమను దోపిడీ చేయడంలోనే కాదు, గిరిజనులతో వ్యవహరించే సమయంలో కూడ నాగరికులు తమ పశుత్వాన్ని ప్రదర్శిస్తారు. "ఇది మనిషిని మనిషి వంచించి దోపిడీ చేసే "మాయాప్రపంచం" అని ముఖ్యమంత్రి ఒప్పుకుంటున్నారు. ఈ "మాయాప్రపంచం" నాగరిక ప్రపంచమే, వర్గ సమాజంలో నాగరికత ఎంత అభివృద్ధి చెందితే వంచన, దోపిడీ కూడ అంత అభివృద్ధి చెందుతాయి. ఈ కథలోని బొంగుపని సూపర్‌వైజర్ ఇటువంటి వంచనకే పూనుకుంటాడు. ముందు అనుకున్న ప్రకారం కూలిరేటు ఇవ్వడానికి సూపర్‌వైజర్ నిరాకరించడంతో సమ్మె మొదలవుతుంది. సమ్మెలో "సంఘం" ప్రవేశిస్తుంది. పోలీసులూ ప్రవేశిస్తారు. అయితే న్యాయాన్యాయాలు విచారించడానికి, చర్చించి సమస్యను పరిష్కరించడానికి మాత్రం పోలీసులు రారు. మనది ఎంత పెద్ద "ప్రజాస్వామికదేశం" అయినా భూస్వామ్య నిరంకుశపద్ధతుల్లో ఆందోళనను అణచివేయడమే పోలీసులు నిర్వహించే ఒకే ఒక "విధి". పోలీసుల దాడిని గిరిజనులు మౌనంగా భరించినట్లు కనిపించినా, ఆ మౌనం రగుల్కొంటున్న మౌనం. ఇప్పుడు వాళ్ళకళ్లల్లో వందల సంవత్సరాల యమబాధలు, గాయాలు, మచ్చలు. ఇప్పుడు వాళ్ళకళ్లల్లో పోలీసులు చేసిన దౌర్జన్యం రేపిన కోపం. ఇప్పుడు గిరిజనుల మౌనంలో తమ గాయాల చరిత్రకు బదులు తీసుకోవాలనే ప్రతీకారం.

"రక్తపింజెర" కథ గిరిజనుల దయనీయమైన జీవితాన్ని చిత్రించగా "కిసింగార్ పెంతా" (అడివంటుకుంది) కథ వాళ్ల దుర్భరమైన దారిద్ర్యాన్ని, కరువును చెప్పి, ఆ పరిస్థితుల్లోనే వాళ్ళు ఏ విధంగా పోరాటానికి సిద్ధమయ్యారో చిత్రిస్తుంది. నిజానికి "కిసింగార్ పెంతా" సౌలభ్యం కోసమే ఇక్కడ కథ అని చెప్పబడుతున్నది. ప్రక్రియాదృష్టితో చూచినప్పుడు అది కథ కాదు. కథనాత్మకంగా సాగిన రిపోర్టు. ఇంద్రవెల్లి తర్వాత యదార్థ జీవితదృశ్యాలను చిత్రించిన శక్తివంతమైన "కథాగీతికల" సంపుటి అది.

ఇంద్రవెల్లి సంఘటన తాను చరిత్రాత్మకమై, చరిత్రను తవ్వడానికి, తల పోసుకోవడానికి కావలసిన ప్రేరణను ఇచ్చింది. గిరిజనులు తాము తరతరాలుగా అనుభవిస్తున్న దారిద్ర్యాన్ని, దౌర్జన్యాలను, అవమానాలను, వాటికి వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటాలను, చేసిన త్యాగాలను, పొందిన విజయాలను నెమరు వేసుకొన్నారు. కొమురం భీము వారసత్వాన్ని వాళ్ళు గుర్తుచేసుకొంటున్నారు. అయితే ఇవ్వాళ గిరిజనులు చేస్తున్న పోరాటం కొమురం భీము కాలం నాటి పోరాటం



నాగోబా దేవాలయం

వంటిదికాదు. రూపంలోనూ, స్వభావంలోను నాలుగు దశాబ్దాల అభివృద్ధితో పరిణామం చెంది శాస్త్రీయ దృక్పథంతో, సరియైన లక్ష్యంతోసాగుతున్న పోరాటంఇది, ఇంద్రవెల్లి పోరాటచరిత్రను ముందుకు తెచ్చి,పోరాటాన్ని ముందుకు తీసుకుపోతున్నది.

గిరిజనుల సమస్య ప్రధానంగా భూమి సమస్య. ఆ భూమి కొరకే కొమురం భీము నాయకత్వంలో గిరిజనులు పోరాటం చేసారు. ఆ పోరాటంలో భీము, తదితరులు ప్రాణాలు పోగొట్టుకున్నా, గిరిజనులకు భూమి దక్కింది. పన్నులు రద్దయినాయి. అయితే ఈ స్థితి ఎక్కువకాలం నిలువలేదు. 'తాతలనుండి సాగుచేసుకుంటున్న భూములు వడ్డీ వ్యాపారులు, పెత్తందార్ల చేతులలోకి వెళ్ళాయి. అడవులు నరికి వ్యవసాయం చేసుకుందామంటే అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నారు. ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న భూమి నుండి ప్లాంటేషన్ పేరుతో పిచ్చిమొక్కలు నాటడానికి గిరిజనులను బలవంతంగా ఫారెస్ట్ అధికారులు ఖాళీ చేయిస్తారు. అడవి నరికి సాగుచేయడానికి పట్వారీకి, జంగ్లాతు వాళ్లకు లంచాలు ఇచ్చి, ప్రతిసంవత్సరం తహసీల్ కడుతున్నా, గిరిజనుల చెమటతో, రక్తంతో నిండిపోయిన ఆ భూమి చివరకు వాళ్లకు దక్కదు. లంచాలు మేపడానికి మాత్రం గిరిజనులు తమ మేకలను, పశువులను పోగొట్టుకుంటారు. ఇది ఒక్కసారితో తేలిపోయే వ్యవహారంకాదు. జంగ్లాతువాళ్ళు తమకు తోచినప్పుడల్లా మళ్లీ మళ్లీ లంచాలు అడుగుతారు. గిరిజనులు

ఈ బాధలన్నీ అనుభవిస్తూ వచ్చారు. వాళ్ల జీవితాల్లోకి ఇంద్రవెల్లి పోరాటాన్ని తెచ్చిన తరువాత మాత్రం 'మనం పైస లిచ్చుకుంట బతకలేం... ఉట్నూరుల.... గిట్లనె భూముల్ని గుంజి ప్లాంటేషన్ చేసింద్రట.... మన్లాగా భూముల కోసం వాళ్ళు లంచాలు ఎన్ని గుమ్మరిచ్చిన కాలే.... అందరొక్కటయింగ్లు ప్లాంటేషన్‌లు నరికింద్రట.... అడ్డమొచ్చిన చాకోల్ల, పోలీసోల్ల బాయిలు, పిల్లలు అందరు కల్సి గెదిమింద్రట. మనం కూడా గట్లనే చేద్దాం.... 'అని నిర్ణయించుకున్నారు.

ఈ నిర్ణయం గిరిజనుల ఆచరణలో కనిపించిన తరువాత గిరిజనుల కదలికలను పోలీసులు అనుమానంతో, భయంతో చూడడం మొదలుపెట్టారు. ఈ కథలో గిరిజనులు వానలు పడాలని పెరుసపేను (పెద్ద దేవుడు)ను కొలిచి, సాంప్రదాయికంగా తెలుపు, ఎరుపు జెండాలను ఎగురవేసినందుకు పోలీసులు వచ్చి ఎర్రజెండాలో చంద్ర వంకను చూచి కొడవలి అనుకుని సుత్తిగుర్తు ఏదని ప్రశ్నించారు. ఇటీవల కేస్లాపూర్ లోని నాగోబా దేవాలయం మీద సాంప్రదాయికమైన రగల్ జెండాను ఎగురవేయగా, గిరిజనులు "విదేశీ జెండాను" ఎగురవేసి, ప్రత్యేకస్వతంత్రదేశాన్ని ప్రకటించుకున్నారని శాసనసభలో "ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం" తెగ ఆందోళన పడిపోయారు. మన "ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వానికి" గిరిజనుల గురించి అజ్ఞానం, భయం, వ్యతిరేకత ఆ స్థాయిలో ఉన్నాయి.

కేస్లాపూర్‌లోని నాగోబా దేవాలయంవద్ద ప్రతి సంవత్సరం గిరిజనులు జాతర జరుపుకుంటారు. జాతర సందర్భంగా గిరిజనుల సమస్యలు అధికారులు తెలుసుకోవడానికి ఒక దర్బారు జరుగుతుంది. ఇంద్రవెల్లి సంఘటన తరువాత కేస్లాపూర్ జాతర "ఖద్దరుబట్టల, ఖాకీ బట్టల జాతరయింది...యమభటులు ముందుండగా .. సర్కారు ధర్మరాజులు దర్బారు"ను నిర్వహిస్తున్నారు. వచ్చిన వాళ్లంతా గిరిజనులకు భూములిస్తామని, అప్పులిస్తామని పెద్దపెద్ద ఉపన్యాసాలు ఇస్తారు. పత్రికలు గిరిజనుల అభివృద్ధి గురించి రాస్తాయి. ఇదంతా గిరిజనుల పోరాటాన్ని దెబ్బతీయడానికి జరుగుతున్న "జాతర". కాని గిరిజనులు "పోరాటం ద్వారానే ప్రతీదీ జరుగుతుంది అనే సత్యం తెలుసుకున్నారు."

పోరాటం తీవ్రమయిన కొద్దీ అణచివేత పెరుగుతుంది. అణచివేత మళ్లీ పోరాటాన్ని తీవ్రతరం చేస్తుంది. ఈ క్రమం పోరాటంలో ఒక ఉన్నతమైన దశను తెస్తుంది. ఒక కొత్తరూపంలో మరింత పెద్దపోరాటం చేయాలనే ఆలోచన, అవసరం కలుగుతాయి. ఈ ఆలోచనను చెప్పిన కథ "మరట్ తుడుం పాయానా" (మనందరం తుడం గొట్టాలే)

పోరాటమార్గం చేపట్టకముందు సాగుచేసుకుంటున్న భూమిలో పిచ్చితుమ్మలు నాటడానికి జంగ్లాతువాళ్లు వచ్చినపుడు ప్లాంటేషన్ చెయ్యద్దు మా సాగుభూముల్ల

అన్నందుకు రక్తాలుకారంగ కొట్టి, గుడిసెల్ని కాల్చి, ఇండ్లు పీకి, పెంటజేసి, కుండలు పలుగ్గొట్టి, ఇంకా ఇంకా ఎన్నో చేసిండ్లు'. పోరాటం గిరిజనులకు గుండె నిబ్బరాన్ని కలిగించింది. తమ భూమిని, జీవితాన్ని కాపాడుకోవాలంటే సంఘటితపడి పోరాటం చేయకతప్పదు. 'భూములు లేంది బువ్వలేదు. బువ్వ లేంది బతుకుడెట్లు ? సర్కారోడు తుపాకులతోని గాల్పించి, మీదికెల్లి గుడిసెలమీదికి పెంకలంటడు, బోరింగంటడు, దారులంటడు, తొవ్వలంటడు'. ఇటువంటి సర్కారుతో పోరు చేయడానికి 'బాండే' (తుపాకి) అవసరం. 'మకట్ బాండే పియ్యానా' (మనమే తుపాకీ పట్టాలే.)

ఒక అముద్రిత కథ 'బాండే భద్రం'. గిరిజనులు తమ మీద దౌర్జన్యం చేయ డానికి వచ్చిన భూస్వామి చేతిలోని బాండేను లాక్కోవడం ఈ కథలోని ఒక అంశం. ప్రభుత్వం గిరిజనులనుండే కొంతమందిని వేరుజేసి, ఉద్యోగాలిచ్చి, గిరిజన పోరాటాల పైన దాడికి పంపడం ఇందులోని మరొక అంశం. [1]

'రగల్ రాజ్జెం మైసివాకట్' (ఎర్రరాజ్జెం గెల్చివస్తాం) కథలో గిరిజనుల పోరాటంలోని మూడు సంఘటనలు చిత్రించబడ్డాయి. రెండింటిలో భూమి సమస్య కని పిస్తుంది. ఈ సమస్య ఒకచోట ఒక విధంగానూ, మరొకచోట మరొక విధంగానూ తలెత్తినందున ఆ సమస్యను పరిష్కరించుకోవడానికి చేపట్టిన మార్గాలుకూడా భిన్నంగా ఉన్నాయి. మరొక సంఘటనలో ప్రధానమయినది కూలీరేటు సమస్య.

గిరిజన గిరిజనేతర సమస్యగా రూపం తీసుకున్న భూమి సమస్య ఎలా తలె త్తిందో కథ మొదట్లో చెప్పబడింది. ఈ భూమి సమస్య తలెత్తిన గిరిజనగూడెం పూర్తిగా గిరిజనగూడెం కాదు. మరాఠా, లంబాడీ, తెలుగు రైతులుకూడ నివసిస్తున్న గిరిజనగూడెం అది. అంతమాత్రమే అయితే సమస్య ఉండేదికాదు. అక్కడొక తురక మక్తేదార్ వున్నాడు. అతని వెనుక ప్రభుత్వం, చట్టాలు, పోలీసులు

---

[1] ప్రభుత్వ అధికారిగా మారిన ఒక గోండు భూమికొరకు గిరిజనులు చేస్తున్న పోరాటాన్ని గిరిజన గిరిజనేతర సమస్యగా చిత్రించి పక్కదారి పట్టించాలని చూసి నపుడు, మీరూ నేనూ ఒకటే అని వర్గసంకర తత్వాన్ని నూరిపోసి, గిరిజనులలో భ్రమలు కల్పించి, పోరాటాన్ని నీరుగార్చాలని ప్రయత్నించినపుడు ఈ పోరాటంలో అతని స్థానమెక్కడో, తమ స్థానమెక్కడో స్పష్టంగా చెప్పి, గిరిజనులు తమ చైతన్యాన్ని నిరూపించుకుంటారు.

వున్నారు. గిరిజనులు అడవి నరికి, రెక్కలు ముక్కలు చేసుకుని భూమిని సాగు చేయడానికి అనుకూలంగా మార్చిన తరువాత మక్తేదార్ వచ్చి ఆ భూమి తన మక్తాలోది అంటాడు. ఇది ఎప్పుడూ జరిగే వ్యవహారమే. లగంధారీ (కౌలు) చట్టం వచ్చినప్పటికీ గిరిజనులే నష్టపోయారు. వాళ్ల భూములన్నీ, కావలసినన్ని లంచాలు పెట్టిన తరువాతనే అయినా, మరాఠీలకో, లంబాడీలకో దక్కాయి. ఇది పేదరైతుల మధ్యనే వైరుధ్యాలను సృష్టించింది. వైరుధ్యాలను తొలగించి, మక్తేదార్‌తో పేదరైతులందరు ఉమ్మడిగా పోరాటం చేయడానికి పౌరకలసారు ప్రయత్నించినపుడు, గిరిజనులను ఆదుకోవడానికి కాక, వాళ్లమీద పౌరకలసార్ల ప్రభావాన్ని పోగొట్టడానికి, గిరిజన గిరిజనేతర సమస్యను సృష్టించి పక్కదారి పట్టించడానికి ప్రభుత్వం చట్టం చేసింది. ఇప్పుడు ఆదిలాబాద్‌లో గిరిజన రైతాంగం చేస్తున్న భూమి పోరాటాన్ని ప్రభుత్వం, పాలకవర్గ పత్రికలు గిరిజన గిరిజనేతర సమస్యగా తమ శాయశక్తులా ప్రచారం చేస్తున్నవి. ఈ ప్రయత్నాలను ఎదుర్కొని పౌరకలసారు పేద రైతాంగాన్నంతా కూడదీసి మక్తేదార్‌మీద పోరాటానికి సిద్ధం చేస్తాడు. ఇక్కడ ప్రజలమధ్య తలెత్తిన మిత్రవైరుధ్యాలను పరిష్కరించడంలో పౌరకలసారు చాకచక్యముతో వ్యవహరిస్తాడు. అయితే శత్రు వైరుధ్యాన్ని తన పాత్రలద్వారా వివరించడానికి రచయిత తగినంత కృషి చేయలేదు.

సాత్నాల ప్రాజెక్టు ముంపులో భూములను కోల్పోతున్న గిరిజనులు నష్టపరిహారం అడుగుతూ ప్రభుత్వంతో తలపడతారు. ఇది ఈ కథలో చిత్రించిన మరొక భూమి సమస్య. నిజానికి గిరిజనులకు నష్టపరిహారం చెల్లించడం కంటె ప్రభుత్వానికి ముఖ్యమైన సమస్య పౌరకలసార్ల ప్రభావంతో గిరిజనులు సంఘటితపడి పోరాటానికి తలపడడం. 'సర్కారా ? అన్నీ యిస్తదా ? గుడిసెలే సక్కగలేవు. అడివిల వానం పెండె ముడితె గుడిసెపట్టి (పన్ను) లాప్ లాప్ మంటదు మీ సర్కారు సైకిదారు. మీరు పెంకలిస్త మంటరు, నెత్తిల కప్పుకోనా ? మీరు మేకలిస్తే జంగ్లాతు అమీను కోస్కతినకొంటబోతడు. మీరు పట్టాలిస్తనని మాతో నంటరు. మక్తేదార్లకు అబాలతుల కాయిదాలిస్తరు. మీ సర్కారిచ్చే ఇనాములు ఇందర్‌వెల్లిన చూస్తిమి' అంటూ గిరిజనులు ప్రభుత్వాధికారులను నిలదీసి అడిగినందుకు ఫలితం వాళ్ళమీద పోలీసుమూకల దాడి. ఒకవైపు ఇటువంటి దాడులు చేస్తూ ప్రభుత్వమూ,

'ప్రజాప్రతినిధులు' శాసనమండలిలో గిరిజనులమీద 'తీవ్రవాదుల ప్రభావం' గురించి గగ్గోలు చేస్తుంటారు.

ఈ కథలోని మూడు సంఘటనలమధ్య గాఢమైన బంధంలేదు. ఇది కథలో ముఖ్యమైన లోపం. భూమి సమస్యను చిత్రించిన రెండు సంఘటనల్లోనూ వున్న కొన్ని పాత్రలు సమానం కావడమనే అంశం తప్పితే ఆ రెండింటి మధ్య ఖచ్చితమైన సంబంధం కనిపించదు. నిజానికి ఈ రెండూ వేరు వేరుగా చిత్రించవలసిన సంఘటనలు. కూలీరేటు సమస్యను చిత్రించిన సంఘటన కథలో తరువాత జరుగబోయే పోలీసుల దాడిలో కొంత సంబంధాన్ని కలిగి వున్నదని అనుకోగలగడం తప్పితే మిగిలిన కథకు దీనికి సంబంధం లేదు. కనీసం పై రెండు సంఘటనల్లో సమానంగా కనిపించిన పాత్రలు కూడ ఇందులో లేవు.

ఇటీవల ముఖ్యమంత్రి గిరిజన గూడెంలో హోంగార్డులుగా పనిచేస్తూ, వాళ్లతో సంబంధాలను పెట్టుకుని, వాళ్ల సమస్యలను ప్రభుత్వదృష్టికి తీసుకురావడం కొరకు కొంతమంది యువకులకు రైఫిల్ శిక్షణ, లాఠీఛార్జ్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రకటించాడు. గిరిజనులతో సంబంధం కలిగి ఉండి, వాళ్ల సమస్యలను తెలుసుకోవడానికి ఈ శిక్షణల అవసరమేమిటో అర్థం కాని విషయం. అభివృద్ధి పేరిట, సంస్కరణల పేరిట ప్రభుత్వం చేయదలచుకున్న పని ఏమిటో కొంచెం ఆలోచిస్తే సులభంగా తెలిసే విషయమే.

నిజానికి గిరిజనుల సమస్య ఏమిటో, వడ్డీ వ్యాపారులు, భూస్వాములు, ఫారెస్టు అధికారులు, పోలీసు వాళ్లు గిరిజనులను ఏ విధంగా దోపిడీ దౌర్జన్యాలకు గురి చేస్తున్నారో ప్రభుత్వానికి బాగా తెలిసిన విషయం.[1] నిన్న మొన్నటి వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ (ఐ) వాళ్లకు కూడ ఈ విషయాలన్నీ తెలుసు. ఇటీవల శాసనమండలిలో ఆ రెండు పక్షాల వాళ్లు మాట్లాడిన మాటలే అందుకు నిదర్శనం. 'చింతపండు వారి వద్ద నుండి కిలో రూపాయికి కొని తొమ్మిది రూపాయలకు' అమ్ముతున్నారని, 'గోండులు అక్కడ కిలో కంటే ఎక్కువ ఇప్పపువ్వు నిలవ చేసుకుంటే పోలీసులు తన్ని ఎన్నో హింసలు పెట్టారు. అయితే ధనవంతులు లక్షల ఖరీదు చేసే

1) గిరిజనులను ఉద్ధరించడానికి ప్రభుత్వం నెలకొల్పిన గిరిజన కార్పొరేషన్లు కూడ యథాశక్తిగా ఈ దోపిడీలో పాలు పంచుకుంటాయి.

సమీక్షా వ్యాసం :

పోరాట వర్తమానంలో కొమురం భీం

—సురా

ఈ తిరుగుబాటుకి కారణాలు....మనకనవసరం....ఎందుకంటే విజయం తప్ప మరేదీ తిరుగుబాటుకి సమర్థనకాలేదు. విజయవంతమైన తిరుగుబాటు విప్లవం అవుతుంది. గెలుపొందిన తిరుగుబాటుదారులు కొత్త ప్రభుత్వాలనేర్పరుస్తారు. కొత్త ప్రభుత్వం తన ఉనికికి కారణమయిన వాళ్ళని ప్రశ్నించదు. అందుకే విజయవంతమయితే తప్ప తిరుగుబాటు కారణాలతో—అవి ఎంత సకారణాలయినా—మనకు నిమిత్తం లేదు.

కింగ్ ఎంపరర్ వర్సస్ రంపపితూరీ అని పిలవబడే (మన్యం తిరుగుబాటుదారులపై బ్రిటిష్ ప్రభుత్వం నడిపిన కుట్ర) కేసులో 1923, జూన్ 25న వాల్తేరులోని ఏజెన్సీ డివిజన్ అదనపు జిల్లా జడ్జి అర్నాట్ దొరగారు ముద్దాయిలను శిక్షిస్తూ యిచ్చిన తీర్పులో ఈ గొప్ప చారిత్రక సత్యాన్ని చెప్పారు. ఆయన చెప్పింది రైటే. ప్రజా పోరాటాలు తమ రాజ్యాధికారాన్ని ఎంతవరకు ప్రశ్నిస్తున్నాయన్న విషయం తప్ప పాలకులకి ఆ పోరాటాల కారణాలతో నిమిత్తం లేదు. ఐతే ఈ కారణాలతో నిమిత్తం లేకపోవడానికి వాళ్ళకి బలవత్తరమయిన కారణాలే ఉన్నాయి.

కలప తీసుకుపోతుంటే చూస్తూ ఊరుకున్నాం' అని ముఖ్యమంత్రి అంగీకరించాడు.[1] 'బంక (జిగురు)ను గిరిజన సంఘాలు అమ్మి దోపిడీ చేస్తుంటే మీరేం చేశా'రని కాంగ్రెస్ (ఐ) సభ్యుడు రోశయ్య ఆరోపణ చేస్తాడు గాని తమ ప్రభుత్వం ఉండగా ఏం చేసారంటే ఎవరు సమాధానం చెపుతారు ? వీళ్ళందరూ శాసనమండలిలో తమ ఆవేదనను వెలిబుచ్చడం కేవలం ఒక దొంగ నాటకం. తన 'పాపులారిటీ'ని పెంచుకోవడానికి 'గంభీరోపన్యాసం'తో గిరిజనుల మీద జరుగుతున్న దోపిడీ దౌర్జన్యాల గురించి శాసన సభలో ముఖ్యమంత్రి కారుస్తున్న 'మొసలి కన్నీరు'ను కూడ సహించలేని స్థితికి కమ్యూనిస్టు నామధారులయిన రివిజనిస్టులు దిగజారినారు. వీళ్ళందరి వర్గ ప్రయోజనం ఒకటే. అది పాలకవర్గ ప్రయోజనం. ఆ ప్రయోజనాన్ని ఇదివరకంత సాఫీగా నెరవేర్చుకోలేనపుడు ఫాసిస్టు అణచివేత ప్రయోగించబడుతుంది. దాని వలన కూడ ఫలితం లేనపుడు వంచనతోనూ, కుట్రతోనూ కూడిన సానుభూతి వాక్యాలు, 'అభివృద్ధి కార్యక్రమాలు' ముందుకు వస్తాయి. ఈ ప్రలోభాలకు లోను గాకుండా పీడితవర్గ చైతన్యమే రక్షణగా ఉంటుంది.

28.3.1984

---

1) ముఖ్యమంత్రి నాచారం కుటీరానికి నాలుగు లారీల కలప ఏటూరు నాగారంనుండి వరంగల్ జిల్లా అప్పటి కలెక్టర్ జవహరీ, 'తెలుగుదేశం' పార్టీ అప్పటిఅధ్యక్షుడు శివాజీ కలసి దొంగరవాణా చేసారని ప్రజలు చెప్పుకున్నారు.

ప్రకృతి మానవుడికి ఇచ్చే సంపదను, మానవశ్రమను దోచుకుంటూ అదనపు విలువ సంపాదించుకునే వర్గాలే అంతిమ పరిశీలనలో సమాజంలోని అన్ని రంగాల లోనూ తమ ఆధిపత్యాన్ని, నియంతృత్యాన్ని ఏర్పరచుకుంటాయి. తరతరాల చెరసా లలలో ఆర్థిక రంగంలో సాగే ఈ దోపిడీ, రకరకాల తెరచాటులవెనుక ఉపరితల అంశాలలో కూడా కొనసాగుతుంది. ప్రజల భాష, కళ, సాహిత్యం, సంస్కృతి— అన్నీ పాలకుల దోపిడీకి గురవుతాయి. ఆయా దేశాలలో ఉత్పత్తి శక్తులకి, ఉత్పత్తి సంబంధాలకి మధ్య వైరుధ్యం తీవ్రస్థాయికి చేరుకున్న తర్వాత విప్లవం విజయవంత మయి రాజ్యాధికారంలో వర్గాలు మారుతాయి. సమాజంలో గుణాత్మక మార్పులు వస్తాయి. అప్పటిదాకా 'నిర్మించిన సామ్రాజ్యాలూ, ఏర్పరిచిన కృత్రిమ చట్టాలు ఇతరరేతర శక్తులు లేస్తే పేకమేడలై' పడిపోతాయి. పరస్పరం సంఘర్షించే ఈ శక్తు లలో పుట్టిందే చరిత్ర.

"తిరుగుబాటుకు కారణాలు తెలుసుకోవడమంటే" విస్తృత అర్థంలో ఈ సంఘర్షణ పరిణామ క్రమాన్ని తెలుసుకోవడమే. ఈ సంఘర్షణలో పతనమయ్యే శక్తులకూ, వర్గాలకూ ఈ క్రమాన్ని తెలుసుకోవడం వల్ల ప్రయోజనమేమీ లేదు. అందుకే తిరుగుబాటు కారణాలతో వాళ్ళకు నిమిత్తంలేదు. వాళ్ళకు పట్టే విషయమల్లా వాళ్ళ రాజ్యాధికారం మాత్రమే. కుట్ర అంటే "చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని సాయుధంగా కూలదోయడం" అని బ్రిటిష్‌వాడు భారతీయ శిక్షాస్మృతిలో నిర్వచిం చాడు. (అసలు బ్రిటిష్ ప్రభుత్వం చట్టబద్ధంగా ఏర్పడిందని ధ్వనింపజేయడమే ఓ పెద్ద కుట్ర.) అదే నిర్వచనాన్ని, అదే శిక్షాస్మృతిని మన దేశంలో పాలకవర్గాలు ఇవాల్టికీ అమలుపరుస్తున్నాయి. ఇక్కడ ముఖ్యమైన విషయం ఆయుధాలు పట్టడం కాదు, రాజ్యాధికారంకోసం ఆయుధాలు పట్టడం. బహిరంగంగా మెషిన్‌గన్‌లు పట్టుకు తిరుగుతున్న భింద్రన్‌వాలే మీదా, బీహార్ భూస్వాముల మీదా కుట్రకేసులు లేవు, ఉండవు. కుట్రకేసులు ఉండేదల్లా సాధారణమయిన బాణాన్ని తమ సాంప్రదాయంలో భాగంగా పట్టుకు తిరిగే గిరిజనుల మీదనే. ఎప్పుడయితే రాజ్యాధికారం ప్రధానమయిన దవుతుందో, అప్పుడు పాలకులకి తిరుగుబాటు కారణాలతో నిమిత్తం లేకుండా పోతుంది. అయితే రాజ్యాధికారంలో మార్పు చరిత్ర పరిణామక్రమంలో ఓ మైలు రాయి మాత్రమే.

ప్రజల ప్రతి చర్య రాజకీయ రూపాన్ని తీసుకున్నప్పుడు, ఆ పోరాటక్రమంలో అది ప్రజాజీవితంలోని అన్ని రంగాలలోనూ మార్పులు తీసుకొస్తుంది. ప్రజల భాష కొత్త వెలుగుల్ని చూస్తుంది. ప్రజల కళా సాహిత్యాలు కొత్త జీవితాన్ని ప్రతిఫలిస్తూ తిరిగి ఆ జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. కారణాలు తెలుసుకోవడమంటే ప్రజలకి మాత్రం అన్ని రంగాలలోనూ జరిగే దోపిడీ గురించి చైతన్యవంతులు కావడం. ఆ దోపిడీ చుట్టూ జరిగే సంఘర్షణాక్రమాన్ని గుర్తించడం తమ చరిత్రను తామే తిరిగి తెలుసుకోవడం.

ఐతే చరిత్ర రచన (హిస్టరియోగ్రఫీ) కూడ సమాజంలోని బౌద్ధిక కార్యకలాపాలలో ఒకటి. ఆ బౌద్ధికరంగం మీద ఏ పాలకవర్గాలు తమ ఆధిపత్యాన్ని ఏర్పరచుకుంటాయో, ఆ వర్గాలే ఆ చరిత్ర రచనను, దృక్పథాన్ని నిర్దేశిస్తాయి. అణగారిన ప్రజల కథలన్నీ అట్టడుగున పడి ఇతిహాసపు చీకటికోణంలోనే మిగిలిపోతాయి. ప్రజల్ని దోచుకునేవాళ్ళే ప్రజల చరిత్రను కూడా దోచుకుంటారు.

ఏ వర్గ పోరాటమయినా ఈ క్రమాన్నంతా తిరగదోడే క్రమమే. అందుకే పీడితప్రజల దృక్పథంతో చరిత్రను రాయదలచుకున్నవాళ్ళు, ఈ క్రమంతో, అంటే వర్తమాన వర్గ పోరాటంతో మాత్రమే ప్రారంభించాలి. ఇంక ఏ రకంగా చరిత్రను అధ్యయనం చేసే క్రమమయినా గతించిన సంఘర్షణలలో గెలుపొందినవాళ్ళ ప్రభావానికి గురికాక తప్పదు. ఈ గత సంఘర్షణల శ్మశానాలలో కూచునే మన విశ్వవిద్యాలయ అకడమిక్ రాబందులు చరిత్ర పేరుతో పాలకవర్గాల పుక్కిటి పురాణాల్ని ప్రచారం చేస్తున్నారు. వర్తమానంతో నిమిత్తం లేకుండా గతాన్ని పరిశోధిస్తున్నారు. కాని పీడిత ప్రజలకి గత వర్తమానాల మధ్య డిస్‌కంటిన్యుటీస్ లేవు. వాళ్ళకి చరిత్ర ఒక నిరంతరాయంగా సాగేక్రమం. వాళ్ళు ఆ క్రమాన్ని వర్తమాన వర్గపోరాటంలో భాగంగానే చూస్తారు.

పీడిత ప్రజల చారిత్రక దృక్పథంలో ఉండే ఈ విశిష్టతను తెలుసుకోదలచుకున్నవాళ్లు 'కొమురం భీము' నవల చదవాలి. ఆదిలాబాద్ చరిత్రను తెలుసుకోవాలి.

• • • •

1981 ఏప్రిల్ 20న ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు తాలూకాలో ఇంద్రవెల్లి గ్రామ పరిసర ప్రాంతాలలో గిరిజన రైతుకూలీ సంఘం ప్రథమ మహాసభపై పోలీ

సులు కాల్పులు జరపడంవల్ల సుమారు 60 మందికిపైగా మరణించారు. ఈ మారణ కాండతో దెబ్బతినకపోగా ఉద్యమం ఇంకా ముందుకే సాగి ఇటీవల తన రెండోమహా సభను దిగ్విజయంగా జరుపుకుంది. గత మూడు సంవత్సరాలలోనూ ఈ గిరిజనోద్యమం విస్తృతిలోనూ. నిర్మాణంలోనూ ఎంతగానో ఎదిగి పొరుగున ఉన్న మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ గిరిజన ప్రాంతాలకు కూడ పాకింది. అక్కడి ప్రజల జీవనాధారమయిన భూమి, అడవి రెండూ ఈ ఉద్యమానికి భౌతిక పునాది. ఆదిలాబాద్‌లో ఈ సంఘర్షణకు వందల సంవత్సరాల చరిత్ర ఉంది. మరుగునపడిన ఈ చరిత్రపై ప్రసరించిన వెలుగురేఖలు ఇంద్రవెల్లి కాల్పులు. కారణాలతో నిమిత్తంలేని పాలకులకి ఈ చరిత్రతో కూడా నిమిత్తం లేదు. అందుకే వాళ్ళకి ఇది కేవలం శాంతి భద్రతల సమస్యే. కాని ఈ పోరాటం భవిష్యత్తుతో తమ భవిష్యత్తుని ముడివేసుకున్న వాళ్ళకి ఈ చరిత్రను తెలుసుకోవడం, ఈ కారణాలని పరిశోధించడం, ఆసక్తికరమయిన విషయం మాత్రమేకాదు, ఒక అవసరంకూడా. వాళ్ళకి గడచిన చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే.

గోండ్వానా – పైనుండి భూస్వామ్యం :

ప్రస్తుత ఆదిలాబాద్ ప్రాంతం ఒకప్పటి గోండ్వానాలో భాగం. దక్షిణాన గోదావరి నదీతీరం నుంచి ఉత్తరాన వింధ్యపర్వతాల దాకా వ్యాపించిన ప్రాంతానికే వందల సంవత్సరాల క్రింద గోండ్వానా అని పేరు. ప్రస్తుత భాషలో చెప్పుకోవాలంటే మధ్యప్రదేశ్‌లో నర్మదానదీతీరాన ఉన్న బెతుల్, చింద్వాడ, సిమోని, మండ్‌లా జిల్లాలు, దిగువన దుర్గ్, రాయపూర్, బస్తర్ జిల్లాలు (ఛత్తీస్‌ఘర్), మహారాష్ట్రలో యవత్ మల్, చాందా, గడ్‌చిరోలి జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ జిల్లా గోండ్వానా కిందికి వస్తాయి. గోండులే కాక ఈ ప్రాంతంలో అనేక ఇతర గిరిజన తెగలున్నాయి. (ఉదాహరణకు ఆదిలాబాద్‌లో పరధాన్లు, కొలామ్‌లు, నాయక్ పోడులు). గోండు గిరిజనులలోకూడా రకరకాల తెగలున్నాయి. ఆదిలాబాద్‌లో కోయతూర్ గోండ్లు, మహారాష్ట్రలో మరియ గోండ్లు, మధ్యప్రదేశ్‌లో కొండమరియ గోండ్లు మొదలయిన ఈ గోండు తెగలలో ఆచార వ్యవహారాలలోనూ, భాషా సంస్కృతులలోనూ ఎంతో వైవిధ్యం ఉంది. ఐనా ఈ సమూహాలన్నింటినీ కలిపి 'గోండ్లు' అని ఒకే పేరుకింద వ్యవహరిస్తుంటారు. వీళ్ళు సుమారు యాభై లక్షల మంది ఉన్నారని 1972 జనాభా లెక్కల అంచనా.

ఈ గోండ్వానా చరిత్రగురించి తెలిసింది చాలతక్కువ. ఆ రాణీ ప్రేమపురాణం, ఈ ముట్టడికైన ఖర్చు మాత్రమే చరిత్రగా అధ్యయనం చేసే చరిత్ర శాస్త్రవేత్తలు

కూడా గోండురాజ్యాల చరిత్రను పరిశీలించినట్టులేరు. వెరియర్ ఎల్విన్ (మరియా అండ్ దెయిర్ ఘోటుల్), హేమెన్‌డార్ఫ్ (ది గోండ్స్ ఆఫ్ ఆదిలాబాద్) లాంటి మానవ పరిణామ శాస్త్రవేత్తలు, విల్ఫ్రిడ్ గ్రిగ్‌సన్ (మరియ గోండ్స్ ఆఫ్ బస్తర్), సేతు మాధవరావు (ఎమాంగ్ ద గోండ్స్ ఆఫ్ ఆదిలాబాద్), విల్స్ (రాజ్‌గోండ్ మహారాజాస్ ఆఫ్ సాత్పూరా హిల్స్) లాంటి ప్రభుత్వాధికారులు రాసిన పుస్తకాలలో గోండు రాజ్యాల చరిత్ర దొరుకుతుందేమోగాని, చరిత్రకారుల పుస్తకాలలో మాత్రం దొరకదు.

మధ్యప్రదేశ్‌లో జబల్‌పూర్‌కు దగ్గరగా నర్మదా నదీతీరాన ఉన్న గర్హా - మండ్‌లా ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని పాలించిన గోండు రాజవంశం మొట్ట మొదటగా చెప్పుకోదగ్గది. 1564 లో అక్బర్ పాలనలో అది మొఘల్ సామ్రాజ్యానికి సామంత రాజ్యమయింది. సుమారు అదే సమయంలో మధ్యప్రదేశ్‌లోనే దిగువన ఉన్న దేవఘడ్ కేంద్రంగా మరొక గోండు రాజ్యం తన అధికారాన్ని స్థాపించుకొంది. 1780లో మరాఠీ రాజుల దాడిలో గర్హా గోండురాజ్యం చరిత్ర ముగిసిపోయింది. మరికొన్ని సంవత్సరాలకి దేవఘడ్ చరిత్రకూడ ముగిసిపోయింది. ఇవి రెండూకాక మూడో ప్రముఖ గోండు రాజ్యం చాందా కేంద్రంగా పాలించిన గోండురాజ్యం.

1329 దాకా పాలించిన కాకతీయుల అధికారం ప్రాణహిత తీరాన సిరిపూర్, చాందాల దాకా ఉండేది. ఆ తర్వాతే చాందా గోండు రాజ్యం ప్రాముఖ్యతలోకి వచ్చింది. అయితే ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఇతర ప్రాంతాలు, గోదావరి - పెన్‌గంగ తీరాల మధ్య ప్రాంతం బేరార్ కేంద్రంగా పాలించిన బహమనీ రాజుల పాలనలో ఉండేవి. 15వ శతాబ్ది చివరి రోజుల్లో బహమనీ రాజులు మొఘల్ సామ్రాజ్యానికి సామంతు లయ్యారు. ఆ తర్వాత కొద్దికాలానికే చాందా గోండురాజ్యం వాళ్ళకి సామంత రాజ్యం అయింది. 17వ శతాబ్దం ఆరంభంలో ఔరంగజేబ్ మరణానంతరం దేశమంతటా అన్ని రాజ్యాలలోనూ వచ్చిన అస్తవ్యస్త పరిస్థితుల్లో చాందా గోండురాజులు తిరిగి తమ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నారు గాని 1749లో నాగపూర్ మరాఠా రాజు భోంస్లే చాందా రాజ్యాన్ని ఆక్రమించుకున్నాడు. రాజు నీలకంఠషా నాగపూర్ జైల్లో నిర్బంధితుడయ్యాడు. ఎప్పుడు ఎక్కడ మొదలయిందో తెలియదుగాని గోండు రాజ్యం అంతం మాత్రం నాగపూర్ జైల్లో జరిగింది.

17వ శతాబ్ది చివరి భాగానికి ప్రస్తుత ఆదిలాబాద్ ప్రాంతం ఒకవైపు భోంసలే, మరోవైపు బహమనీ, ఇంకోవైపు నిజాం రాజ్యం కింద ఉండేది. 1803లో జరిగిన ఒప్పందంతో ఆదిలాబాద్ నిజాం పాలన కిందికి వచ్చింది. సుమారు శతాబ్ది కాలం పాటు ఈ ప్రాంతం షాపూర్ - తాండూర్ ఉపజిల్లాగా ఉండేది. అందులో రెండు డివిజన్లు: ప్రాణహిత ఒడ్డున సిరిపూర్ - రాజూర డివిజన్, పెన్‌గంగ దిగువన ఎద్లాబాద్ డివిజన్. తర్వాత కాలంలో ఎద్లాబాద్ ఆదిలాబాద్ అయ్యింది.

ఇంతకీ ఈ రాజుల చరిత్రంతా మనకెందుకవసరమంటే దానికీ ఆదిలాబాద్‌లో ఉన్న భూస్వామ్యానికీ ఉన్న సంబంధం తెలుసుకోవడానికి ఆదిలాబాద్ ప్రాంతంలో 15వ శతాబ్ది చివరి రోజులనుంచే రాజులకు శిస్తు వసూలుచేసే అధికారం ఉండేది. అయితే ఈ శిస్తు మైదానప్రాంతాలలాగ భూమిమీద ఉండేదికాదు. వ్యక్తిగత ఆస్తిగా కొంత భూమి, స్థిరంగా ఒక ప్రాంతంలో వ్యవసాయం లేనిచోట భూమిశిస్తు సాధ్యం కాదు. అందుకే శిస్తు కుటుంబాల ప్రాతిపదికమీద ఉండేది. గొడ్డలికింత అని, నాగలికింత అని సాంవత్సరిక పన్ను ఉండేది. ఇవి కాక శిస్తు వసూలుచేసే అధికారులకు ప్రజలమధ్య జరిగే పంచాయితీలలో జరిమానాద్వారా, పెళ్ళి, చావు వగైరా సందర్భాలలో సాంప్రదాయిక వసూళ్ళద్వారా ఇతర ఆదాయంకూడా ఉండేది. ఈ ఆదాయాలు సంపాదించే అధికారం ప్రాతిపదికగా ఆదిలాబాద్ గిరిజన సాంఘికవ్యవస్థలో అంతస్తులు ఏర్పడ్డాయి.

ఈ అంతస్తుల అట్టడుగున ఉండేది సాధారణ గోండ్లు, కొలామ్‌లు, పరధానులు, నాయకపోడులు. వీళ్ళపైన గ్రామపెద్దలు (పట్లా, సర్‌పట్లా). ఆపైన కొన్ని ప్రాంతాలలో దేశముఖ్‌లు, మరికొన్ని ప్రాంతాలలో జాగిర్దార్లు. ఎక్కువ ప్రాంతాలలో ముఖాసీలు ఉండేవారు. వీళ్ళపైన స్థానిక రాజకుటుంబాలుండేవి. కొన్నిచోట్ల స్థానిక రాజకుటుంబ సభ్యులే ముఖాసీలు. ఆదిలాబాద్‌లో ఈ రకం స్థానిక గోండురాజ్యాలు 37 ఉండేవి. ఇందులో అన్నిటికన్నా ఎక్కువ చరిత్ర ఇంద్రవెల్లి తర్వాత్తి రాజులది చివరిదాకా తన ప్రాబల్యాన్ని నిలుపుకున్నది సిరిపూర్ (తాలూకా కేంద్రం సిర్పూరు కాదు. ఉట్నూరు తాలూకాలో ఓ గ్రామం) రాజకుటుంబం. ఈ స్థానిక రాజులమీద చాందా (కాకపోతే

బహమనీ) రాజుకి వాళ్ళమీద మొఘల్ సామ్రాజ్యానికి అధికారం ఉండేది. శిస్తు వసూలుచేసే అధికారం ప్రాతిపదికగా ఏర్పడ్డ ఈ అంతస్తుల సమాజానికి కనీసం నాలుగువందల సంవత్సరాల చరిత్ర ఉంది. పైన రాజులు, రారాజులు ఎందరుమారినా స్థానికంగా ఈ భూస్వామ్య సాంఘిక సంబంధాలలో మార్పు వున్నట్టు కనబడదు.

గోండ్వానా గిరిజనులకి, దేశంలోవున్న ఇతరప్రాంతాల గిరిజనులకి మధ్య ఈ మౌలికమైన విభేదాన్ని మనం గుర్తించాలి. ఇతర గిరిజన ప్రాంతాలలో శిస్తు ప్రాతిపదికగా ఏర్పడే సాంఘిక సంబంధాలు ఇంతగా, ఇాతకాలంగా ఉన్నట్టు ఆధారాలు లేవు. ఐనా గోండు గిరిజన వ్యవస్థకు మైదానప్రాంత భూస్వామ్య సమాజంతో కంటె ఇతర గిరిజన వ్యవస్థలతోనే పోలిక ఎక్కువ.

ఈ శిస్తు వసూలుచేసే అధికారం నాలుగు శతాబ్దాలున్నా స్థానికంగా, బలంగా పాతుకోలేదు. మతపరంగా అంతస్తులులేని గోండు సమాజంలో, శిస్తుపరంగా ఏర్పడిన అంతస్తులు పైపైనే ఉండిపోయాయి. అందుకే మైదానప్రాంత సమాజాలలోలాగా ఇక్కడ నిర్దిష్టమైన వర్గవిభజన చేయడం కష్టం. అందుకు గోండు రాజ్యాలు సాపేక్షికంగా బలహీనమైనవి కావడం ఒక కారణం కావచ్చు. (మరాఠా, నిజాం, బహమనీ రాజ్యాలమధ్య, మొఘల్, బ్రిటిష్ సామ్రాజ్యాల మధ్య ఘర్షణలో నాలుగువందల సంవత్సరాలపాటు ఈ గోండు రాజ్యాలు చిక్కుకున్నాయి). అయితే అంతకన్న ముఖ్యకారణం అక్కడున్న వ్యవసాయం. స్థిరత్వంలేని సాగు భూస్వామ్యానికి స్థిరత్వానివ్వలేదు గదా. అందుకే దీన్ని మనం 'పైనుండి భూస్వామ్యం' (ఫ్యూడలిజం ఫ్రమ్ అబౌవ్) అని పిలుచుకోవచ్చు. స్థానికంగా ఆదిలాబాద్ గ్రామాలలో భూస్వామ్య దోపిడీపద్ధతులు సామ్రాజ్యవాద ప్రవేశం తర్వాతే బలపడ నారంభించాయి.

ఆదిలాబాద్ - సామ్రాజ్యవాదం

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ పాలనలోని ప్రాంతాలలో ప్రవేశపెట్టిన మార్పులన్నీ సంస్థానాలలో కొంచెం ఆలస్యంగా వచ్చాయి. గిరిజన ప్రాంతాలలో వాళ్ళ ప్రవేశానికీ, విధానాలకు, ఇతరప్రాంతాలలో విధానాలకు తేడా ఉంది కూడా. అంతకుముందు ఏలిన మహారాజులు గిరిజన ప్రాంతాలలో కప్పమో, శిస్తో వసూలు చేయడం మినహాయించి సాంఘికజీవితంలో పెద్దగా జోక్యం చేసుకోలేదు (ఆ పని కొన్ని ప్రాంతాలలో కొన్ని వందలసంవత్సరాలు కింద చేశారుగాని, ఆ కథ వేరు).

బ్రిటిష్‌వాళ్ళు మాత్రం ముడిసరుకుల కోసమో (ఛోటా నాగపూర్), రెవెన్యూ కోసమో (గంజామ్), సామ్రాజ్యరక్షణ కోసమో (నాగాలాండ్, మిజోరా) ఈ ప్రాంతాలలో ప్రవేశించారు. అందుకు అనుగుణంగా తమ ఆర్థిక, రాజకీయ విధానాల్ని, చట్టాల్ని ఏర్పరచుకున్నారు. మొత్తానికి ఆలస్యంగానయినా ఈ క్రమంలోకి సంస్థానాల్లోని గిరిజనులుకూడా రాక తప్పలేదు. ఆదిలాబాద్ అందులో భాగమే.

1793 లో బెంగాల్‌లో శాశ్వత సెటిల్‌మెంట్ పేరుతో సామ్రాజ్యవాదులు భూమిశిస్తు అధికారాలలో, పద్ధతులలో మౌలికమయిన మార్పులు తీసుకొచ్చారు. సుమారు ఎనభై సంవత్సరాల తర్వాత 1875లో సాలార్‌జంగ్ నవాబుగారు ఈ రకమైన చట్టాల్ని, వ్యవస్థను హైదరాబాద్ సంస్థానంలో ప్రవేశపెట్టాడు. ఒక్క కలంపోటుతో ఆదిలాబాద్‌లో స్థానిక గోండురాజులు, ముఖాసీలు, గ్రామపెద్దలచేతుల్లో ఉన్న అధికారాలన్నీ పోయాయి. క్రమక్రమంగా గిరిజనేతరులైన దేశముఖ్‌లు, దేశపాండేలు, జాగీర్దార్లు, పటేల్, పట్వారీలు ఈ ప్రాంతమంతా పాకుకున్నారు. (సిరిపూర్, చెన్నూరు తాలూకాలు అహెరి జమీందార్ అధికారంకింద వుండేవి). సుమారు అదేసమయంలో కాజీపేట - నాగపూర్ రైల్వేలైను ఏర్పడింది. 1889లో బొగ్గుగనులు వచ్చాయి. యీ రెంటికీ కలప అవసరం. ఆ కలపను రవాణా చేసేందుకు రోడ్లు అవసరం. శతాబ్దం తిరిగేసరికల్లా మంచిర్యాలనుంచి రాజూరాకు, నిర్మల్ నుంచి ఆదిలాబాదుకు రోడ్లు పడ్డాయి. 1918 కల్లా అడవి రక్షణచట్టం వచ్చింది. (బ్రిటిష్ పాలితప్రాంతాల్లో రైల్వేలైను 1853లో, బొగ్గుగనులు 1880లో, అడవి చట్టాలు 1865లో వచ్చాయి. అందుకే కాబోలు, బ్రిటిష్‌వాళ్ళు నిజాంను "విధేయుడైన మిత్రుడు" అని పిలిచేవాళ్ళు. మనం మన్నించాల్సిందల్లా ఈ ఆలస్యాన్నే!) 1905లో ఆదిలాబాదు ఒక ప్రత్యేక జిల్లా అయింది. అప్పటి ఇందూరు (ఇప్పటి నిజామాబాదు) జిల్లాలోనుంచి నిర్మల్, అప్పటి ఎలగందుల (ఇప్పటి కరీంనగర్) జిల్లాలోనుంచి చెన్నూరు, లక్సెట్టిపేట తాలూకాలు కొత్తజిల్లాలో భాగమయ్యాయి. చటాలలో, పాలనానిర్వహణలో, రవాణా సౌకర్యాలలో భూస్వామ్యానికీ, సామ్రాజ్యవాదానికీ పైన చెప్పినట్టు ఏర్పడే సంధికి నిర్మాణయుత రూపం అవసరమవుతుంది. ఆ నిర్మాణయుత సంధి ఇంకా కొనసాగుతోంది.

ఈ లోగా తీరప్రాంతాలలో ఉన్న సారవంతమైన నల్లరేగడి నేలలో పండే పత్తి, అడవిలో దొరికే కలప అదనపు విలువను సృష్టించగలవని స్పష్టమయింది.

ఆదిలాబాదు ప్రాంతంలో అతిస్వల్పకాలంలో అతివేగమైన మార్పులు రావడం ఆరంభమయింది

ఉత్తినే వచ్చిన భూములకోసం అదనంగా భూస్వాములు వచ్చారు వాళ్ళతో భూస్వామ్య ఆర్థిక,ఆర్థికేతర దోపిడీ పద్ధతులు ఆదిలాబాదులో వేళ్ళూనాయి. కలప కోసం అడవిరక్షణ చట్టాలు వచ్చాయి. వాటితోపాటు జంగ్లాత్ అధికారులు వచ్చారు. నిజాంరాజుకి భూమిమీద శిస్తూ, అడవిమీద ఆదాయం పెరిగే అవకాశం వచ్చింది. [ఈ వివరాలు సృజన ('మే' సంచిక) పాఠకులకు తెలిసినవే గనుక మళ్ళీ చెప్పడం లేదు] భూస్వాములకు, పెట్టుబడిదారులకు రాచరిక వ్యవస్థకు సామ్రాజ్యవాదానికి మధ్య ఐక్యతకు బలమయిన పునాది ఏర్పడింది. ఇందులో దోపిడీకి ప్రధానకారకులు భూస్వాములా, నిజాంరాజా, సామ్రాజ్యవాదులా అనే చర్చ శుద్ధ అకడమిక్ చర్చ. ప్రజలకు సంబంధించినంత వరకు వాళ్ళ మధ్య ఐక్యత ప్రధానాంశం.

ఈ పరిణామాల ఫలితంగా ఆదిలాబాదు గిరిజన జీవితంలో ప్రచండమయిన మార్పులు వచ్చాయి, వేలాది గిరిజనులు భూమిని కోల్పోయారు. అడవిని కోల్పోయారు. జిల్లా జనాభాలోనే మార్పులు వచ్చాయి. భూస్వాములు, వాళ్ళు ప్రోత్సహించి తీసుకొచ్చిన మైదానప్రాంత కౌలుదార్లు, తరలివచ్చిన రైతులు, రెవెన్యూ చట్టాలతో రెవెన్యూ అధికారులు, అడవిచట్టాలతో ఫారెస్టు అధికారులు - వందల వేల సంఖ్యలో గిరిజనేతరులు జిల్లాలో స్థిరపడ్డారు. జనసంఖ్య పెరిగింది. జనసాంద్రత పెరిగింది.

ఈ క్రమంలో 1840 తర్వాత కొన్నిమార్పులు వచ్చాయి. 1939లో కొమురం భీము నాయకత్వాన జరిగిన బాబేఝరి తిరుగుబాటు ఈ మార్పులకి ప్రధానమయిన కారణం. యాదృచ్ఛికంగా రెండేళ్ళు గడిచినతర్వాత ఆస్ట్రియాకు చెందిన మానవ పరిణామ శాస్త్రవేత్త క్రిస్టోఫ్ వాన్ ప్యురర్ - హేమెన్ డార్ఫ్ ఆదిలాబాదుకు వచ్చాడు.

అప్పటికే దేశంలోని ఇతర గిరిజన ప్రాంతాలలోనూ, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్ గోండు ప్రాంతాలలోనూ పరిశోధనలు జరిగినా, ఆదిలాబాదులో జరగలేదనే సదుద్దేశంతో ఆయన యీ ప్రాంతాన్ని ఎన్నుకున్నాడు. తీరా ఆయన వచ్చేసరికి రెండో ప్రపంచయుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. బొంబాయిలో ఆయన దిగినవెంటనే జర్మన్ ఏజెంటు అని చెప్పి బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను జైల్లోకి నెట్టింది.విడుదల అయినవాడు ఇంటికిపోక ఆదిలాబాదుకే చేరుకున్నాడు, అప్పటికే గిరిజనులలో భూమి

సమస్య సంక్షోభదశకు చేరుకుంది. మానవపరిణామ శాస్త్రం, సాంఘిక ఆచార వ్యవహారాలు వగైరాలన్నీ పక్కనపెట్టి ఆయన భూమిసమస్య అధ్యయనంలో పడ్డాడు. తన నోట్స్ ఆధారంగా 1942 లో నిజాం ప్రభుత్వానికి ఒక రిపోర్టు పంపాడు. మూడేళ్ళదాకా ఆ రిపోర్టును ఎవరూ పట్టించుకోలేదు. ఈ లోగా 1945లో విల్ఫ్రిడ్ గ్రిగ్‌సన్ అనే తెల్లదొరగారు నిజాం ప్రభుత్వానికి అడవి, పోలీసు, రెవెన్యూ శాఖల మంత్రిగా వచ్చాడు. (ఆయన మానవపరిణామ శాస్త్రవేత్తకూడా. బస్తర్‌లో గోండులమీద అప్పటికే ఓ పుస్తకం రాసిఉన్నాడు.) ఆయన హేమెన్‌డార్ఫ్ రిపోర్టులను ప్రచురించి, హేమెన్‌డార్ఫ్‌ను గిరిజన వ్యవహారాలపై నిజాంప్రభుత్వ సలహాదారుగా నియమించాడు గిరిజనులలో విద్యావ్యాప్తిద్వారా, గిరిజనులనే ఉద్యోగస్తులుగా నియమించడంద్వారా గిరిజన సమస్యలనుపరిష్కరించవచ్చునని హేమెన్‌డార్ఫ్ విశ్వాసం. [ఆయనలో మూర్తీభవించిన ఈ లిబరల్‌సంస్కరణ వాదం ఇటీవలి కాలంలో కొంచెం దెబ్బతిన్నట్టుంది. "కొన్ని ప్రతీపశక్తుల" బలంవల్లే గిరిజనుల పరిస్థితులు క్షీణించాయని తన కొత్త పుస్తకం-ట్రైబ్స్ ఆఫ్ ఇండియా-లో రాసుకున్నాడు. ఆదిలాబాదు గోండులతో తనకున్న అనుబంధమేకాక, వాళ్ళ పరిస్థితులు మెరుగుపరచడానికి తాను నిస్సహాయుణ్నని తెలుసుకోవడంకూడా తనను మరింత బాధిస్తుందని చెప్పుకున్నాడు. పుస్తకం చివరలో ఇంద్రవెల్లి కాల్పులపై ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కులసంఘం నివేదిక వేసి (ఇతర రిపోర్టులతోపాటు) ఈ రిపోర్టులలో వ్యక్తీకరించిన భావాలు "విషాదపూరిత వాతావరణంలో ఆశాకిరణాలు"గా వర్ణించాడు.]

ఏమయితేనేం, 1945 నుంచీ ఆదిలాబాదులో గిరిజనులను పట్టించుకోవడం మొదలయింది. 1946లో గిరిజన ప్రాంతాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా ప్రకటించి అక్కడి గిరిజనుల పాలనావ్యవహారాలలో, భూయాజమాన్యంలో కొన్ని రక్షణలు కల్పించే చట్టం ఒకటి వచ్చింది (హైదరాబాద్ ట్రైబల్ ఏరియాస్, దస్తూర్-ఉల్-అమల్, 1354 ఫసలీ) ఇదే తర్వాతకాలంలో మరింత సమగ్రమయిన చట్టంగా రూపొందింది. యీ చట్టంప్రకారం (ప్రస్తుత) ఆదిలాబాదు ప్రాంతంలో 421 గ్రామాలు షెడ్యూల్డ్ గ్రామాలుగా ప్రకటించబడ్డాయి. (ఇక్కడకూడా మనం రాజుగారి అలస్యాన్ని మన్నించాలి! ఈ రకం చట్టాలు పొరుగునఉన్న కోస్తా ఆంధ్ర ప్రాంతంలో 1917 లోనే వచ్చాయి). గిరిజనుల విద్య, ఆరోగ్యం వగైరా సంక్షేమ పథకాలకోసం ఒక స్పెషల్ ట్రైబల్ ఆఫీసరు పదవికూడా ఏర్పాటయింది. తిరుగు

బాటుకు ప్రతిచర్యగా వచ్చిన యీ సంస్కరణల ప్రభావాన్ని గిరిజనులు ఎంత అనుభవించారో మనకు తెలియదుగాని, నిజాం సంస్థానం మాత్రం చూడకుండానే పోయింది.

ఆధునిక భారతదేశం :

1948 సెప్టెంబరులో పోలీసుచర్యగా పిలువబడే మిలటరీ చర్యతో ఆదిలాబాదును సుమారు 150సంవత్సరాలు పాలించిన అసఫ్‌జాహీ రాజ్యం పతనమయింది. (పతనమైంది రాచరికమేగాని రాజు కాదు, సంస్థానాన్ని పడగొట్టిన తర్వాత మిలిటరీ చేసిన మొదటిపని ఘనత వహించిన నిజాం రాజును గవర్నరు (రాజప్రముఖ్) చేయడం] 1956లో భాషాప్రయుక్త పునర్విభజనతో తెలంగాణతోపాటు ఆదిలాబాదు ఆంధ్రప్రదేశ్‌లో భాగమయింది. అప్పటిదాకా నాందేడ్ జిల్లాలోఉన్న మధోల్ తాలూకా ఆదిలాబాదులో కలిసింది. ఆదిలాబాదులో ఉన్న రాజూరా, కిన్వట్ ప్రాంతాలు మహారాష్ట్రలో కలిశాయి.

ఇతర భూచట్టాలలో అప్పటినుంచి ఇప్పటిదాకా ఆంధ్రప్రాంత చట్టాలు ఆంధ్రప్రాంతానికి, తెలంగాణప్రాంత చట్టాలు తెలంగాణకు అలాగే ఉండిపోయాయి. కాని గిరిజన వ్యవహారాలలో మాత్రం ఆంధ్రప్రాంత షెడ్యూల్డ్ ఏరియా చట్టం తెలంగాణకు వర్తింపజేయబడింది. ఆదిలాబాదు గిరిజనులకి పాత చట్టంలో ఉన్న పాటి సౌకర్యాలు, రక్షణలు కూడా పోయాయి.

స్వాతంత్ర్యానంతరం భూస్వాములకి మరింత భూమి నాక్రమించుకునే స్వాతంత్ర్యం వచ్చింది. బిల్లాలకు వెదురువనం లీజుకు తీసుకునే స్వాతంత్ర్యం వచ్చింది కాయిదం మొదలుకొని తునికాకు దాక పెట్టుబడి అవసరాలకోసం అడవిని ధ్వంసంచేసే స్వాతంత్ర్యం వచ్చింది. కంట్రాక్టర్లు వచ్చారు. అధికారులు పెరిగారు యీ లోగా 60ల చివరిరోజులనుంచి ఇతర ప్రాంతాలనుంచి మరో పెద్దవలస తరలి వచ్చింది. (పెద్దఎత్తున జనసమూహాలు తరలివెళ్ళి మరోప్రాంతంలో స్థిరపడడం మన పాలకవర్గాల ఆర్థికవిధానాల దుష్పరిణామాలలో ఒకటి. జనసాంద్రత తక్కువగా ఉన్న ప్రాంతాలకు తరలివచ్చే యీ వలసప్రజలు సాధారణంగా సాంకేతికంగానూ, సాంస్కృతికంగానూ అభివృద్ధి చెందినవాళ్ళు కావడంతో యీ వలసలు ప్రజలమధ్య తరచుగా వైరుధ్యానికి దారి తీస్తున్నాయి. ప్రజలమధ్య అనైక్యత సృష్టించడానికి కులం, మతం కంటె యీ వైరుధ్యాలే ఇటీవలికాలంలో పాలకుల చేతిలో బలమైన ఆయుధాలవుతున్నాయి.

గిరిజనుల భూమి గిరిజనేతరుల చేతుల్లోకి పోకుండా ఉండడానికి కొన్ని చట్టాలు లేకపోలేదు. నిజానికి శ్రీకాకుళ పోరాటం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని రక్షణలు వచ్చాయి. అయితే ఆచరణలో ఈ చట్టాలు, రక్షణలు అన్నీ ఓ పెద్ద మాయ. మొదటిది, ఈ చట్టాలు కేవలం ప్రభుత్వం షెడ్యూల్డ్ ప్రాంతాలుగా ప్రకటించిన ప్రాంతాలలో మాత్రమే వర్తిస్తాయి. ఆదిలాబాద్‌లో ఉన్న 1609 గ్రామాలలో 409 గ్రామాలు మాత్రమే షెడ్యూల్డ్ గ్రామాలు. రెండోది, ప్రభుత్వం గిరిజనులుగా గుర్తించినవాళ్ళకి (షెడ్యూల్డ్ ట్రైబ్స్) మాత్రమే ఈ రక్షణలు. ఎవరు గిరిజనులు, ఎవరుకారు అనే నిర్ణయం ప్రభుత్వం తన చిత్తం వచ్చినట్టు చేసుకోవచ్చు. 1976లో తెలంగాణా అంతటా లంబాడీలను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌గా ప్రభుత్వం గుర్తించింది. పొరుగుప్రాంతాలనుంచి ఎప్పటినుంచో ఉట్నూరు తాలూకాకు వస్తూ స్థిరపడుతున్న బంజారాలందరూ షెడ్యూల్డ్ ట్రైబ్‌లయ్యారు. అప్పటికే వాళ్ళ చేతుల్లోకి పోయిన భూమికి వాళ్ళు చట్టబద్ధంగా యజమానులయ్యారు. (తాను సృష్టించడానికి ప్రయత్నిస్తున్న ఈ వైరుధ్యాన్ని ఆధారం చేసుకునే ఇంద్రవెల్లి సభను ప్రభుత్వం నిషేధించింది.) ఒక దానితో ఒకటి సంబంధంలేని రెండు ప్రభుత్వ శాఖలు (రెవిన్యూ, ఫారెస్ట్) ఈ చట్టాల్ని అమలు పరుస్తుంటాయి. ఏది అడవి, ఏది భూమి అని ఆ రెండూ తగవులాడుకుంటూ ప్రజల్ని వేధిస్తాయి. ఉదాహరణకి ఆదిలాబాద్‌లో అడవి 25 శాతం అని రెవెన్యూ శాఖ అంటే 43.5 శాతం అని అటవీశాఖ అంటుంది. ఈ చట్టాల గొడవ గిరిజనులకి అర్థం కాదు. అర్థమయిన వాళ్ళు దరఖాస్తు పెట్టుకోవాలంటే నిజామాబాద్ పోవాలి. రెవెన్యూశాఖ తన విచారణ తతంగమంతా పట్వారీల రికార్డుల ఆధారంగా చేస్తుంది. ఏళ్ళుపూళ్ళు గడిచినతర్వాత పొరపాటున కేసు గిరిజనులపక్ష తేలితే భూస్వాములు కోర్టుకువెళ్ళి స్టే తెచ్చుకుంటారు. నిరంతరాయంగా జరుగుతున్న ఈ భూపరాయీకరణతో గిరిజనులు భూమిలేని నిరుపేదలయ్యారు. సమగ్ర గిరిజనాభివృద్ధి పథకం (ఐ టి డి ఎ) పేరుతో ప్రభుత్వం కొన్ని ప్రాంతాలలో తీసుకొస్తున్న 'హరిత విప్లవం' వాళ్ళను మరింత దోపిడీకి గురిచేస్తుంది. ఈ సౌకర్యాలు చూసి మన మేధావులు వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ విధానం ఎంత ప్రవేశించిందో లెక్కలు కడుతూ ఉంటారు. కాని ఈ పెట్టుబడి ఫ్యూడల్ దోపిడీ పద్ధతులను మరింత తీవ్రతరం చేస్తుంది.

ఈ లోగా అడవిమీద ప్రభుత్వం కంట్రోలు, దోపిడికూడా పెరిగిపోయాయి. దేశ, విదేశ పెద్ద పెట్టుబడిదారులు, ప్రభుత్వ కార్పొరేషన్లు, వాళ్ళ కంట్రాక్టర్లు అనేకరూపాల్లో ఈ దోపిడీని కొనసాగిస్తున్నారు. యాజమాన్యంలోనూ, అధికారం లోనూ ఈ దోపిడీలో పైకి కనిపించే తేడాలెన్ని ఉన్నా, సారాంశంలో వాటిస్వభావం ఒక్కటే. గత మూడు దశాబ్దాలలో ఆదిలాబాద్‌లో దొరికే ఖనిజసంపద ఆధారంగా ఎన్నో పరిశ్రమలు వెలిశాయి. కాని వాటిలో గిరిజను లెక్కడా కనబడరు. పరిశ్రమ ఆరంభ కాలంలో నిర్మాణపు పనులకూ, తర్వాత ముడిసరుకుల కోసమూ గిరిజనులను కంట్రాక్టు కార్మికులుగా ఫ్యూడల్ పద్ధతులలో దోచే పెట్టుబడి, తర్వాత దశలలో గిరిజనులను ప్రోత్సహించదు. ఎటుపోయినా ఈ భూస్వామ్య సామ్రాజ్యవాద వ్యవస్థ గిరిజనులను క్రూరమైన దోపిడీకి గురిచేస్తుంది.

ఈ ఆర్థిక పరిణామాలన్నింటితోపాటు గిరిజనుల సాంఘిక జీవితంలో సాంస్కృతికంగా కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. గురుదేవ్ సేవా మండల్ లాంటి మత సంస్కరణోద్యమాలతో హిందూ సాంప్రదాయాలు ప్రచారంలోకి వచ్చాయి. నలభై ఏళ్ళ కింద కేస్లాపూర్ జాతరలో ఒక గుట్టమీద నాగోబా ప్రతీక, దాని చుట్టూ కర్రబద్దలతో కట్టిన పందిరిమీద గడ్డి తప్ప మరేమీలేదు. ఇవాళ అక్కడ హిందూ సాంప్రదాయ రీతిలో కట్టిన ఓ పెద్దగుడి వెలిసింది. దీనికవసరమయిన ఆర్థిక సహాయాన్ని తిరుపతి దేవుడూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమూ కలిసి చేశాయి. కుల, వర్గ ప్రాతిపదిక మీద ఏర్పడిన హిందూ మత సాంప్రదాయాన్నీ, ఆచార వ్యవహారాల్నీ పని గట్టుకుని గిరిజనులకు అంటగట్టే ప్రయత్నం జరిగింది. పాలనా వ్యవహారాలలో వందల సంవత్సరాలుగా కొనసాగుతున్న గిరిజన పంచాయితీలు పోయి, ఆధునిక పంచాయితీ రాజ్‌లు (ఇప్పుడు మండలాలు) వచ్చాయి. గిరిజన న్యాయ వ్యవస్థ పూర్తిగా పోయింది. గోండు గిరిజనుల సంస్కృతిని, చరిత్రను తమ మౌఖిక సాహిత్య సాంప్రదాయంలో భద్రపరిచిన పరధానులు, వాళ్ళ పాత్ర చిన్నాభిన్నమయి పోయింది.

ఒక శతాబ్ది కాలంలో గిరిజనుల రాజ్యంపై, భూమిపై, అడవిపై, మతంపై, సంస్కృతిపై, పరిపాలనా, న్యాయ వ్యవస్థలపై క్రమక్రమంగా భూస్వామ్య, సామ్రాజ్యవాద కలయిక తన నియంతృత్వాన్ని, ఆధిపత్యాన్ని ఏర్పరచుకొంది. పునాదిలోనూ, ఉపరితలంలోనూ గిరిజన సాంఘికవ్యవస్థ తన ఉనికిని పోగొట్టుకుంది.

ఇది ఆదిలాబాద్ కథ. అయితే ఇది ఒక వక్షం సాగించిన నల్లేరుమీది బండి నడకకాదు. ఆ క్రమంపై ప్రజల ప్రతిచర్య, తిరుగుబాటుకూడా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఈ తిరుగుబాట్ల వివరాలు ఇప్పుడే వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పోరాటం విస్తృతిలోనూ, దృక్పథంలోనూ అన్నిటికన్నా పురోగామి ఉద్యమం. 1939 - 40 లలో కొమురం భీము తిరుగుబాటు ఈ శతాబ్ది మొదటి భాగంలో చెప్పుకోదగ్గ తిరుగుబాటు. అంతకుముందు పందొమ్మిదో శతాబ్దంలో రాంజీగోండు నాయకత్వంలో జరిగిన తిరుగుబాటు చెప్పుకోదగ్గది. దశాబ్ది కాలంపాటు దక్కన్ ప్రాంతమంతా బ్రిటిష్‌వాళ్ళను వేధించిన రోహిల్లా తిరుగుబాట్ల ప్రభావంలో వచ్చిన రాంజీగోండు తిరుగుబాటు 1860 ఏప్రిల్‌లో నిర్మల్‌లో రాంజీగోండును బ్రిటిష్‌వాడి కోరికమీద నైజాం రాజు ఉరితీయడంతో ముగిసింది. (ఫ్రీడం స్ట్రగుల్ ఆఫ్ హైదరాబాద్, రెండోసంపుటి).

ప్రస్తుతం పోరాటంలో ఉన్న ప్రజల జ్ఞాపకాలలో మాత్రం తిరిగి ప్రాణం పోసుకుంటున్నది బాబేఝరి తిరుగుబాటు.

నవల - చరిత్ర

ఈ తిరుగుబాటు గురించే సాహూ, అల్లం రాజయ్య కలిసి ఈ నవల రాశారు. తెలంగాణా విమోచనోద్యమం - తెలుగు నవలపై పరిశోధించిన వరవరరావు ముందు మాట రాశారు. 1976 చివరి దినాలనుంచి ఆదిలాబాద్ గిరిజన ప్రాంతాలలో మొదలయిన ఉద్యమం, ఇంద్రవెల్లి సంఘటన ఈ రచయితలకి ప్రేరణ.

కొమురం భీము తిరుగుబాటును గురించి ప్రభుత్వ రికార్డులలో ఉండే సమాచారాన్ని (చరిత్రకారుల భాషలో ప్రైమరీ సోర్సెస్) ఈ రచయితలు సేకరించారు. అదే సమయంలో విడిగా జరిగిన నిజనిర్ధారణ కమిటీ నివేదికను పరిశీలించారు. రెండేళ్ళ తర్వాత వచ్చిన హేమన్‌డార్ఫ్ రచనలు అధ్యయనం చేశారు. ఈ రకంగా లిఖిత

రూపంలోవున్న సమాచారం మొత్తం ఆధారంగా తిరుగుబాటు కథనం తెలుసుకున్నారు. (ఇందుకు పరోక్షంగా ఉపయోగపడే క్రీడం స్ట్రగుల్ ఆఫ్ హైదరాబాద్ సంపుటాలను మాత్రం పరిశీలించినట్టు లేదు). ఈ లిఖితరూప చరిత్రను ప్రజల మౌఖిక సాంప్రదాయాలలో, జ్ఞాపకాలలో, మరుగున పడిన చరిత్రతో బేరీజు వేశారు. ఆ క్రమంలో అనేకమంది ప్రజలను ఇంటర్వ్యూ చేశారు. పోరాటంలో భీముకి సన్నిహితుడుగా ఉండిన కొమురం సూరును వెతికి పట్టుకొని ఆయన కథనం విన్నారు. మౌఖిక చరిత్ర ఆధారంగా లిఖిత చరిత్రను తిరస్కరించవలసినంత తిరస్కరించారు. పరస్పరం సంఘర్షించిన శక్తులలో పుట్టిన చరిత్రకు రెండు విభిన్న కథనాలు వుండడం అనివార్యమే. ఇందులో ఈ చరిత్రకారులిద్దరూ ప్రజల కథనాన్ని, ప్రక్రియను ప్రమాణంగా తీసుకొని ప్రజలపక్షం నిలిచారు. చరిత్రను పరిశోధించడానికి కావల్సిన గతితార్కిక పద్ధతికి ఇంతకంటె మంచి ఉదాహరణ లేదు. (ఈ పద్ధతి గురించి అకడమిక్ చరిత్రకారులలో ఇప్పటికీ గందరగోళం పోలేదు. ఆసక్తి వున్నవాళ్ళు రణజిత్ గుహ రాసిన 'ఎలిమెంటరీ ఆస్పెక్ట్స్' ఆఫ్ పెజంట్ ఇన్సర్జెన్సీ ఇన్ కలొనియల్ ఇండియా' పుస్తకాన్ని, సుమిత్ సర్కార్ రాసిన 'మిడిల్ క్లాస్ లీడర్‌షిప్ అండ్ పాపులర్ మూవ్‌మెంట్స్' 'ఎన్ అప్రోచ్ టు హిస్టరీ ఫ్రమ్ బిలో' అన్న పుస్తకాన్ని చదువుకోవచ్చు).

మొత్తంగా రెండు మూడేళ్ళపాటు సాగిన ఈ చరిత్ర పరిశోధనా ఫలితానికి కళాత్మక రూపాన్నిస్తూ ఈ నవల రాశారు. అందుకే ఈ నవలపై సమీక్ష చారిత్రక విమర్శకు, సాహిత్య విమర్శకు మధ్య రేఖల్ని గుర్తించడం లేదు.

మార్క్సిస్టు దృక్పథంతో చరిత్రను పరిశీలించే వాళ్ళు విరుద్ధ శక్తుల మధ్య సంఘర్షణని మాత్రమే చరిత్రగా పరిశీలిస్తూ, అందులో ప్రజల చరిత్రపై తమ దృష్టిని కేంద్రీకరించి, ఆ ప్రజలు వాళ్ళ చరిత్రను ఎలా చూస్తున్నారో పరిగణనలోకి తీసుకోవాలి. స్థూలంగా దీన్ని గతి తార్కిక పద్ధతి అని చెప్పుకోవచ్చు. అయితే దానికి చారిత్రక, భౌతికవాద దృక్పథాన్ని జోడించడం కూడ అవసరం. సామాజిక వ్యవస్థలలో వచ్చే గుణాత్మక మార్పులను అర్థం చేసుకోగల విశ్లేషణాశక్తిని చారిత్రక భౌతికవాదం మనకిస్తుంది. దాని నాధారం చేసుకొని, గతితార్కిక పద్ధతిలో మనం ఒక ప్రాంతం నిర్దిష్ట చరిత్రను పరిశోధిస్తే ఆ యా కాలాలలో, ఆయా సమా

జాలలో ఏది చారిత్రికంగా సాధ్యమో కాదో (హిస్టారికల్ పాసిబిలిటీ) తెలుసు కోవచ్చు. లిఖిత చరిత్రను పరిశీలించడానికి మౌఖిక చరిత్ర ప్రమాణమయినట్టె రెంటినీ పరిశీలించడానికి గతితార్కిక, చారిత్రక భౌతికవాద పద్ధతి ప్రమాణమవుతుంది. "ప్రజలే చరిత్ర నిర్మాతలు, కాని వాళ్ళు కూడ తమ ఇష్టప్రకారం చరిత్రను నిర్మించ లేరు" అన్నాడు మార్క్స్.

ఆ రకంగా చూస్తే ఈ నవలలో ఒకే ఒక్క అవగాహనాలోపం ఉన్నట్టు కని పిస్తుంది. నవల చివరి భాగంలో కొమురం భీముకి వ్యవస్థలో ప్రగతిశీలమయిన మార్పు మీదా, దేశంలో జాతుల ఐక్యత మీదా, రాజ్యాధికారంలో గుణాత్మక మార్పు మీదా ఒక అవగాహన ఉన్నట్టు ధ్వనింపజేశారు. ఎప్పుడయినా ఏ పోరాటమయినా సామాజిక మార్పులకి, జాతుల ఐక్యతకి, రాజ్యాధికారంలో మార్పులకి ఏదో ఓ రూపంలో తోడ్పడవచ్చు. కాని ఆ పోరాట నాయకత్వానికి ఈ మూడింటి మీద (ఎంత అస్పష్టం గానయినా సరే) అవగాహన మాత్రం శ్రామికవర్గ భావజాల సహాయం లేకుండా రావడం చారిత్రికంగా అసాధ్యం. అది సాధ్యమవుతుందని భావించడం చరిత్రపై మార్క్సిస్టు దృక్పథాన్ని నిరాకరించడమే. నిజానికి ఈ మూడింటి మీద రచయితల దృష్టిలో కొమురం భీముకు ఉన్నపాటి అస్పష్ట అవగాహన 1930లలో కమ్యూ నిస్టు పార్టీకి కూడ పూర్తిగా లేదు. పార్టీలో, పార్టీ నాయకత్వం వహించిన ఉద్య మాలలో ఈ అవగాహన స్పష్టమయిన రూపం తీసుకుంది రెండవ ప్రపంచ యుద్ధం తర్వాతనే.

భారత దేశంలో జరిగిన గిరిజన, రైతాంగ పోరాటాలన్నిటినీ మనం మూడు రకాలుగా విభజించవచ్చు. గతించిన కాలం కోసం జరిగిన పోరాటాలు (ముఖ్యంగా 19వ శతాబ్దం అంతా), రానున్న సమాజం కోసం స్పష్టమైన రాజకీయ అవగాహనతో జరిగిన పోరాటాలు (రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత), ఈ రెంటికీ మధ్యస్తంగా ఉండే అసంకల్పిత పోరాటాలు (ముఖ్యంగా ఇరవయ్యో శతాబ్ది మొదటి భాగంలో). ఐతే వీటిలో కూడ రాజ్యాధికార ప్రస్తావన లేకుండా పోలేదు. కాని అక్కడ అప్పుడు రాజ్యం (కింగ్‌డమ్) అనే భావనకూ, మార్క్సిస్టు దృక్పథంలో రాజ్యాంగ యంత్రం (స్టేట్) అనే భావనకూ పొంతనలేదు. ఈ పోరాటాలలో ప్రత్యేకించి గిరిజన పోరా టాలన్నీ సాయుధ పోరాటాలే. వీటిలో సాయుధ పోరాటం వ్యూహాత్మకంగా వచ్చిన

భావన కాదు, సాంప్రదాయకంగా వచ్చిన సంస్కృతిని. కొమురం భీము తిరుగుబాటు నిర్దిష్ట చరిత్రను, ఈ సాధారణ చారిత్రక కాన్వాస్‌లో మాత్రమే మనం అర్థం చేసుకోగలం.

అయితే ఒక విషయం మాత్రం చెప్పుకోవాలి. ఈ పుస్తకంలో భీము తిరుగుబాటు గురించిన అవగాహనా లోపం ఒక చారిత్రక దృక్పథంగా రాలేదు. నవలా రచయితల కల్పనా క్రమంలో భాగంగా వచ్చింది. అందుకే ఈ చర్చనిక్కడ ముగించి మనం నవల గురించి చెప్పుకోవచ్చు.

చిన్న చిన్నవి కాబట్టి ముందుగా లోపాల గురించి చెప్పుకుందాం. ఈ నవలలో వాడిన భాష ఒక నియమాన్ని పాటించలేదు. మధ్యలో రచయితల కథనం అంతా కొంత కరీంనగర్ మాండలికంలో, కొంత కోస్తా ఆంధ్ర ప్రాంత ప్రామాణిక తెలుగులో సాగింది. పాత్రలు కూడ పాత్రోచిత భాషని పుస్తకమంతా ఒకేలా వాడలేదు. గోండు పాత్రలు ఆదిలాబాదు మాండలికాన్ని వాడడమేకాక కోస్తా తెలుగుని కూడా వాడాయి. గిరిజనుల భాషలో ఇప్పుడు జరిగినన్ని మార్పులు 1930ల నాటికే జరిగి ఉండకపోవచ్చు. భాష విషయంలో నవల పొడుగునా ఒకే నియమాన్ని పాటించకపోవడం కథాగమనాన్ని దెబ్బతీయలేదు గాని నివారించుకోదగ్గ నిర్మాణ లోపమే. ఇక కథాక్రమంలో కొమురం భీము జంగ్లాతోళ్ళ పెట్టిన కేసులో ముద్దాయి కాదని సూచించినా (పే. 149–156) తర్వాత కోర్టు దృశ్యంలో మాత్రం ఉన్నాడు. అలాగే సుబేదారు అజర్ హసన్ తలమునకలవుతున్న సమస్యలలో తెలంగాణా పోరాటాన్ని ప్రస్తావిస్తూ, ఆ పోరాటాన్ని 1939లోనే తర్వాతి కాలంలో వచ్చిన స్వభావాన్ని సంతరించుకున్నట్టు సూచించారు (పే. 205). బాబేఝురి కేంద్రంగా భీము నాయకత్వంలో పోరాడిన గ్రామాలలో రెండు మూడు గ్రామాలపేర్లు ఒక చోట ఒకరకంగా, మరోచోట మరోరకంగా రాశారు. అప్పట్లో జనగాం, ఆసిఫాబాద్ రెండు ఒకటేగాని పుస్తకం అంతా ఒకే పేరు వాడలేదు. (ఇంతకీ కొమురం భీము హత్య చేయబడ్డ 1940 సెప్టెంబర్ ఒకటో తేదీ బుధవారం కాదు, ఆదివారం).

ఈ టెక్నికల్ లోపాలు మినహాయిస్తే ఈ నవలలో బలంగా కనబడేది వాతావరణం. అడవి, ప్రజలు, వాళ్ళ జీవితం, సంఘర్షణ జరిగిన వాతావరణాన్ని నవల అద్భుతంగా ప్రతిఫలించింది. ఏకబిగిని చదివించి పాఠకుడిలో అనిర్వచనీయ

మైన అనుభూతుల్ని ప్రేరేపిస్తుంది. ప్రజలను, ప్రజా పోరాటాలను అభిమానించే వాళ్ళెవరూ ఈ నవల కవితాఝురిలో కలిగించే అనుభూతుల ప్రకంపనాలను అనుభవించకుండా ఉండలేరు. ఈ రకం బలవత్తర కళారూపం మీద ముందు మాటలో రచయితలు కోరినట్టు నిష్పాక్షిక (ఆబ్జెక్టివ్) విమర్శ చాల కష్టమయిన విషయం. అయితే అలా చెయ్యకపోవడం ఈ రచయితలు పడ్డ శ్రమకి, వాళ్ళు చూపించిన పద్ధతికి, వాళ్ళ రచనా శక్తికి అన్యాయం చేయడమే అవుతుంది. ఏమయినా కొండ మీద ఎత్తుపల్లాలు కొండ ఎత్తుని నిర్ణయించలేనట్టు ఈ నవలలోని లోపాలు ఈ నవలతో తెలుగు సాహిత్యం చేరుకున్న శిఖరాగ్రాలను తక్కువ చెయ్యలేవు.

తెలుగులో నవలా ప్రక్రియ విదేశీ సంస్కృతి ప్రభావంతో, మధ్యతరగతి పుట్టుకతో వచ్చింది. కందుకూరి వీరేశలింగంతో మొదలైన ఈ ప్రక్రియ ఇటీవలి కాలంలో యండమూరి వీరేంద్రనాథ్ దశకు చేరుకుంది. చదువులు వచ్చి, పత్రికలు చదివే పాఠకులు పెరుగుతున్న కొద్దీ నవల ప్రాచుర్యం కూడ పెరుగుతూ పోయింది. మొన్న మొన్నటి దాకా తెలుగు సాహిత్యంలో కవుల కున్నంత పేరు, పరపతి నవలా రచయితలకుండేవికావు. ఇవాళ స్థితి తారుమారయింది. నవల బజార్లో అమ్ముకుంటే డబ్బులు చేసిపెట్టగల శక్తి సంపాదించుకుంది. పత్రికా వ్యాపారస్తుల లాభాకాంక్ష, రచయితల కెరీరిజం ఒకదాన్నొకటి పెంపొందించాయి. ఈ క్రమంలో కథా వస్తువు క్షీణించి, సామాజిక వాస్తవికత పూర్తిగా మృగ్యం అయిపోయింది. ఈ క్షీణత నవలా ప్రక్రియని, నిర్మాణాన్ని కూడ క్షీణింపజేసింది. జీవితంలో ఉండే సంకీర్ణతను వైరుధ్యాన్ని అన్ని కోణాల నుంచి ఏక కాలంలో ప్రతిఫలించగల నవలా ప్రక్రియ, కేవలం పాఠకులలో ఉత్కంఠను మాత్రమే కలిగిస్తూ నడిచే కథనం (నెరేటివ్) అయి కూచుంది.

అయితే తెలుగు నవలల్లో ఈ ధోరణికి విరుద్ధంగా వస్తురీత్యా, నిర్మాణరీత్యా వైవిధ్యంగల నవలలు రాకుండాపోలేదు. మాలపల్లి, ప్రజలమనిషి, గంగు మొదలయిన నవలల్లా ఉద్యమ ప్రభావంలో వచ్చినవయినా, అభ్యుదయ, విప్లవ సాహిత్యోద్యమాలతో సన్నిహిత సంబంధంగల రచయితలు రాసిన నవలలయినా - ఈ రెండో ధోరణి ఉద్యమాల ప్రభావాల వల్లనే వచ్చింది — ఉద్యమాన్ని నవలకు ఒక అవసరంగా స్వీకరించాల్సి ఉంది. ఈ అవసరాన్ని గుర్తించిన 'కొమురంభీము' నవలతో తెలుగు నవలా ప్రక్రియ ఒక అడుగు ముందుకేసింది.

అయితే ప్రక్రియగా నవలకు కొన్ని పరిమితులున్నాయి. ఒక నిర్దిష్టమైన కాలంలో, ప్రాంతంలో ఒక వర్గం ప్రక్రియగా ముందుకొచ్చిన కళారూపమేదయినా మరోకాలంలో, మరోప్రాంతంలో, మరోవర్గ జీవితాన్ని, పోరాటాన్ని ప్రతిఫలింప జేయడానికి ఉండే పరిమితే ఈ పరిమితి. (నక్సల్‌బరీ బిడ్డలు కథని ఎవరయినా ఒగ్గు కథలో చెప్పగలరుగాని, భరతనాట్యంలో చెప్పలేరుగదా!). అయితే ఈ నవల భాషలో, కథ చెప్పే పద్ధతిలో మౌఖిక సాంప్రదాయాలను పాటించి ఆ పరిమితులను కొంత మేరకు దాటగలిగింది. ఈ నవలలో అందుకు అద్భుతమైన ఉదాహరణ తేయాకు తోటల రేకుషెడ్డులో మన్నెందొర చెప్పే సీతారామరాజు కథ. ఆ కథవింటూ భీములో కలిగిన అనుభూతులు. మన్నెందొర సీతారామరాజు మరణందాకా చేరుకునే లోగా తెల్లవారి ఆ కథ అక్కడే ఆగిపోతుంది.

ఎప్పుడో వందేళ్ళ కింద పంతులుగారు ఎవడో ఓ రాజశేఖరుడి చరిత్రను గ్రాంథికంలో రాయగా మొదలయిన తెలుగు నవల, కొమురం భీముతో ప్రజల చరిత్రకు, మౌఖిక సాంప్రదాయాలకు చేరుకుంది. ఆ క్రమంలో చరిత్రగమనాన్ని గురించి ఒక ప్రాథమిక సూత్రాన్ని ఈ నవల (బహుశా అసంకల్పితంగా) ఆవిష్కరించింది.

ప్రజలే చరిత్ర నిర్మాతలు. వాళ్ళు వర్తమాన చరిత్రను నిర్మించే క్రమంలోనే గత చరిత్రకు అర్థం ప్రయోజనం కలుగుతాయి. కొమురంభీము నాయకత్వంలో పోరాడిన ప్రజలకు, అంతకుముందు ఎనభై ఏళ్ళ కిందట రాంజీగోండు పోరాటం యాదుకొచ్చి ప్రేరణనిస్తే, మరో యాభై ఏళ్ళు గడిచేంతర్వాత పోరాడుతున్న ప్రజలకి భీము యాదుకొచ్చాడు. ప్రజలు తమదిగా భద్రపరచుకున్న చరిత్రే చరిత్రను మార్చడానికి ఉపయోగపడుతుంది. ఆ క్రమంలో చరిత్ర నిర్మాతలే చరిత్రకారులవుతారు. అంతేకాదు తమ చరిత్రను తాము చూసే దృక్పథాన్నికూడ అభివృద్ధిచేసుకుంటారు. రాంజీగోండునుంచి భీముకు, భీమునుంచి ఇంద్రవెల్లికి ప్రజలలో శాస్త్రీయ, చారిత్రక దృక్పధం పెరుగుతూ వస్తుంది. ఆ క్రమంలోనే చరిత్రనుకూడ దోచుకున్న 'దుర్మార్గ శతాబ్దాల విషాద వారసత్వాన్ని' వాళ్ళు నిరాకరిస్తారు. ఆ వర్గ పోరాటాల క్రమమే చరిత్ర. ఆ చరిత్రను ప్రతిఫలించగలిగిందే 'విప్లవ సాహిత్యం'.

కొమురంభీము-నవల-సాహూ, అల్లం రాజయ్య, పి. బి. సి ప్రచురణలు, హైదరాబాద్ (ఏప్రిల్ 83) 238 + 18 పేజీలు, 6 ఫోటోలు, 1/8 డెమ్మీ, 8 రూపాయలు. ప్రతులకు : పీస్ బుక్ సెంటర్ 4–5–421, సుల్తాన్ బజార్, హైదరాబాద్ 500 001 లేదా సృజన, హనుమకొండ 506001.



Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu' Printed at Sri Lata Art Printers, Vijayawada for Venkataramana Mudranalayam, Warangal

సవరణ

ఈ సంచికలో 61 పేజీలో 'బస్తర్ పటం' అని అచ్చయింది బస్తర్ పటంకాదు, 'ఆదిలాబాద్ జిల్లా పటం'. ఇంద్రవెల్లి గుడిహత్ నూర్-ఆదిలాబాద్ జాతీయ రహదారిపై లేదు. గుడిహత్ నూర్ నుంచి తూర్పువైపు ఉంటుంది. ఈ పటంలో 'రగల్ రాజ్యం మైసివాకట్ ' వద్ద ఉండవలసింది.

ఇంద్రవెల్లిపై విరసం కవితా సంకలనం

తుడుం

42 పేజీలు

రూపాయి పావలా

ప్రతులకు :

సి. ఎస్. ఆర్. ప్రసాద్, సి - 108,
శ్రీనివాసనగర్,
గుంటూరు, 522006

లేదా

సృజన,
హనుమకొండ, 506001

వెలువడినవి !

మహారాష్ట్ర కొండకోనల్లో ఊపిర్లు పోసుకొంటున్న

ఆదివాసి పోరాటాలు

రగల్ జెండా పాటలు

హిందీ తెలుగు లిపిలో గోండు భాషలో

56 పేజీలు


150 పైసలు

ఎర్రజెండా పాటలు


మాడియా కోలాం భాషల్లో

75 పైసలు

ప్రతులకు, వివరాలకు : పీస్ బుక్ సెంటర్, 4-5-421, సుల్తాన్ బజార్,
హైదరాబాద్ - 500 001.



ఇంద్రవెల్లి స్థూపం


ఆకాశం అలలమధ్య
కొండ సిగలో సూర్యుడు
గోండన్నలు మోగించిన
తుడుం పిలుపు సూర్యుడు